రాజశేఖర చరిత్రము
రూ॥ 180/-
పేజీలు: 190




ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



సిపిఐ జోక్యంతో కదులుతున్న డొంక
వెలుగులోకి ధర్మస్థలి భయంకర రహస్యాలు

ఆర్మేనియా– అజర్‌బైజాన్ శాంతి ఒప్పందం

15న అలాస్కాలో పుతిన్ – ట్రంప్ భేటీ

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 250 | ఆదివారం | 10-08-2025 | ఖమ్మం Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# 'గేట్ వే ఆఫ్ హైదరాబాద్'

● హిమాయత్‌సాగర్ వద్ద ఒఆర్ఆర్‌పై గ్రేటర్ సిటీ ముఖద్వారం ● గాంధీ సరోవర్‌కు స్వాగత తోరణం ● అత్యంత ఎత్తుగా ఐకానిక్ టవర్ ● బహుళ ప్రయోజనాలుండేలా మూసీ పునరుజ్జీవం ● రెండు నెలల్లో టెండర్లు పిలిచేందుకు వీలుగా పనుల వేగం పెంచాలి ● అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ కోర్ అర్బన్ సిటీ ఏరియాలో చేపట్టే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్‌ను బహుళ ప్రయోజనాలు ఉండే విధంగా అత్యంత అధునాతనంగా నిర్మించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను అదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు స్వాగతం పలికేలా హైదరాబాద్ ముఖద్వారంగా హిమాయత్‌సాగర్ గాంధీ సరోవర్



దగ్గర ఒఆర్ఆర్‌పై గేట్ వే ఆఫ్ హైదరాబాద్ నిర్మించాలని సూచించారు. ఒఆర్ఆర్ కు ఒక వైపున ఎకో థీమ్ పార్క్ అభివృద్ధి చేసి మరోవైపు బాపూ ఘాట్ వైపు భారీ ఐకానిక్ టవర్ నిర్మించాలని, అందుకు తరువాయి 2లో



సిఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కడుతున్న మంత్రులు సీతక్క, కొండా సురేఖ



## గుడిసెలపై కూలిన భారీ గోడ
# 8 మంది మృతి

**న్యూఢిల్లీ:** ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు జైత్‌పూర్‌లోని హరినగర్‌లో దాదాపు 100 అడుగుల పొడవు ఉన్న గోడ కూలిపోయింది. ఎక్కువ భాగం శిథిలాలు పక్కనే ఉన్న గుడిసెలపై పడడంతో 8 మంది మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. సహాయక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని, శిథిలాలు తొలగించే పనిలో పడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిని తరువాయి 2లో

# ఉత్తరాదిన వానలు.. వరదలు

## పొంగిపొర్లుతున్న నదులు

● గంగా, యమునా జల ప్రళయాలకు బిహార్, హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీ అతలాకుతలం ● పాట్నా జిల్లాలో పునరావాస శిబిరాలకు 89 వేల మంది తరలింపు ● కొండచరియలు విరిగిపడటంతో ఎన్‌హెచ్-305 సహా 400రోడ్లు దిగ్బంధం



**పాట్నా :** ఎడతెరిపిలేని భారీవర్షాల కారణంగా సంభవిస్తున్న ఆకస్మిక వరదలతో శనివారం దేశంలోని పలు రాష్ట్రాలు అతలాకుతలం అవుతున్నాయి. ఈ వరదబీభత్సానికి బిహార్, హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఆకస్మిక వరదలతో ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉత్తర కాశీ జిల్లాలోని ధరాలీ గ్రామం ఈ నెల 5న (మంగళవారం) తుడిచి పెట్టుకుపోయిన విషాద ఘటన మరువకముందే, ఎడతెరిపిలేని భారీ వర్షాలకు బిహార్ రాష్ట్రంలో గంగానది ప్రవాహం ప్రమాదకరస్థాయిలను దాటి వరద బీభత్సం ప్రజలను వణికిస్తోంది. బిహార్ రాష్ట్రంలోని పాట్నా సహా పలు జిల్లాలను ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతోంది. పాట్నాలోని లోతట్టు ప్రాంతాల, వైశాలి, ముజఫర్‌పూర్, భాగల్‌పూర్, భోజ్‌పూర్, ఖగారియా, పుర్నియా, మాధేపురా, సహస్ర, కథిహార్ జిల్లాలు వరద బీభత్సానికి అల్లకల్లోలం అవుతున్నాయి. నీటి వనరుల విభాగం (డబ్ల్యుఆర్‌డి) తాజా బులెటిన్ ప్రకారం...శనివారం ఉదయం 9గంటల సమయం వరకూ గంగానది ప్రమాదకర స్థాయికి మించి మానేర్, ధనపూర్, డిఘా ఘాట్, గాంధీ ఘాట్, బంకా ఘాట్, హథిదాహ్ ప్రాంతాలను తాకుతున్నాయి. గత రెండు నుంచి మూడు రోజులుగాకురస్తున్న ఎడతెరిపిలేని తరువాయి 2లో



## రాష్ట్రంలో
# ఐదు రోజులు భారీ వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రాగల ఐదు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఈనెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. రానున్న 7 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా వర్షలు కురిసే అవకాశం ఉందన్నారు. వర్షాలకు సంబంధించిన సూచనలు, హెచ్చరికలను ఓ ప్రకటన ద్వారా వాతావరణ కేంద్రం అధికారులు విడుదల చేశారు. రాష్ట్రంలోని ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాలలో 10, 11 తేదీల్లో భారీ వర్షాలు పడుతాయన్నారు. ఆ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 12, 13, 15 తేదీల్లో ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలలో భారీ వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు(గాలి వేగం గంటకు 3040 కి.మీ)తో కూడిన వర్షాలు అక్కడక్కడ కురుస్తాయని స్పష్టం చేశారు.

బిఆర్ఎస్‌పై బిజెపి కన్ను 04

## ఆదివాసీల అస్థిత్వాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వాలదే

● ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న దాడులు, హత్యలు వెంటనే నిలిపివేయాలి ● వారిపై అమలు చేస్తున్న నిర్బంధాలకు స్వస్తి పలకాలి ● కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/పాల్వంచ

ఆదివాసీల అస్థిత్వాన్ని కాపాడే బాధ్యత పాలక ప్రభుత్వాలదే అని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధి పాత సూరారం గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సంధర్భంగా ఏర్పాటు చేసిన కొమరం భీమ్ విగ్రాహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ.. అమాయక ఆదివాసీలపై నిర్బంధాలకు స్వస్తి పలకాలని, అడవినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న ఆదివాసీలకు వారు సాగుచేసుకొంటున్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దేశంలో ఆదివాసీలే అడవులు, ప్రకృతి ప్రేమికులన్నారు. అడవులను రక్షించేది కూడా వారేనని స్పష్టం చేశారు. ఆదివాసీలకు ప్రత్యేకమైన జీవన శైలి, ప్రత్యేక సంసృ్కతి సాంప్రదాయాలు కలిగి ఉంటారని తెలిపారు. గోండు కుటుంబంలో జన్మించిన కొమరం భీమ్ తెలంగాణ విముక్తి కోసం అసఫ్ జాహీ రాజవాసానికి, నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా గెరిల్లా శైలిలో పోరాటలు నిర్వహించిన గొప్ప ఉద్యమ నాయకుడన్నారు. పశువుల కాపరులపై విధించిన సుంకానికి వ్యతిరేకంగా, తమ భూమిలో తమదే అధికారమంటూ జల్,జంగిల్, జమీన్ అనే నినాదంతో అడవి బిడ్డలను ఒక్కతాటి పైకి తీసుకొచ్చిన వ్యక్తి కొమరం భీమ్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున పాత సూరారం గ్రామ ఆదివాసీ కుటుంబాలు కొమరం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవటం అభినందనీయమన్నారు. ఆనాడు తెలంగాణలో తెలంగాణ సాయుధ పోరాటం ప్రారంభ దశలో ఉన్న సమయంలో కొమరం భీమ్ తన ఆలోచనా విధానంతో, పోరాట విధానంతో కమ్యూనిస్టులను కూడా ప్రభావితం చేసిన నాయకుడన్నారు. 1940 సంవత్సరంలో పోలీసులతో జరిగిన ఎదురు కాల్పుల్లో మృతిచెందినప్పటికీ ఆయన నినదించిన జల్, జంగిల్, జమీన్ నినాదం నిలిచిపోకుండా ఇప్పటికీ సజీవంగా ఉందన్నారు. నాడు త్యాగాలు చేసిన వారందరూ ఇప్పుడు వెలుగులోకి వస్తున్నారని, కొమరం భీమ్ ఏ నినాదాన్ని తన భుజాలపైకి ఎత్తుకొని మరణించాడో అదే నినాదం ఇవాళ కొనసాగుతున్నదన్నారు. అమరుల స్ఫూర్తితో సమాజంలో అట్టడుగు వర్గాల కోసం, బడుగు బలహీన వర్గాల కోసం, గిరిజన, దళిత వర్గాల కోసం, వారి హక్కుల కోసం, వారి అభ్యున్నతి కోసం పోరాటాలను కొనసాగించాలన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని తరువాయి 12లో

## 5 పాక్ యుద్ధ విమానాల
# కూల్చివేత

ఆపరేషన్ సిందూర్‌పై తొలిసారి ఎయిర్ చీఫ్ మార్షల్ ప్రకటన



**బెంగళూరు:** ఆపరేషన్ సిందూర్‌లో ఐదు యుద్ధ విమానాలు సహా మొత్తం 6 పాకిస్తాన్ విమానాలను కూల్చివేసినట్టు భారత ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ ప్రకటించారు. అందులో పాకిస్తాన్‌కు చెందిన మరో భారీ వామానం కూడా ఉన్నదని అన్నారు. ఏప్రిల్ 16న పహల్గామ్‌లో ఉగ్రదాడి జరిగిన తర్వాత, పాకిస్తాన్‌లోని కొన్ని కీలక ప్రాంతాలపై మే 7వ తేదీన భారత్ వైమానిక దాడులు జరిపిన విషయం తెలిసిందే. దీనికి 'ఆపరేషన్ సిందూర్'గా పేరు ఖాయం చేశారు. ఇప్పటి వరకూ ఈ ప్రతీకార దాడుల గురించి స్పందించని భారత వాయుసేన తొలిసారి అధికా రికంగా వివరాలు వెల్లడించడం విశేషం. బెంగళూరులో శుక్రవారం ఎయిర్ చీఫ్ మార్షల్ ఎల్ఎం కత్రే 16వ స్మారకోపన్యాసం తరువాయి 2లో

### ఒక్క విమానాన్ని కూడా కూల్చలేదు

పాకిస్తాన్ రక్షణ మంత్రి ఆసిఫ్ స్పష్టీకరణ 05



## అన్ని ప్రభుత్వ భవనాలపై
# సోలార్ ప్లాంట్లు

డిప్యూటీ సిఎం, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రామ పంచాయతీ భవనం నుంచి హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయ భవనాలపైన సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్టు డిప్యూటీ సిఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, పార్కింగ్, క్యాంటీన్‌లకు చెందిన ప్లాన్లను హైదరాబాద్‌కు పంపించాలని,రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు అన్నీ కూడా ఒకే నమూనాలో నిర్మించిన నేపథ్యంలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు హైదరాబాదు నుంచి పంపిస్తామని సూచించారు. కలెక్టర్ కార్యాలయాల్లో మంచి డిజైన్లు ఉంటే ఆయా కలెక్టర్లు హైదరాబాద్‌కు పంపించాలన్నారు. ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు,ఆర్ ఒ ఎఫ్ ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం అమలుపై హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో డిప్యూటీ సిఎం భట్టి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, విద్యుత్ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, ఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫారుఖీ, రెడ్‌కో సిఎండి అనిలా తదితరులు పాల్గొ



న్నారు. సోలార్ విద్యుత్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మంత్రివర్గం విధాన నిర్ణయం తీసుకుందని భట్టి విక్రమార్క వివరించారు. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలకు సంబంధించి హైదరాబాద్ కు పంపాల్సిన వివరాలకు సంబంధించి ఒక ప్రశ్నావళిని పంపిస్తున్నామని, అందులో అన్ని వివరాలను నమోదు చేసి, వారం లోపు విద్యుత్ శాఖ ముఖ్యకార్యదర్శి కార్యాలయానికి పంపించాలని డిప్యూటీసిఎం జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నీటిపారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖ పరిధిలో పెద్ద ఎత్తున ఖాళీగా ఉన్న స్థలాల వివరాలు కూడా తరువాయి 2లో

## రాహుల్‌గాంధీ ఆరోపణలపై...
# ఇసి సమగ్ర విచారణ

● ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్‌పవార్ డిమాండ్ ● ఎన్నికల సంఘం కార్యాలయం వద్దకు ప్రతిపక్షం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహిస్తున్నామని వెల్లడి



**నాగ్‌పూర్ :** కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘం (ఈసీ)పై చేసిన తీవ్ర స్థాయి ఆరోపణలపై శనివారం నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పి) అధ్యక్షుడు శరద్‌పవార్ స్పందించారు. ఈ విషయమై సమగ్ర విచారణ చేయాలని శరద్‌పవార్ ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం ఓట్ల దొంగతనంపై ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఇచ్చిన ప్రజెంటేషన్ విషయమై శరద్‌పవార్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ సరైన ఆధారాలతోనే ఆరోపణలు చేశారని, ఎన్నికల ప్రక్రియ సమగ్రత గురించి లేవనెత్తిన సందేహాలు ఎన్నికల సంఘం ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నందున ఈ విషయమై సమగ్ర విచారణ చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. రాహుల్‌గాంధీ అఫిడవిట్ దాఖలు చేసి, ప్రమాణం చేసి తరువాయి 2లో

## గాజాపై ప్రపంచం మాట
# లెక్కచేయని ఇజ్రాయెల్

నేడు ఐక్యరాజ్యసమితి అత్యవసర సమావేశం

జెరూసలెం : గాజా సిటీ స్వాధీనం చేసుకోవాలన్న నిర్ణయంపై ప్రపంచ దేశాల తీవ్రస్థాయి విమర్శలను ఇజ్రాయెల్ ప్రభుత్వం తోసిపుచ్చింది. దీంతో గాజాలో సంభవిస్తున్న కొత్త పరిణామాలపై చర్చించేందుకు ఐక్యరాజ్యసమితి ఆదివారం అత్యవసరంగా సమావేశం కానున్నది. గాజాను పూర్తిగా ఆక్రమించుకోవాలన్న ఆలోచనలను ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ తీవ్రంగా ఖండించారు. గాజా సిటీలో పదిలక్షలమంది బతుకుతున్నారు. ఆ ప్రాంతాన్ని పూర్తిగా సైనికీకరణ చేసి దాడులు మొదలుపెడితే పాలస్తినా ప్రజల జీవితాలు మరింత దుర్భరమై వినాశకరమైన పరిణామాలు సంభవిస్తాయని ఐక్యరాజ్యసమితి ఆందోళన చెందుతున్నది. గాజాను క్లీన్ చేసేందుకు ఐదు సూత్రాలు అమలు చేస్తామని చెబుతున్నది. హమాస్‌ను పూర్తిగా నిర్మూలించడం, బందీలుగా ఉన్న తమ దేశీయులను విడిపించుకోవడం, హమాస్ ప్రభుత్వం తిరిగి ఏర్పడకుండా చూడటమే వీటిల్లో ప్రధానాంశాలని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ తరువాయి 12లో



### చావనైనా చస్తాం
గాజాను వదిలివెళ్ళం

చావనైనా చస్తాంగానీ, గాజా సిటీ నుండి కదలి బయటకు పోయేదిలేదని పాలస్తీనియన్లు శపథం చేశారు. సిటీని ఆక్రమించాలన్న నెతన్యాహూ బెదిరింపులకు భయపడేది లేదని నగర ప్రజలన్నారు. గాజా సిటీలో 10 లక్షలమంది ప్రజలు నివసిస్తున్నారు. వీరందరినీ బలవంతంగా దక్షిణప్రాంతంవైపు నెట్టి శరణార్థులుగా మార్చాలని నెతన్యాహూ నిర్ణయించారు. హమాస్‌ను పూర్తిగా నిరాయుధులను చేయడం, తరువాయి 12లో

## రైల్వే శాఖ పండుగ ఆఫర్

రిటర్న్ టికెట్‌పై 20% డిస్కౌంట్

**న్యూఢిల్లీ:** ఈ పండుగ సీజన్‌లో రైల్వే శాఖ ఆఫర్‌ను ప్రకటించింది. రిటర్న్ టికెట్‌పై 20% డిస్కౌంట్ ఇవ్వనున్నట్టు తెలిపింది. పండుగ సీజన్ ప్రారంభం కానునండడంతో, ప్రయాణికుల రద్దీని నియంత్రించడం, సౌకర్యాలను మెరుగుపరచడంపై దృష్టి కేంద్రీకరించింది. ఈనెల 14 నుంచి అమల్లోకి వచ్చే 'రౌండ్ ట్రిప్ ప్యాకేజ్ స్కీమ్'ను ఆన్‌లైన్‌తోపాటు, ఆఫ్‌లైన్‌లోనూ వినియోగించుకోవచ్చు. దీపావళి, ఛట్ పండుగలను దృష్టిలో ఉంచుకొని రైల్వే ఈ నిర్ణయం తీసుకుంది. రైల్వే బుకింగ్ వెబ్‌సైట్‌లోని 'కనెక్టింగ్ జర్నీ' ఫీచర్ ద్వారా ప్రయాణికులు ఈ స్కీమ్ ద్వారా వచ్చే డిస్కౌంట్‌ను పొందవచ్చు. అక్టోబర్ 13 నుంచి 26వ తేదీ మధ్యకాలంలో స్వస్థలాలకు వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకొని, నవంబర్ 17 నుంచి తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## ఓటర్ల ప్రయోజనాలకోసమే పనిచేస్తాం : బంగ్లాదేశ్ ఎన్నికలసంఘం

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడం అతిపెద్ద సవాలుగా మారిందని ఆ దేశ ప్రధాన ఎన్నికల అధికారి ఎఎంఎం నజీరుద్దీన్ శనివారం ప్రకటించారు. ఎన్నికల తేదీలను రెండు నెలల ముందుగానే ప్రకటిస్తామన్నారు. దేశంలో 18 కోట్లమంది ప్రజల ప్రయోజనాల కోసమే ఎన్నికల సంఘం పనిచేస్తుందని భరోసా ఇచ్చారు. ఎలాంటి దాపరికాలు లేకుండా బాహాట పద్ధతులలో బంగ్లాదేశ్ ఎన్నికల సంఘం తన బాధ్యతలు నిర్వహిస్తుందని చెప్పారు. అదేవిధంగా ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పూర్తి క్రమానుగత వివరాలు తెలియజేయడానికి రెండు నెలలముందే లాంఛనంగా ఎన్నికల తేదీలు ప్రకటిస్తామని రంగ్‌పూర్ ప్రాంతీయ ఎన్నికల కార్యాలయంలో మంతనాల సందర్భంగా ఆయన ఈ విషయం చెప్పారు. ఎన్నో సవాళ్ళు ఉన్నప్పటికీ చాలా తక్కువ సమయంలోనే ఎన్నికల ప్రక్రియ అమలు చేస్తున్నట్లు చెప్పారు.

# ఆర్మేనియా—అజర్‌బైజాన్ శాంతి ఒప్పందం
## ట్రంప్‌కు ‘నోబెల్’ ఇవ్వాలని ప్రతిపాదన




**వాషింగ్టన్:** ఆర్మేనియా—అజర్‌బైజాన్ దేశాలమధ్య శాంతి ఒప్పందం కుదిరింది. వాషింగ్టన్ వేదికగా డోనాల్డ్ ట్రంప్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. రెండు దేశాల నాయకుల భుజాలు చరుస్తూ ట్రంప్ సంతృప్తికరంగా అభినందిస్తుండగా శాంతి ఒప్పందంపై వారు సంతకాలు చేశారు. వైట్‌హౌస్ ఉమ్మడి ప్రకటనగా పేర్కొన్న ఈ పత్రంపై ట్రంప్ కూడా సంతకం చేశారు. ఈ ఒప్పందాన్ని ట్రంప్ చరిత్రాత్మకమైనదిగా పేర్కొన్నారు. ఈ రెండు దేశాలూ పూర్వపు సోవియట్ యూనియన్‌లో రిపబ్లిక్స్‌గా ఉండేవి. ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని రెండు దేశాల నాయకులు ఈ సందర్భంగా ప్రతిపాదించారు.

ఆర్మేనియా—అజర్‌బైజాన్ దేశాలమధ్య అనేక దశాబ్దాలుగా సరిహద్దు ఘర్షణలు జరుగుతున్నాయి. ట్రంప్ చొరవ చూపించి ఈ రెండు దేశాల సమస్య పరిష్కారానికి కొద్ది రోజులుగా మధ్యవర్తిత్వం చేశారు. శాశ్వతంగా సరిహద్దు పోరాటాలను నిలిపివేయడానికి, వాణిజ్య సంబంధాలను, దౌత్య, రవాణా సంబంధాల పునరుద్ధరణకు రెండు దేశాలు అంగీకరించాయని ట్రంప్ చెప్పారు. పరస్పర సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతలను గౌరవించుకునేందుకు కూడా రెండు దేశాలు కట్టుబడి ఉన్నాయని చెప్పారు. ఆర్మేనియా ప్రధానమంత్రి నికోల్ పష్యేన్, అజర్‌బైజాన్‌కు దీర్ఘకాలంగా అధ్యక్షుడుగా కొనసాగుతున్న ఇల్హామ్ అలియేవ్ వాషింగ్టన్‌లో జరిగిన ఈ శాంతి ఒప్పందంపై సంతకాలు చేశారు. ఆర్మేనియాలో క్రైస్తవమత ఆధిక్య త ఉంది. అజర్‌బైజాన్‌లో ముస్లిం మతాధిపత్య ం ఉంది. ఈ రెండు దేశాలకూ దీర్ఘకాలంగా సరిహద్దుల వివాదాలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా కరాబాఖ్ ప్రాంతం గురించి రెండు దేశాలమధ్యా ఘర్షణ జరుగుతోంది. దీని గురించి ఇప్పటికే రెండుసార్లు ఘర్షణలు జరిగాయి. 2023లో అజర్‌బైజాన్ మెరుపుదాడి చేసి ఆర్మేనియా నుండి ఈ ప్రాంతా న్ని స్వాధీనం చేసుకుంది. ఈ కారణంగా లక్షమందికిపైగా ఆర్మేనియా జాతి ప్రజలు ఈ ప్రాంతం నుండి వలస వెళ్ళిపోవాల్సి వచ్చింది.

‘‘రెండు దేశాలమధ్యా ఇకమీదట గొప్ప అనుబంధం కొనసాగుతుంది, ఒకవేళ వివాదం తలెత్తితే రెండు దేశాల నాయకులూ నాకు ఫోన్ చేస్తారు, మేం పరిష్కరిస్తాం, ఇకమీదట రెండు దేశాలూ శత్రుత్వం వదిలిపెట్టి శాంతియుత సంబంధాలను పునరుద్ధరించుకుంటాయి’’ అని ట్రంప్ ప్రకటించారు.

## 15న అలాస్కాలో
# పుతిన్ — ట్రంప్ భేటీ



**మాస్కో:** ఉక్రేన్ సమస్యపై రష్యా అధ్యక్షుడు వి. పుతిన్, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్య వచ్చే శుక్రవారం (ఆగస్టు 15) అలస్కాలో శిఖరాగ్ర సమావేశం జరుగుతుంది. ఈ మేరకు రెండు దేశాలమధ్యా ఒక ఒప్పందం కుదిరిందని పుతిన్ సహాయకుడు యూరీ ఉషకోవ్ శనివారం రష్యా అధ్యక్ష భవనంలో పాత్రికేయులకు చెప్పారు. అమెరికా అధ్యక్షుడుగా రెండోసారి ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత పుతిన్‌తో ముఖాముఖీ మొదటి సమావేశం ఇదే అవుతుంది.


‘‘ఈ ఒప్పందాన్ని అంగీకరిస్తున్నట్లు అమెరికా ఇప్పుడే ఆమోదం తెలియజేసింది, అమెరికా—రష్యా రెండూ ఇరుగుపొరుగుదేశాలు, ఆసియా—ఉత్తర అమెరికా ఖండాలను వేరుచేసే బేరింగ్ సముద్రంలో ఆర్కిటిక్ సముద్రాన్ని అనుసంధానం చేసే బేరింగ్ జలసంధిని దాటి మా ప్రతినిధి బృందం అలాస్కా వెళ్ళి చర్చల్లో పాల్గొనడం చాలా తార్కికమైన విషయం, వాస్తవానికి రెండు దేశాల నాయకుల మధ్యా చాలాకాలంగా ఎదురుచూస్తు న్న ఈ సమావేశం అక్కడే జరగాలి కూడా..’’ అని యూరీ ఉషకోవ్ చెప్పారు. ట్రంప్ కూడా తన ట్రూత్ సోషల్ మీడియాలో ఈ మేరకు పోస్టింగ్ పెడుతూ, పుతిన్‌ను ఈనెల 15న అలాస్కాలో కలవాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఈనెల ఆరో తేదీన ట్రంప్ ప్రత్యేకదూత స్టీవ్ విట్‌కాఫ్ మాస్కో వెళ్ళి పుతిన్‌తో మూడు గంటలు చర్చించారు. అనంతరం అగ్ర నాయకుల ముఖాముఖీ సమావేశ నిర్ణయాన్ని రెండు దేశాలూ ఖరారు చేశాయి. ఈ సమావేశంలో ప్రధానంగా ఉక్రేన్ గురించే చర్చిస్తారు. ఉక్రేన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవడానికి రష్యాకు ట్రంప్ విధించిన గడువు ఆగస్టు 8వ తేదీతో ముగిసింది. దీనికి ముందురోజే వీరిద్దరి ముఖాముఖీపై కూడా స్పష్టత వచ్చింది.

ఉక్రేన్‌లో యుద్ధం ముగిస్తానని గత ఏడాది అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ప్రజలకు బహిరంగ సభల్లో పదే పదే వాగ్దానాలు చేయడంతో ఈ సమస్య పరిష్కారం ఆయనకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఆరున్నర నెలలుగా ఎన్ని ప్రయత్నాలు చేసినాగానీ పుతిన్‌ను తనకు అనుకూలంగా ఒప్పించలేకపోయారు. నాటో కూటమిలో ఉక్రేన్ కు సభ్యత్వం ఇవ్వకూడదనీ, ఉక్రేన్‌ను పూర్తిగా నిస్సైనికదేశంగా మార్చాలని, ఆక్రమిత భూభాగాలను తమకు స్వాధీనం చేసేందుకు అంగీకరించాలని, నాటోను తూర్పువైపు విస్తరించకూడదని పుతిన్ కోరుతున్నారు. కానీ ట్రంప్ మాత్రం ఈ విషయాలేవీ ప్రస్తావించడంలేదు. ఉక్రేన్‌లో ఇప్పటివరకూ 12 వేలమంది మరణించారని, అన్యాయంగా ఆ దేశ పౌర ప్రాంతాలపై రష్యా దాడులు చేస్తోందని మాత్రమే చెబుతున్నారు.

**ఉక్రేన్ లేకుండా నిర్ణయాలు సహించం:జెలెన్‌స్కీ**


అలాస్కాలో జరిగే చర్చల్లో తమ ఉనికి లేకుం డా నిర్ణయాలు తీసుకోవడాన్ని సహించబోమని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హెచ్చరించారు. ఆక్రమణదారులకు తమ భూభాగాన్ని నజరానాగా ఇవ్వడానికి తాము సిద్ధంగా లేమన్నారు. తమ భాగస్వామ్యం లేకుండా జరిగే చర్చలు ఎలాంటి ఫలితాన్నీ ఇవ్వబోవన్నారు. రష్యా—ఉక్రేన్ మధ్య 1,262 రోజులుగా యుద్ధం జరుగుతోంది. ప్రస్తుతం 20 శాతం ఉక్రేన్ భూభాగం రష్యా ఆక్రమణలో ఉంది. ట్రంప్—పుతిన్ మధ్య శిఖరాగ్ర చర్చలకు తేదీ ఖరారైన వెంటనే జెలెన్‌స్కీ ఈ ప్రకటన చేశారు. తమ భూభాగాన్ని రష్యాకు వదులుకునే ప్రసక్తే లేదని ఆయన అన్నారు. ఈ చర్చల్లో ఉక్రేన్‌ను కూడా భాగస్వామిగా చేర్చి త్రైపాక్షిక చర్చలుగా మార్చాలని ఆయన డిమాండ్ చేశారు.



ఈ మేరకు శనివారం సోషల్‌మీడియాలో ఒక వీడియోను ఆయన షేర్ చేశారు. వాస్తవ ప్రాతిపదికపై నిర్ణయాలు తీసుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని, గౌరవప్రదమైన శాంతి సాధనకు కట్టుబడి ఉన్నామని, కానీ రాజ్యాంగబద్ధంగా తమ సార్వభౌమాధికారానికి అనుగుణమైన ప్రాదేశిక ఉల్లంఘనలను సహించబోమన్నారు. ఈనెల ఆరోతేదీన విట్‌కాఫ్ మాస్కోలో పుతిన్‌తో చర్చల సందర్భంగా త్రైపాక్షిక సమావేశాన్ని ప్రతిపాదించారు. ఐతే అమెరికా—రష్యా మధ్య ఉక్రేన్ చర్చల్లో పాల్గొనేందుకు పుతిన్ తిరస్కరించారు. జెలెన్‌స్కీతో చర్చలకు తాను వ్యతిరేకం కాదనీ, కానీ ఆయనతో ముఖాముఖీ సమావేశానికి తగిన పరిస్థితులు ఇంకా రాలేదని పుతిన్ గడచిన గురువారంనాడు స్పష్టం చేశారు.

# ఇజ్రాయెల్‌తో విభేదాలున్నా గాజాలో లక్ష్యం ఒక్కటే : అమెరికా

**కెంట్:** ఇజ్రాయెల్ అనుసరిస్తున్న యుద్ధవ్యూహంతో ట్రంప్ ప్రభుత్వానికి కొన్ని వైరుధ్యాలు ఉన్నప్పటికీ గాజాలో అంతిమ లక్ష్యం మాత్రం ఒకటేనని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ చెప్పారు. ఇంగ్లాండ్‌లో పర్యటించిన జె.డి.వాన్స్ శనివారంనాడు కెంట్‌లోని చెవెనింగ్ హౌస్‌లో బ్రిటన్ విదేశాంగమంత్రి డేవిడ్ లమ్మీతో సమావేశం జరిపారు. ఈ సందర్భంగా వాన్స్ మాట్లాడుతూ, గాజాలోఉమ్మడి లక్ష్యాలను ఎలా ఖచ్చితంగా నెరవేర్చాలనే విషయంపై ఇజ్రాయెల్—అమెరికాల మధ్య విభేదాలున్నాయన్నారు. ‘‘ప్రపంచంలో సంఘర్షణ జరుగుతున్న ఆ ప్రాంతంలో ఏర్పడిన చాలా సంక్లిష్టమైన సమస్యను ఎలా పరిష్కరించాలో మనకు తెలియదు, ఈ పరిష్కారం చాలా సులభమైతే ఈపాటికే పరిష్కారం జరిగి ఉండేది, పాలస్తీనా రాజ్యానికి గుర్తింపు ఇచ్చే విషయంలో బ్రిటన్‌కు తన సొంత హక్కులున్నాయి, ఐతే అమెరికా ఆ మార్గాన్ని అనుసరించలేదు, పాలస్తీనాలో ఒక క్రియాత్మకమైన ప్రభుత్వం లేకపోవడంవల్ల ఆ రాజ్యాన్ని ఎలా గుర్తించాలో నాకు తెలియదు’’ అని వాన్స్ అన్నారు. ఇజ్రాయెల్ సెక్యూరిటీ మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం గురించి తన అభిప్రాయాలు వ్యక్తం చేశారు.



అమాయకులైన ప్రజలపై హమాస్ ఉగ్రవాద సంస్థ దాడులు చేయకుండా అడ్డుకోవడం, గాజాలో ఉన్న ప్రజల ఆకలి తీర్చి మానవతా సంక్షోభాన్ని పరిష్కరించడం అనే రెండు ప్రధాన లక్ష్యాల సాధనపైనే అమెరికా దృష్టి కేంద్రీకరించిందని ఆయన చెప్పారు. గాజాను పూర్తిస్థాయిలో ఆక్రమించేవిషయాన్ని నెతన్యాహూ సొంత ఇష్టానికే ట్రంప్ వదిలిపెట్టారని, ఈ మేరకు ట్రంప్ ముందుగానే ఒక ప్రకటన చేశారని వాన్స్ గుర్తుచేశారు. గాజా సిటీలో ప్రస్తుతం పది లక్షలమంది ప్రజలు నివాసం ఉంటున్న ప్రాంతానికి యుద్ధాన్ని, ఆక్రమణ చర్యలను విస్తరించేందుకు నెతన్యాహూ చేసిన ప్రణాళిక గురించి మాట్లాడుతూ పైవిధంగా చెప్పారు.

## 8 మంది మృతి
(మొదటి పేజీ తరువాయి)

ఆసుపత్రికి తరలించారు. పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మృతులను షబీబుల్ (30), రబీబుల్ (30), అలీ (45), రుబీనా (25), డాలీ (25), రుఖ్సానా (6), హసీనా (7)గా గుర్తించారు. గోడ ఉన్న ప్రాంతంలోనే ఒక పురాతన ఆలయం ఉంది. దాని పక్కనే కొంత మంది గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. వర్షాలకు నానిపోయిన గోడ, శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అకస్మాత్తుగా కూలిపోయింది. పక్కనే ఉన్న గుడిసెలపై పడడంతో, శిథిలాల కింద చాలా మంది చిక్కుకుపోయారు. కాగా, ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అధికారులు సూచించారు. కూలిపోయే స్థితిలో ఉన్న నివాసాలలో ఉండవద్దని, సాధ్యమైనంత వరకూ సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు. కాగా, ఇప్పటికే కొన్ని లోతట్టు ప్రాంతాలు, శిథిల భవనాల నుంచి కొంతమందిని తరలించినట్లు సౌత్ ఈస్ట్ అడిషనల్ డిసిపి ఐశ్వర్య వర్మ తెలిపారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉందని, దీనితో మృతుల సంఖ్య పెరగవచ్చని అన్నారు. ఇలావుంటే, ఎడతెగని వానలతో ఢిల్లీలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. వర్షాల కారణంగా 200లకుపైగా విమాన సర్వీసులు ఆలస్యమయ్యాయి.

## కూల్చివేత
(మొదటి పేజీ తరువాయి)

చేసిన సింగ్, ఆపరేషన్ సింగదూర్‌పై కొన్ని వివరాలు వెల్లడించారు. చక్కటి ప్రణాళికతో ఆపరేషన్ సిందూర్ జరిగిందని, కేవలం 80 నుంచి 90 గంటల్లోనే అనుకున్న లక్ష్యాలను చాలా వరకూ అందుకున్నామని సింగ్ తెలిపారు. యుద్ధం కొనసాగితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందనే విషయం పాకిస్తాన్‌కు అర్థమైందని, అందుకే చర్చలకు ముందుకొచ్చిందని అన్నారు. యుద్ధాన్ని భారత్ కోరుకోవడం లేదని, అందుకే పాక్ ప్రతిపాదనకు అంగీకరిచామని సింగ్ వివరించారు. భారత సైన్యం దాడుల్లో దెబ్బతిన్న ప్రాంతాల్లో పాకిస్తాన్ ప్రధాన ఎయిర్‌ఫీల్డ్‌లో షహబాజ్ జకోబాబాద్ స్థావరం ఒకటని పేర్కొన్నారు. అక్కడ ఎఫ్ 16 విమానాల హ్యాంగర్ ఉందని చెప్పారు. అక్కడ కొన్ని విమానాలు ఉన్నాయి కాబట్టి, దాడిలో అవి కూడా పూర్తిగా లేదా పాక్షికంగా ధ్వంసమై ఉంటాయని అంచనా వేస్తున్నట్టు సింగ్ చెప్పారు. భారత గగనతల రక్షణ వ్యవస్థతోపాటు ఎస్400 క్షిపణి వ్యవస్థ కూడా సమర్థవంతంగా పని చేసిందని అన్నారు. సుదూర లక్ష్యాలను ఛేదించే వ్యవస్థలను కూడా ఉపయోగించడంతో, అనుకున్న విధంగా లక్ష్యాలను ఛేదించడం సాధ్యమైందని అన్నారు. ఇటీవల రష్యా నుంచి కొనుగోలు చేసిన ఎస్ 400 గగనతల రక్షణ వ్యవస్థ అద్భుతమైన పనితీరు కారణంగా, పాకిస్తాన్ యుద్ధ విమానాలు భారత్ సమీపానికి కూడా రాలేకపోయాయని ఎయిర్ చీఫ్ మార్షల్ వ్యాఖ్యానించారు.

## సోలార్ ప్లాంట్లు
(మొదటి పేజీ తరువాయి)

పంపించాలన్నారు.

**ప్రభుత్వ విద్యా సంస్థల భవనాలపైనా...**

ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ ,డిగ్రీ కళాశాలలు , ఉన్నత విద్యాసంస్థల భవనాలపైన కూడా సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని, దీనికి సంబంధించిన భవనాల వివరాలు పంపించాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ ఒ ఎఫ్ ఆర్ చట్టం కింద 6.70 లక్షల ఎకరాల భూములను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసిందని, ఈ భూముల్లో నల్లమల డిక్లరేషన్ కింద ‘ఇందిరా సౌర గిరి జల వికాసం’ పథకం ద్వారా ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నామని జిల్లా కలెక్టర్లకు వివరించారు. నల్లమల డిక్లరేషన్ లో భాగంగా ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గంలో ప్రారంభించామని, ఈ నెలలోనే ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నదన్నారు.‘ఇందిరా సౌర గిరిజల వికాసం’ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా తీసుకున్నదని, ఈ విషయంలో జిల్లా కలెక్టర్లు అలసత్వం ప్రదర్శించకుండా వారంలోగా వివరాలను పంపించాలన్నారు. ఈ విషయాల్లో ఎమైనా సందేహాలు ఉంటే విద్యుత్ శాఖ ముఖ్యకార్యదర్శి, ఎస్‌సిడిసిఎల్ ,ఎన్‌పిడిసిఎల్ సిఎండిలు, రెడ్‌కో విసి, సిఎండిని సంప్రదించాలని జిల్లా కలెక్టర్లకు డిప్యూటీ సిఎంభట్టి ఆదేశించారు.

## వానలు.. వరదలు
(మొదటి పేజీ తరువాయి)

వర్షాలు బిహార్ రాష్ట్రంలోని ఇతర నదుల నీటి స్థాయి కూడా ప్రమాదకర స్థాయి స్థితికి చేర్చింది. శుక్రవారం నాడు పాట్నా జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు దాదాపు 89,000మందికి పైగా పునరావాస శిబిరాలకు తరలించారు. భోజ్‌పూర్ జిల్లాలో లోతట్టు ప్రాంతాలకు చెందిన 21,700మంది ప్రజలను ఖాళీ చేయించి వారిని పునరావాస శిబిరాలకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. డిశాస్టర్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ బులెటిన్ గంగా నదీ పొడువున ఉన్న పాట్నా సహా భోజ్‌పూర్, వైశ్లాయి, లఖీసరాయి, భాగల్పూర్ వరద బీభత్సాన్ని ఎదుర్కొన్నాయి. గంగానది, కోసీ నది నీటి స్థాయిలు ఉధృతమై లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను తీవ్ర కష్టనష్టాలకు గురిచేసాయి. భోజ్‌పూర్ జిల్లాలోని 21.700మంది ప్రజలు కుండపోత వర్షాల బారినపడటతో వారిని ఖాళీచేయించి పునరావాస శిబిరాలకు తీసుకువచ్చారు. శుక్రవారంనాడు పాట్నాలో 89,250మంది ప్రజలను క్యాంపులకు తరలించారు. సంబంధిత జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని డిశాస్టర్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ప్రజలను, అధికారయంత్రాంగాన్నికోరింది. గత కొద్దిరోజులుగా ఎడతెరిపిలేని భారీ వర్షాల కారణంగా బిహార్ రాష్ట్రంలోని గంగా, గండక్, కోసీ, గంగా, బుర్హి గండక్, మహానంద, కమ్లా నదుల నీటి ప్రవాహ స్థాయిలు పెరిగిపోతున్నాయి.

**హిమాచల్‌లో...కొండచరియలు విరిగిపడి 400 రోడ్లు మూసివేత**

గతకొద్దిరోజులుగా హిమాచల్ ప్రదేశ్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సంభవించిన ఆకస్మిక వరదలు కొండచరియలు విరిగిపడి ఒక జాతీయ రహదారి సహా 400రోడ్లు మూసివేతకు దారితీశాయి. కులు జిల్లాలోని జాహెద్, బంజార్ సమీపంలోని జాతీయ రహదారి ఎన్‌హెచ్305లోని ఆటో సైనిజ్ రోడ్డు దిగ్బంధించబడింది. మొత్తం 400రోడ్లను వాహనాల రాకపోకలకు మూసివేశారు. వీటిలో 200 రోడ్లు మండి జిల్లాలో దిగ్బంధించగా, కులు జిల్లాలో 100రోడ్లు శనివారం మూసివేయబడినట్లు రాష్ట్ర అత్యవసర ఆపరేషన్ సెంటర్ (ఎస్ఇఒసి) తెలిపింది. ఈ వర్షాకాలంలో భారీ వర్ష సంబంధిత సంఘటనలలో దాదాపు 112మంది మరణించగా, 37మంది గల్లంతయ్యారు. అదనంగా 704ట్రాన్స్‌ఫార్మర్లు, 178 నీటి సరఫరా పథకాలు ప్రభావితం అయ్యాయని ఎస్ఇఒసి తెలిపింది.

**ఢిల్లీలో ‘డేంజర్‌మార్క్’కు చేరువలో...యమునా నది నీటిమట్టం**

ఢిల్లీలోని యమునా నది సమీపంలోని ఓల్డ్ రైల్వే బ్రిడ్జి వద్ద ఉదయం 9గంటల సమయంలో నీటి మట్టం 204.50 మీటర్ల స్థాయికి చేరుకుందని, ఇది 204.50మీటర్ల ప్రమాదకర స్థాయికి చేరువలో ఉన్నదని శనివారం అధికారులు చెప్పారు. నదీ ప్రవాహాన్ని, వరదల ప్రమాదాలను ట్రాక్ చేయడానికి ఓల్డ్ రైల్వే వంతెన కీలకమైన పరిశీలన కేంద్రంలా పనిచేస్తుంది. హర్యానా, ఉత్తరాఖండ్ ఎగువ పరీవాహక ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తుండటం వల్ల నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని సెంట్రల్ ఫ్లడ్ రూమ్ అధికారి ఒకరు చెప్పారు.ఢిల్లీ నగరానికి హెచ్చరిక గుర్తు 204.5 మీటర్లు కాగా, అది డేంజర్ మార్క్‌గా 205.3 మీటర్లు చేరుకున్నప్పుడు పరిగణించబడుతుంది. 206 మీటర్ల నుంచి తరలింపు ప్రారంభం అవుతుంది.

## ‘గేట్ వే ఆఫ్ హైదరాబాద్’
(మొదటి పేజీ తరువాయి)

తగిన విధంగా డిజైన్లు రూపొందించాలని సిఎం ఆదేశించారు.

రెండు నెలల్లో టెండర్లు పిలిచేందుకు వీలుగా పనుల వేగం పెంచాలని ముఖ్యమంత్రి అధికారులను సిఎం ఆదేశించారు. ఓఆర్ఆర్‌కు ఒక వైపు ఉండే ఎకో థీమ్ పార్క్, మరో వైపు నిర్మించే ఐకానిక్ టవర్‌కు చేరుకునేందుకు ప్రయాణాలకు వీలుగా ఎలివేటెడ్ గేట్ వే నిర్మించి దాన్ని ‘గేట్ వే అఫ్ హైదరాబాద్’గా డిజైన్ చేయాలని ఆదేశించారు. బాపూఘాట్ చుట్టూ ఉన్న ఏరియాను వరల్డ్ క్లాస్ జోన్‌గా అందరిని ఆకట్టుకునే విధంగా డిజైన్ చేయాలని చెప్పారు. హిమాయత్‌సాగర్ దగ్గర అప్రోచ్ రోడ్ నుంచి అత్తాపూర్ వైపు వెళ్లేందుకు కొత్త ఫ్లైఓవర్ నిర్మించాలని, గాంధీ సరోవర్ చుట్టూ ఈ ఫ్లైఓవర్ కనెక్టివ్ కారిడార్‌లా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఎయిర్ పోర్ట్ నుంచి నేరుగా గాంధీ సరోవర్‌కు చేరుకునేలా ఈ కనెక్టివిటీ ఉండాలన్నారు. గాంధీ సరోవర్ వద్ద నిర్మించే ఐకానిక్ టవర్ ప్రపంచంలోనే ఎత్తయిన టవర్‌గా నిర్మించాలని సిఎం సూచించారు. సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని, అక్కడ ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఎంత ఎత్తున నిర్మించాలనేది అంచనాకు రావాలని సిఎం సూచించారు. తాగు నీటితో పాటు వరద నీటి నిర్వహణ కు వీలుగా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్ ఉండాలని, వివిధ దేశాల్లో అమల్లో ఉన్న ప్రాజెక్ట్ నమూనాలు పరిశీలించాలని చెప్పారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ తాగు నీటిని హైదరాబాద్ నగర అవసరాలు తీర్చేందుకు మరింత సమర్థంగా వినియోగించుకునేలా ప్రణాళికను రూపొందించాలన్నారు. స్థలం వృథా కాకుండా మూసీ పరివాహక ప్రాంతం ఇరువైపులా భూగర్భంలో భారీగా వాటర్ స్టోరేజ్ సంప్ నిర్మించే సదుపాయాలు, అక్కడి నుంచి నీటిని తరలించే విధంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గాంధీ సరోవర్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసే పనులకు వాటర్ ఫ్లో స్టడీస్ పటిష్టంగా చేసుకోవాలని అధికారులను సిఎం అప్రమత్తం చేశారు.

# కార్పొరేట్ కబంధ హస్తాల నుంచి అటవీ సంపదను కాపాడుకునేందుకు పోరాటానికి సిద్ధం కావాలి : అంజయ్యనాయక్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కార్పొరేట్ వ్యవస్థ కబంధ హస్తాల నుంచి అటవీ సంపదతో పాటు చట్టాలను పరిరక్షించుకునేందుకు రక్షించుకుంటూ జల్, జంగల్, జమీ ఉద్యమ స్ఫూర్తితో మరో పోరాటానికి సంసిద్ధం కావాలని అఖిల భారత ఆదివాసి మహాసభ జాతీయ కార్యదర్శి, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ నాయక్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ఆదివాసి గిరిజన దినోత్సవం వేడుకలను హైదరాబాదులోని గిరిజన భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు శంకర్ నాయక్ గిరిజన సమాఖ్య పతాకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ గిరిజన సమాఖ్య హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నేనావత్ రూప్ సింగ్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా విచ్చేసి అంజయ్య నాయక్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 1994 లో ఐక్య రాజ్యసమితి జనరల్ కౌన్సిల్ తీర్మానం మేరకు ఆదివాసీ గిరిజనుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ప్రతి ఏటా ఆగస్టు 9న ప్రపంచవ్యాప్తంగా ఆదివాసి హక్కుల దినంగా జరుపుకుంటున్నామన్నారు.ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆదివాసి గిరిజనులు తమ హక్కులను, సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకుంటున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాని అంబానీలాంటి వాళ్లకు అటవీ ,ఖనిజ సంపదను కారు చౌకగా కట్టపెడుతున్నాయని ఈ విధానాలకు వ్యతిరేకంగా కొమరం భీమ్. బీర్సాముండా. ఠాను నాయక్. వారసులుగా నేడు మరొ ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని కోరారు. పాలకవర్గాలు



గిరిజన తెగల మధ్యన చిచ్చు పెట్టి చోద్యం చూస్తా ఉన్నారని, ఈశా న్య రాష్ట్రాలలో జాతుల తెగల మధ్య తగువు పెట్టి ఎన్డీఏ ప్రభుత్వం అక్కడి ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పనంగా అప్పగిస్తున్నారన్నారు. వీటికి వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలను నిర్మించేందుకు దేశంలోనే గిరిజన తెగల అందరు ఐక్యమై పాలకవర్గాలపైన రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని రమావత్ అంజయనాయక్ కోరారు.ఈ కార్యక్రమంలో గిరిజన స మాఖ్య నాయకులు ఆర్ శంకర్ నాయక్ గిరిజన సమాఖ్య నగర కార్యదర్శి హరి సింగ్ నాయక్ ఉపాధ్యక్షులు నారాయణ నాయక్ వడిత్య ద్రసు నాయ క్, నేనావత్ రాజు నాయక్, ఆంగోతురాజు నాయక్. చత్రియయా నాయక్. పాండు నాయక్. అంజయ్య. కమిలి. యాదమ్మ. భారతి. తదితరులు పాల్గొన్నారు.

## ఇసి సమగ్ర విచారణ
(మొదటి పేజీ తరువాయి)

సమాచారం అందించాలన్న ఎన్నికల సంఘం తర్కాన్ని కూడా ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్‌పవార్ ప్రశ్నించారు. గత ఏడాది కర్ణాటకలోని ఒక నియోజకవర్గంలో ఓటర్ల జాబితా విశ్లేషణ ప్రకారం బిజెపి, కేంద్ర ఎన్నికల సంఘం కుమ్మక్కై కుట్ర పన్నడం ద్వారా ఎన్నికల సంఘం ‘భారీ నేరపూరిత మోసానికి పాల్పడింది’ అని రాహుల్‌గాంధీ గురువారం నాడు ఆరోపించిన విషయం తెలిసిందే. ఒక రోజు అనంతరం రాహుల్‌గాంధీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం, బిజెపి ప్రజల నుంచి లోక్‌సభ ఎన్నికను దొంగిలించడానికి కుట్ర పన్నాయని, కనీసం మూడు రాష్ట్రాలలో ఓట్ల దొంగతనం జరిగిందని ఆరోపణలు చేశారు. ‘ఓట్ల దొంగతనంపై రాహుల్‌గాంధీ చేసిన ప్రజెంటేషన్ బాగా పరిశోధన చేయబడి చక్కగా ప్రజెంటేషన్ చేయబడింది. ఎన్నికల ప్రక్రియ సమగ్రత గురించి, ప్రజల సందేహాలను తొలగించడానికి ఆయన వ్యక్తంచేసిన ఆందోళనపై ఎన్నికల సంఘం సమగ్ర విచారణ చేయాల్సిన అవసరం ఉంది. విచారణ ద్వారా మాత్రమే నిజం బయటకు వస్తుందని నేను అభిప్రాయపడుతున్నాను’ అని శరద్‌పవార్ విలేకరుల ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఎన్నికల సంఘం ఒక స్వతంత్ర సంస్థ కాబట్టి రాహుల్‌గాంధీనుంచి ఒక ప్రత్యేక డిక్లరేషన్ అడుగకూడదన్నారు. ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ లేవనెత్తిన వాదనలు ‘స్క్రిప్ట్’అ ని ఆరోపించిన బిజెపి నాయకులు, రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర షడ్నవీస్ చేసిన విమర్శలను శరద్‌పవార్ తోసిపుచ్చారు. ప్రతిపక్షం ఆధ్వర్యంలో సోమవారం నాడు ఎన్నికల సంఘం కార్యాలయానికి ఒక ప్రదర్శనను నిర్వహించబోతున్నామని శరద్‌పవార్ తెలిపారు.

# బంగ్లాదేశ్ బాలికలతో హైదరాబాద్‌లో వ్యభిచారం
## ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ చూపిస్తామని నమ్మించి బంగ్లాదేశ్ మైనర్ బాలికతో వ్యభిచార కూపంలోకి దింపిన ఓ ముఠా గుట్టు రట్టయ్యింది. బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన ఈ ఉదంతానికి సబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఉంటున్న షహరాజ్, హాజీరా అనే యువతులు మైనర్ బాలికలను బంగ్లాదేశ్ నుంచి హైదరాబాద్ చూపిస్తామని చెప్పి అక్రమంగా ఇక్కడికి తీసుకొచ్చారు. ఓ ఆటో డ్రైవర్ సాయంతో బాలికలను హోటల్ గదిలో బంధించే వ్యభిచార కూపంలోకి దించారు. వీరికి కాపలాగా ఉన్న హాజీరా నుంచి ఆ బాలికలు తప్పించుకుని ఏకంగా బండ్లగూడ పోలీస్ స్టేషన్ కు వెళ్లారు. తామని బంగ్లాదేశ్ నుండి అక్రమంగా హైదరాబాద్ కు తీసుకువచ్చి చిత్రహింసలు పెట్టి బలవంతంగా వ్యభిచారంలోకి దింపారని ఆ బాలికలు ఫిర్యాదు చేశబూరు.. మీతో ఆ అప్రమత్తమైన బండ్లగూడ పోలీసులు హోటల్ గదికి చేరుకుని దర్యాప్తు చేయగా సెక్స్ రాకెట్ గుట్టు రట్టయ్యింది.. ఈ మేరకు మొత్తం అరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశబూరు. బాధితుల్లో మరికొంత మంది హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు, మహారాష్ట్రకు చెందిన మరో ఇద్దరు, కోల్‌కతకు చెందిన ఇద్దరు మహిళలను పోలీసులు రక్షించారు.

# ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు శనివారం గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఇందిరా భవన్ లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపిశ్రీ హనుమంతరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... యువజన కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీకి గుండెకాయ లాంటిదని కొ నియాడారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లు, కార్యదర్శులు జిల్లా అధ్యక్షులు,నియోజకవర్గ అధ్యక్షులు మరియు యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి రంగాలకి రూ.80వేల కోట్ల పెట్టుబడులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి రంగాలలో దాదాపు రూ.80 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టిపిసి) ప్రతినిధి బృందం తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి తెలియజేసింది. ఎన్‌టిపిసి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గురుదీప్ సింగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం హైదరాబాద్ జూబ్లీ హిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయింది. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రంగంలో పెట్టుబడులకు ఎన్‌టిపిసి సుముఖంగా ఉన్నట్లు ఈ సందర్భంగా ప్రతినిధి బృందం తెలిపింది. ప్రధానంగా సోలార్, పవన విద్యుత్ ప్రాజెక్టులలో దాదాపు రూ.80 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎన్‌టిపిసి సిఎండి వివరించారు. ఫ్లోటింగ్ సోలార్ ఉత్పత్తికి సంబంధించి రాష్ట్రంలో 6,700 మెగావాట్ల సామర్థ్యానికి అవకాశం ఉందని వివరించగా, రాష్ట్రంలో పెట్టుబడుల విషయంలో ప్రభుత్వం ఎన్‌టిపిసికి అన్ని విధాలుగా సహకరిస్తుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# ఓఆర్ఆర్‌పై గ్రేటర్ సిటీ ముఖద్వారం

- అత్యంత ఎత్తుగా ఐకానిక్ టవర్
- బహుళ ప్రయోజనాలుండేలా మూసీ పునరుజ్జీవం
- సంబంధిత అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం / హైదరాబాద్:** హైదరాబాద్ కోర్ అర్బన్ సిటీ ఏరియాలో చేపట్టే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్‌ను బహుళ ప్రయోజనాలు ఉండే విధంగా అత్యంత అధునాతనంగా నిర్మించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను అదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు స్వాగతం పలికేలా హైదరాబాద్ ముఖద్వారంగా హిమాయత్ సాగర్ గాంధీ సరోవర్ దగ్గర ఓఆర్ఆర్‌పై గేట్ వే అఫ్ హైదరాబాద్ నిర్మించాలని సూచించారు.
ఓఆర్ఆర్ కు ఒక వైపున ఎకో థీమ్ పార్క్ అభివృద్ధి చేసి మరోవైపు బాపూ ఘాట్ వైపు భారీ ఐకానిక్ టవర్ నిర్మించాలని, అందుకు తగిన విధంగా డిజైన్లు రూపొందించాలని సిఎం అదేశించారు. రెండు నెలల్లో టెండర్లు పిలిచేందుకు వీలుగా పనుల వేగం పెంచాలని ముఖ్యమంత్రి అధికారులను సిఎం అదేశించారు.
ఓఆర్ఆర్‌కు ఒక వైపు ఉండే ఎకో థీమ్ పార్క్, మరో వైపు నిర్మించే ఐకానిక్ టవర్‌కు చేరుకునేందుకు ప్రయాణాలకు వీలుగా ఎలివేటెడ్ గేట్ వే నిర్మించి దాన్ని 'గేట్ వే అఫ్ హైదరాబాద్'గా డిజైన్ చేయాలని అదేశించారు. బాపూఘాట్ చుట్టూ ఉన్న ఏరియాను వరల్డ్ క్లాస్ జోన్‌గా అందరిని ఆకట్టుకునే విధంగా డిజైన్ చేయాలని చెప్పారు. హిమాయత్‌సాగర్ దగ్గర అప్రోచ్ రోడ్ నుంచి అత్తాపూర్ వైపు వెళ్లేందుకు కొత్త ఫ్లైఓవర్ నిర్మించాలని, గాంధీ సరోవర్ చుట్టూ ఈ ఫ్లైఓవర్ కనెక్టివ్ కారిడార్‌లా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఎయిర్ పోర్ట్ నుంచి నేరుగా గాంధీ సరోవర్‌కు చేరుకునేలా ఈ కనెక్టివిటీ ఉండాలన్నారు. గాంధీ సరోవర్ వద్ద నిర్మించే ఐకానిక్ టవర్ ప్రపంచంలోనే ఎత్తయిన టవర్‌గా నిర్మించాలని సిఎం సూచించారు. సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని, అక్కడ ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఎంత ఎత్తున నిర్మించాలనేది అంచనాకు రావాలని సిఎం సూచించారు. తాగు నీటితో పాటు వరద నీటి నిర్వహణ కు వీలుగా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్ ఉండాలని, వివిధ దేశాల్లో అమల్లో ఉన్న ప్రాజెక్ట్ నమూనాలు పరిశీలించాలని చెప్పారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ తాగు నీటిని హైదరాబాద్ నగర అవసరాలు తీర్చేందుకు మరింత సమర్థంగా వినియోగించుకునేలా ప్రణాళికను రూపొందించాలన్నారు. స్థలం వృధా కాకుండా మూసీ పరివాహక ప్రాంతం ఇరువైపులా భూగర్భంలో భారీగా వాటర్ స్టోరేజ్ సంప్ నిర్మించే సదుపాయాలు, అక్కడి నుంచి నీటిని తరలించే విధంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గాంధీ సరోవర్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసే పనులకు వాటర్ ఫ్లో స్టడీస్ పటిష్టంగా చేసుకోవాలని అధికారులను సిఎం అప్రమత్తం చేశారు.

# వీరయోధ, ఆదర్శ మహిళామూర్తి దొడ్డా పద్మావతి



ఆంధ్ర ప్రాంతంలో పుట్టి, తెలంగాణకు కోడలై.. ఆ ప్రాంత రైతాంగ సాయుధ పోరాటంలో మమేకమై.. పోరాటంలో ఉన్నప్పుడే కామ్రేడ్ దొడ్డా నరసయ్య (డి ఎన్) దళ కమాండర్‌తో దండల మార్పిడితో ఆదర్శ వివాహం చేసుకొని దళాలు వెంట తిరుగుతూ అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ తన భర్త ఇచ్చిన ఉద్యమ స్ఫూర్తితో చివరివరకు కమ్యూనిస్టు ఉద్యమంలో కొనసాగిన ఉద్యమ నాయకురాలు, స్వాతంత్ర సమరయోధురాలు దొడ్డా పద్మావతి.

99 వసంతాలు పూర్తిచేసుకొని 100 లో అడుగిడిన జీవితాన్ని జులై 29న జారిపడి తుంటిఎముక విరిగి ప్రైవేట్ ఆసుపత్రిలో ముగించారు.

**కుటుంబ నేపథ్యం:** కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా, బుద్ధవరం గ్రామం కాట్రగడ్డ రంగయ్య అన్నపూర్ణమ్మ దంపతులకు 1926 లో రెండవ సంతానంగా పద్మావతి జన్మించారు. ఈమెకు అన్న, ఇద్దరూ తమ్ముళ్లు తోపాటు నలుగురు చెల్లెండ్రు. వీరిది పేద వ్యవసాయ కుటుంబం. పద్మ స్వగ్రామంలోనే ఐదవ తరగతి వరకు విద్యనభ్యసించింది.

**రాజకీయ ఉద్యమ నేపథ్యం:** పద్మ తండ్రి కాట్రగడ్డ రంగయ్య అన్న కాట్రగడ్డ పెద్ద వెంకటరాయుడు జాతీయోద్యమంలోనూ, ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీలోనూ క్రియాశీలకంగా పనిచేయడంతో పాటు సిపిఐ తాలూకా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు.బుద్దవరం గ్రామములో 1936 లోనే పార్టీ రాజకీయ శిబిరం నిర్వహించబడింది. వారిఇల్లే పార్టీకి కేంద్రంగా ఉండేది. ఆనాటి కమ్యూనిస్టు ఉద్యమ నాయకులైన చండ్ర రాజేశ్వరరావు, తమ్మారెడ్డి సత్యనారాయణ, వెల్లంకి విశ్వేశ్వర రావు, పేట రామారావు తదితర నాయకులు చాలా మంది వారింటికి వస్తుండేవారు.

ఆనాడు తెలంగాణ ప్రాంతంలో నిజాం రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా జాగిర్దారి, దొరల భూస్వామి దోపిడీ ఆగడాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు, నల్గొండ జిల్లా హుజుర్‌నగర్ తాలూకాలో మునగాల(కృష్ణా జిల్లాలో ఉండేది), బేతవోలు జమీందారులకు, మక్తే దారులకు వ్యతిరేకంగా రైతాంగ ఉద్యమాలు నడుస్తున్నాయి.కృష్ణా జిల్లా తిరువూరు తాలూకాలోను జమీందారుకు వ్యతిరేకంగా రైతాంగ ఉద్యమాలు నడుపుతున్న అన్నతో పాటు ఇతర నాయకుల ఆచూకీ కొరకు పోలీసులు మారు వేశాలతో పద్మ ఇంటికి వస్తుండేవారు.ప్రతిరోజు ప్రభుత్వ గూఢచారులు, స్థానిక శత్రువులు వీరి ఇంటి చుట్టూ, పొలాలచుట్టూ సంచరించుతుండే వారు. నాన్నను, పెద్ద అన్నను అరెస్టు చేశారు. మరుసటి రోజు వారి అమ్మను, చెల్లెలును కూడా కాన్సన్ట్రేషన్ క్యాంపు ఉన్న గంపలగూడెంకు పట్టుకుపోయారు. ఆ సమయములో రంగయ్య గారి సన్నిహితుల సూచనలతో పద్మను పోలీసు వారి కండ్లు కప్పి గుంటూరు జిల్లా నరసరావుపేటలో రహస్య స్థావరంలో ఉంటున్న తెలంగాణ పోరాట యోధులు కామ్రేడ్ దొడ్డా నరసయ్య, అరబండి లక్ష్మి నారాయణ వద్దకుపంపించారు.

**రహస్య స్థావరంలో వివాహం**
రహస్య స్థావరంలో దళానికి కొరియర్‌గా ఉంటున్న పద్మతో చర్చించి నరసయ్య పద్మల అభిప్రాయాలను తెలుసుకున్న పెద్దలు నరసయ్య గారితో వివాహం చేయాలని నిర్ణయించి డిసెంబర్ 3 వ తేదీన 1949 లో సత్తెనపల్లి సమీపంలోని సాయుధ దళాల సమక్షములో పద్మ వివాహం జరిపించారు.

**మూడు సంవత్సరాలు రహస్య జీవితం:** 1949 నుండి 1952 వరకు భర్త డి ఎన్ దళ నాయకుని బృందంలో పద్మ ఒక్కరే మహిళ. పద్మ అసలు పేరు సరస్వతి. హైదరాబాద్ సంస్థానాధిపతి నిజాం నవాబు ఇండియన్ యూనియన్ సైన్యాలకు లొంగిపోయారు. ఇండియన్ యూనియన్ సైన్యాలు కమ్యూనిస్టు గెరిల్లా దళాలపై నిర్బంధాలు, కనిపిస్తే కాల్చివేతలు ఎక్కువైనాయి. దళాల రక్షణ సమస్య తీవ్రమైంది, రక్షణ కొరవడటంతో స్థావరాలు మార్చాల్సిన అనివార్య పరిస్థితులు నెలకొన్నాయి. నరసయ్య దళం నల్లమల అడవులకు పోగా పద్మావతి రెంటపాళ్ల అనసూయ, అప్పిరెడ్డి వెంకటేశ్వర తో కలిసి గుంతకల్లు, బళ్లారి ప్రాంతాల్లో కొంతకాలం రహస్యజీవితం గడిపారు. అనంతరం మహారాష్ట్రలోని సోలాపూర్ చేరుకున్నారు. అక్కడ ఉన్న తెలంగాణ బీడీ కార్మికుల సహాయంతో బీడీలు చుట్టే పనులు చేస్తూ మూడు మాసాలు గడిపారు. ఆ తర్వాత పార్టీ కాంటాక్ట్ లభించడంతో రాచకొండ అడవులకు చేరుకున్నారు. 18 మైళ్లు అడవులలో నడిచి వెళ్లి అక్కడ భీమన్న దళాన్ని కలిశారు. ఆ తరువాత నల్లమల అడవుల్లో కొండలపైన ఉన్న డిఎన్ దళం వద్దకు రెండేళ్ల తర్వాత చేరుకున్నారు. పార్టీ సర్క్యులర్లు, కరపత్రాలు రాసే పని అప్పగించారు. అప్పుడే పద్మావతి మిలిటరీ ట్రైనింగ్ శిక్షణ పొందారు. అడవులలో జొన్న సంకటి, వరి నూకలు, రాగులు కలిపిన జావ, ఆవు మాంసం వీరి ఆహారం.

**సాయుధపోరాట విరమణతో జనంలోకి:**
సాయుధ పోరాట విరమణతో పుచ్చలపల్లి సుందరయ్య గారు డిఎన్ దళం ఉన్న నల్లమల అడవుల్లోకి వచ్చి సాయుధపోరాట విరమణ పై చర్చలు జరుపుటతో పద్మ వారితోపాటు తన అత్తవారింటికి చేరుకుంది. డిఎన్ గారి దళం పై వివిధ కేసులండుటము వలన వారు 1953 వరకు రహస్యంగానే ఉండవలసి వచ్చింది. 1952 లో జనరల్ ఎన్నికలు రావడంతో పద్మ ప్రజాజీవనములో మమేకమై మహిళలను సమీకరించి హుజూర్‌నగర్ నుంచి పిడిఎఫ్ అభ్యర్థి జయసూర్య గారి విజయం కొరకు,తిరిగి ఉప ఎన్నికల్లో ముఖ్దూమ్ మొహియుద్దీన్ విజయం కొరకు, 1957లో దొడ్డ నరసయ్య గారి విజయం కొరకు గ్రామ గ్రామాన మహిళలను సమీకరించి ప్రచారంలో భాగస్వాములయ్యారు. భర్త దొడ్డా నరసయ్య గారికి ఎమ్మెల్యేగా హైదరాబాదులో క్వార్టర్ ఇచ్చినప్పటికీ హుజూర్‌నగర్‌లోనే ఉంటూ పార్టీ ప్రజా సంఘాల ఉద్యమాలలో క్రియాశీలకంగా పనిచేశారు. 1959 లో ఏర్పడిన నల్గొండ జిల్లా పరిషత్ కు కోఆప్షన్ సభ్యురాలుగా ఎన్నుకోబడినారు.

1978లో దొడ్డా నర్సయ్య సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శిగా ఎన్నిక కావడంతో నల్లగొండ 1981లో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలుగా ఎన్నికైన పద్మ 1991 వరకు కొనసాగారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మ గారికి స్వాతంత్ర సమరయోధుల పింఛన్ అందించింది. 1999 లో దొడ్డ నర్సయ్య గారి మరణంతో ఆమె వృద్ధాప్యము, ఆరోగ్య సమస్యలతో చిలుకూరులో తన కుమార్తె కల్పన వద్ద ఉంటు న్నారు. నిస్వార్థంగా జీవితాంతం ప్రజాసేవలో కొనసాగిన ఆదర్శ మహిళామూర్తి దొడ్డా పద్మగారిని స్మరించుకుందాము..

(**నోట్:** దొడ్డా పద్మావతి గారి సంతాప సభ ఆగస్టు 10 న చిలుకూరులో జరుపుతున్న సందర్భంగా..)

ఉజ్జిని రత్నాకర్ రావు,
సిపిఐ సీనియర్ నాయకులు, 9490952646

## 11న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి విస్తృత సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి విస్తృత సమావేశం ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పట్టణంలోని ఆరిజన్ హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరగనుందని రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యులు టి.వెంకట్రాములు హాజరు కానున్నారని ఆయన తెలిపారు.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on X SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

**టెండర్ నోటీసు నం. 2025 యొక్క 1 తేదీ: 06.08.2025** PUB/0964

ireps పోర్టల్ ద్వారా కింది టెండర్‌ను దాఖలు చేశారు. టెండరుదారులు www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి తమ ఆఫర్లను సమర్పించాలని అభ్యర్థించారు. మాన్యువల్‌గా లేదా కాగితంపై సమర్పించిన ఆఫర్లు అంగీకరించబడవని గమనించండి. పోస్ట్ ద్వారా పంపిన ఆఫర్లు స్వీకరించబడవు:

**1. టెండర్ నంబర్: SCR-MLR-CSM-3X. 2. పని పేరు:** SC రైల్వేలో పనిచేస్తున్న 01 (ఒకటి) ప్లాసర్ తయారీ సంఖ్య 09-32 CSM మెషిన్ (మెషిన్ నం. 968) యొక్క మిడ్‌లైఫ్ రిహాబిలిటేషన్ / సాంకేతిక అప్‌గ్రేడ్‌ను 09-32 CSM డైనమిక్ ట్యాంపింగ్ మెషిన్ (ట్యాంపింగ్ మరియు స్టెబిలైజింగ్ మెషిన్) & మిడ్‌లైఫ్ పునరావాసం / SC రైల్వేలో పనిచేస్తున్న 02 (రెండు) ప్లాసర్ తయారీ హై అవుట్‌పుట్ 09-3X ట్యాంపింగ్ ఎక్స్‌ప్రెస్ మెషిన్ల (మెషిన్ నం 3957 & 3968) యొక్క సాంకేతిక అప్‌గ్రేడ్‌ను తాజాగా అందుబాటులో ఉన్న 09-3X హై అవుట్‌పుట్ డైనమిక్ ట్యాంపింగ్ ఎక్స్‌ప్రెస్ (DTE) కు, అలాగే 09-3x-3957 యంత్రం యొక్క ప్రస్తుత ఉపగ్రహ ఫ్రేమ్‌ను కొత్త ఉపగ్రహ ఫ్రేమ్‌తో భర్తీ చేయడం. **3. టెండర్ ముగింపు తేదీ & సమయం:** 05-09-2025 మధ్యాహ్నం 15.00 గంటలకు. **4. ప్రకటించబడిన విలువ:** రూ. 52,93,75,081/-. **5. పూర్తి చేసే వ్యవధి:** 18 నెలలు.

పూర్తి వివరాల కోసం దయచేసి www.ireps.gov.in చూడండి.

Dy.CE/TM/HQ

**ఇ-టెండర్ నోటీసు నం. C-SG-PT-MSDAC-03 తేదీ: 07.08.2025** PUB/0965

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి తరపున Dy.CSTE/Projects/Tele/SC ఈ క్రింది పనుల కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తుంది.

**టెండర్ నంబర్ మరియు తేదీ:** C-SG-PT-MSDAC-03 తేదీ 07.08.2025 **పని పేరు** (i) నాందేడ్, పర్భాని, పూర్ణ, ముద్ఖేడ్ స్టేషన్‌లోని ఇప్పటికే ఉన్న ట్రాక్ సర్క్యూట్లకు డ్యూయల్ డిటెక్షన్‌లో మల్టీ సెక్షన్ డిజిటల్ యాక్సిల్ కౌంటర్ (MSDAC) కంప్లీట్ సిస్టమ్ ఏర్పాటు. (ii) నాందేడ్ డివిజన్‌లోని శివ్నిశివాపూర్, వాషిమ్ మరియు మట్టెక్డి స్టేషన్‌లోని ఇప్పటికే ఉన్న ట్రాక్ సర్క్యూట్ల గూడ్స్ సైడింగ్/ లూప్ లైన్కు డ్యూయల్ డిటెక్షన్‌లో మల్టీ సెక్షన్ డిజిటల్ యాక్సిల్ కౌంటర్ (MSDAC) కంప్లీట్ సిస్టమ్ ఏర్పాటు. **అంచనా వేసిన ప్రాజెక్ట్ ఖర్చు:** రూ.26,62,69,653.70/-, **బిడ్ సెక్యూరిటీ:** రూ.14,81,400.00/-, **పని పూర్తి చేసే కాలం:** 12 నెలలు, **బిడ్ ముగింపు తేదీ (బిడ్ గడువు తేదీ):** 08.09.2025 15.00 గంటలకు, **బిడ్ ప్రారంభ తేదీ:** 08.09.2025 15.00 గంటల తర్వాత ఆఫర్ చెల్లుబాటు బిడ్ ముగింపు తేదీ నుండి 120 రోజులు, **టెండర్ బుక్‌లెట్ ధర:** రూ.0/-

అన్ని బిడ్డింగ్లు ఇండియన్ రైల్వే ఇ-టెండరింగ్ పోర్టల్ www.ireps.gov.inలో ఉన్నాయి. ఈ టెండర్‌కు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు. మరిన్ని వివరాలను www.ireps.gov.inలో చూడవచ్చు.

డిప్యూటీ చీఫ్ సిగ్నల్ మరియు టెలికమ్యూనికేషన్ ఇంజనీర్/ Projects/Tele/SC

**టెండర్ నోటీసు నం. 73 to 74 DRM W HYB 25, తేదీ: 07/08/2025.** PUB/0966

భారత రాష్ట్రపతి తరపున, డివిజనల్ రైల్వే మేనేజర్ / వర్క్స్, హైదరాబాద్ డివిజన్, సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్ 29/08/2025 సాయంత్రం 3 గంటల వరకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా కింది పనుల కోసం ఓపెన్ టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

**టెండర్ నం.:** 73 DRM W HYB 25, **పని పేరు:** JKM-BDHN విభాగం: CTR(P)- 12.00 కి.మీ. నుండి 0.00-12.00 కి.మీ. వరకు ప్రతిపాదన, **సుమారు విలువ రూ.**3,48,75,766, **ఇఎండి రూ.** 3,24,400

**టెండర్ నం.** 74 DRM W HYB 25, **పని పేరు:** MJF-MLY విభాగం: వర్క్ షాప్స్/LGD (1). CTR(S)-3.10 కి.మీ. TSMD(EMU కార్ షెడ్), క్యారేజ్ వర్క్ షాప్ మరియు డీజిల్ లోకో షెడ్ (2) వద్ద. SC-MUE విభాగం: ట్రాలీ రెఫ్యూజ్‌లు మరియు ప్రధాన లైన్ల inder SSE/P.W/MED విభాగంలో విడుదల చేసిన PSC స్లీపర్లతో బౌండరీ పిల్లర్ల ఫిక్సింగ్. **సుమారు విలువ రూ.** 2,13,01,738, **ఇఎండి రూ.** 2,56,500

మరిన్ని వివరాల కోసం www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి

సీనియర్ DEN/Co-ord/HYB

**టెండర్ నోటీసు నం.32/2025. తేదీ: 07.08.2025.** PUB/0967

స్టోర్స్ ఐటమ్స్ సరఫరా. ఇ-ప్రొక్యూర్‌మెంట్ **టెండర్ నోటీసు** :- కింది టెండర్లు ఆన్‌లైన్‌లో ఫ్లోట్ చేయబడ్డాయి. టెండర్‌దారులు www.Ireps.Gov.In వెబ్‌సైట్‌ను సందర్శించి వారి ఆఫర్లను ఆన్‌లైన్‌లో సమర్పించాలని కోరడమైనది. టెండర్ వివరాలు, Qty, EMD, SD వెబ్‌సైట్‌లో చూడవచ్చు. మాన్యువల్‌గా సమర్పించిన ఆఫర్లు అంగీకరించబడవు. పోస్ట్ ద్వారా ఆఫర్లు స్వీకరించబడవు. టెండర్ ముగింపు సమయం టెండర్ గడువు తేదీన టెండర ముగింపు సమయం 14:30 గంటలు. "అన్ని స్వదేశీ ఆఫర్ల కోసం, www.Ireps.Gov.Inలో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా మాత్రమే ఇఎండి అంగీకరించబడుతుంది".

| టెండర్ నం. | సంక్షిప్త వివరణ |
|---|---|
| LN259001A | స్టెయిన్‌లెస్ స్టీల్ నాన్-పర్ఫొరేటెడ్ డస్ట్ బిన్ |
| 33251007A | ప్రైమరీ సస్పెన్షన్ కోసం రబ్బర్ ప్యాడ్ |
| 29251362 | WAG9/WAP7 లోకోల కోసం యా డాంపర్ |
| 77251105A | PU పెయింట్-జెన్షన్ బ్లూ |
| 6025PT024 | RDSO Drg. నం. T-6618 కు కాంపోజిట్ గ్రూవ్డ్ రబ్బర్ సోల్ ప్లేట్లు |
| 6025PT025 | RDSO Drg. నం. T-8747 కు కాంపోజిట్ గ్రూవ్డ్ రబ్బరు సోల్ ప్లేట్లు |
| 6025PT021 | O/R స్విచ్ T-4966 సేకరణ |
| 29251399A | గ్రీజు లూబ్రికేషన్ రంధ్రాలతో యాక్సిల్ బాక్స్ బేరింగ్ CRU-150 |
| 6025PT026 | వివిధ ISEJ HSFG బోల్ట్‌ల సేకరణ |

**గమనిక: టెండర్ తెరవడానికి గడువు తేదీలు:** క్ర.సం.01&02 తేదీ: 25.08.2025న. క్ర.సం.03 తేదీ: 26.08.2025న. క్ర.సం.04 తేదీ: 28.08.2025న. క్ర.సం.05&06 తేదీ: 22.09.2025న. క్ర.సం.07 తేదీ: 03.09.2025న. క్ర.సం.08 తేదీ: 16.09.2025న. క్ర.సం.09 తేదీ: 09.09.2025న. పైన పేర్కొన్న టెండర్లతో పాటు వివరాల కోసం రూ. 50 లక్షల కంటే ఎక్కువ విలువ కలిగిన ఇతర టెండర్లు ఉన్నాయి. దయచేసి వివరాలకు పైన పేర్కొన్న రైల్వే వెబ్‌సైట్ సందర్శించగలరు.

ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్ /SCR/ సికింద్రాబాద్.

**C/E.29/TRD/SC/39/2025-26 తేదీ: 06.08.2025** PUB/0969

సికింద్రాబాద్‌లోని ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్‌లోని సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, సింగిల్ ప్యాకెట్ సిస్టమ్ ఆఫ్ టెండరింగ్‌లో కింది పనుల కోసం భారత రాష్ట్రపతి తరపున ఇ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నారు.

**క్ర.సం. 1, NIT నం. C/E.29/TRD/SC/39/2025-26. పని పేరు:** టెండర్ నం. C/E.29/TRD/SC/39/2025-26, తేదీ. 06.08.2025, "SC డివిజన్: HSP: HSP యార్డ్ వద్ద బ్యాలస్ట్ సైడింగ్-2 వద్ద ప్రతిపాదిత OHE సౌకర్యం". **వివరాలు అంచనా వ్యయం: రూ. 67,33,104.93, పూర్తి చేయుడానికి సమయం: 120 రోజులు. ముగింపు తేదీ: 04.09.2025 15:00 గంటలకు.**


1) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కోసం, దయచేసి http://ireps.gov.in వెబ్‌సైట్‌ను లాగిన్ అవ్వండి. 2) టెండరుదారులు ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనాలి మరియు మాన్యువల్ ఆఫర్లను పరిగణించబడవు. 3) ఆశావాహ టెండరుదారులందరూ ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా మాత్రమే టెండర్ ఫారం మరియు ఇఎండి ఖర్చును చెల్లించాలని అభ్యర్థించబడుతుంది. 4) ఆశావాహ టెండరుదారులందరూ GSTIN గుర్తింపు నంబర్లను పొంది మరియు వారి ఆఫర్లతో పాటు సమర్పించాలని సూచించారు. 5) టెండర్ సమర్పణ వ్యవధి ప్రారంభమయ్యే తేదీ వరకు ఏదైనా కొరిజెండా (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది) కోసం టెండరుదారులు గమనించాలి.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ TRD/సికింద్రాబాద్
A1196

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.


# అనంతనాగ్‌కు చేరుకున్న తొలి గూడ్స్ రైలు

### అన్ని ప్రాంతాల నుంచి కశ్మీర్ లోయకు నేరుగా రైల్వే కనెక్టివిటీ


రైల్వే చరిత్రలో చారిత్రక ఘట్టం

**ప్రజాపక్షం/హైదరాబాద్:**జమ్మూకశ్మీర్ చరిత్రలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. తొలిసారిగా ఒక సరుకు రవాణా రైలు (గూడ్స్ రైలు) కశ్మీర్ లోయలోని అనంతనాగ్ పట్టణానికి చేరుకుంది. ఈ చారిత్రక పరిణామంతో, ఉధంపూర్‌శ్రీనగర్‌బారాముల్లా రైల్ లింక్ (యూఎస్‌బిఆర్‌ఎల్) ప్రాజెక్టులో అత్యంత కీలకమైన బనిహాల్‌సంగల్దాన్ రియాసికాట్రా సెక్షన్ అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించినట్లయింది. ఈ విజయంతో కశ్మీర్ లోయ భారత రైల్వేల సరుకు రవాణా కారిడార్‌తో నేరుగా అనుసంధానమైంది. ఈ కొత్త రైలు మార్గం వల్ల కశ్మీర్ ఆర్థిక వ్యవస్థకు భారీ ఊతం లభించనుంది. ఇప్పటివరకు సరుకుల రవాణాకు శ్రీనగర్‌జమ్మూ జాతీయ రహదారిపైనే ఆధారపడాల్సి వచ్చేది. అయితే, కొండచరియలు విరిగిపడటం, వాతావరణ సమస్యల వల్ల ఈ రహదారి తరచూ మూతపడేది. దీంతో రవాణాలో తీవ్ర అనిశ్చితి నెలకొనేది. ఇప్పుడు రైలు మార్గం అందుబాటులోకి రావడంతో ఆ కష్టాలకు తెరపడినట్లయింది. రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గనుండటంతో పాటు, ఏడాది పొడవునా దేశంలోని ఏ ప్రాంతం నుంచైనా కశ్మీర్‌కు, ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు సరుకులను సులభంగా చేరవేయవచ్చు. ముఖ్యంగా, లోయలో భారీగా పండే యాపిల్స్ వంటి ఉద్యాన ఉత్పత్తులను దేశంలోని ఇతర మార్కెట్లకు వేగంగా తరలించేందుకు మార్గం సుగమమైంది కాగా, ఆగస్టు 10న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమృత్‌సర్, శ్రీ మాతా వైష్ణో దేవి కాట్రా మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. భారత రైల్వే చరిత్రలోనే యూఎస్‌బీఆర్‌ఎల్ ప్రాజెక్టు ఒక ఇంజినీరింగ్ అద్భుతంగా నిలిచింది. అత్యంత కఠినమైన హిమాలయ పర్వత ప్రాంతాలలో ఎన్నో భౌగోళిక, సాంకేతిక సవాళ్లను అధిగమించి ఈ మార్గాన్ని నిర్మించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి అయిన చీనాబ్ వంతెన, దేశంలోనే తొలి కేబుల్ ఆధారిత రైల్వే వంతెన అంజి ఖడ్ బ్రిడ్జి ఈ ప్రాజెక్టులో భాగమే. ఈ మార్గంలో మొత్తం 38 సొరంగాలు ఉన్నాయి. ఈ రైల్వే ప్రాజెక్టు రాకతో విద్యార్థులు, వ్యాపారులు, పర్యాటక రంగ నిపుణులు, సామాన్య ప్రజలకు దేశంలోని ఇతర ప్రాంతాలకు ప్రయాణం సురక్షితంగా, చౌకగా మారింది. ప్రస్తుతం కాట్రా, బారాముల్లా మధ్య నడుస్తున్న రైలు సేవలను ఈ ఏడాది చివరికల్లా జమ్మూ రైల్వే స్టేషన్ నుంచి బారాముల్లా వరకు విస్తరించ నున్నారు.

## రాఖీ పండుగకు ఆర్‌టిసి సిబ్బంది అంకితభావం అభినందనీయం

### రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ప్రజలకు నిరంతరాయంగా సేవలు అందిస్తున్న ఆర్‌టిసి సిబ్బందిని రాష్ట్ర రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. సోదరభావానికి ప్రతీకైన ఈ పండుగ రోజున తమ వ్యక్తిగత సెలవులను త్యాగం చేసి, నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అంకితభావం ఎంతో గొప్పదని ఆయన కొనియాడారు. గత రాఖీ పండుగ సందర్భంగా ఆర్‌టిసి సాధించిన రికార్డులను మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత ఏడాది రాఖీ రోజున ఒక్కరోజే 63 లక్షల మందిని సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరవేశారని, మూడు రోజుల్లోనే రికార్డు స్థాయిలో 1.77 కోట్లమంది ప్రజలు ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించారని తెలిపారు. ఈ సంవత్సరం కూడా అదే స్ఫూర్తితో సిబ్బంది పనిచేస్తున్నారని చెప్పారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఉచితంగా ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించి తమ సోదరులకు రాఖీలు కడుతున్నారని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్న వారందరికీ మంత్రి అభినందనలు తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థను ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు చెప్పారు.

# మేయర్ నివాసంలో ఘనంగా రక్షాబంధన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బంజారాహిల్స్‌లోని మేయర్ గద్వాల విజయలక్ష్మి నివాసంలో శనివారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు కులమతాలకు అతీతంగా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సోదర, సోదరీమణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ పండుగ నిలుస్తుందని మేయర్ ఈ సందర్భంగా అన్నారు. ఈ పండుగ ప్రేమ, అనురాగాలను పెంచుతుందని ఆమె అన్నారు. నగర ప్రజలందరికీ మేయర్ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, నగర వాసులు పాల్గొన్నారు.

# ఆత్మీయ అనుబంధాల వేడుక రాఖీపండుగ

### పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి

**ప్రజాపక్షం/హనుమకొండ :** ఆత్మీయ అనుబంధాల వేడుక రక్షాబంధన్ అని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం రాఖీ పండుగను పురస్కరించుకుని హనుమకొండ భవాని నగర్ యందు మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన చిన్నారులు, కాంగ్రెస్ పార్టీ మహిళా ప్రతినిధులు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికి రాఖీకట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరకాల నియోజకవర్గ ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.సోదరుడు సోదరి అనుబంధానికి ప్రతీక గా జరుపుకునే పండుగా అన్నారు."రాఖీ పండుగ సోదరాభిమానాలకు, సాంస్కృతిక విలువలకు ప్రతీక. ఇలాంటి పండుగలు మన మధ్య ప్రేమ, ఐక్యతను పెంచుతాయి అని అన్నారు. సోదరులు తమ సోదరీమణులను రక్షించుకోవడం, సమాజంలో మహిళలకు గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.





**మానసిక వికలాంగ పిల్లలతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాఖీ పండుగ**
హన్మకొండ లోని మల్లికాంబ మనోవికాస కేంద్రం లోని మానసిక వికలాంగ పిల్లలతో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాఖీ పౌర్ణమి పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా హన్మకొండ కనకదుర్గ కాలనీ లోని ఎమ్మెల్యే నివాసం లో చిన్నారులతో రాఖీ కట్టించుకున్నారు. చిన్నారులకు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మీయ అనురాగాలకు ప్రతీక అయిన రాఖీ పండుగను చిన్నారులతో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.

**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాగరాజు**
హనుమకొండ సుబేదారిలో గల వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు రాఖీ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తన సోదరి రాజేశ్వరి తన సోదరులైన నాగరాజు,క్రిష్ణమూర్తిలకు రాఖీ కట్టి దీవెనలు అందించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ అందమైన అనుబంధం, అంతులేని అనురాగం అన్నా చెల్లెళ్ల సొంతమని అన్నారు.

## 'సింగరేణి' ప్రాంతంలో కవిత అడుగులు

### నేడు హెచ్ఎంఎస్ ప్రతినిధులతో సమావేశం...

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని సింగరేణి ప్రాంతంలో సొంతంగా ఎదిగేందుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత సిద్ధమైనట్టు తెలిసింది. బిఆర్‌ఎస్‌కు చెందిన టిబిజికెఎస్‌కు సంబంధం లేకుండానే 'జాగృతి' సంస్థను సింగరేణి ప్రాంతంలో విస్తృతంగా విస్తరించేందుకు కవిత ప్రణాళికలను రూపొందించుకున్నది. ఇందులో భాగంగానే హెచ్ఎంఎస్ సంఘం ప్రతినిధులతో హైదరాబాద్ లోని తన నివాసంలో ఆదివారం సమావేశం కానున్నట్టు సమాచారం. ఇటీవల టిబిజికెఎస్ సంస్థకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఇన్‌చార్జిగా కెటిఆర్ నియమించారు. దీంతో టిబిజికెఎస్ నుంచి కవితను దూరం చేసినట్టు పార్టీ వర్గాల్లో చర్చ కూడా జరిగింది. ఆ తర్వాత బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో బిఆర్‌ఎస్, కవిత మధ్య భిన్న వాదనలు వినిపించారు. అయితే తాజాగా రాఖీ పండుగ సందర్భంగా కెటిఆర్ అందుబాటులో లేకపోవడంతో కవిత తీవ్రంగా కలత చెందినట్టు తెలిసింది.

## ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులనే వాడాలనే సంకల్పం స్వీకరించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి బిజెపి నాయకురాళ్లు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పా రెడ్డి, రాణి రుద్రమ తదితర మహిళా నేతలు రాఖీ కట్టి తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా రక్షా బంధన్ జరుపుకుంటున్న హిందూ సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సనాతన ధర్మాన్ని, హిందూ సాంస్కృతిని, సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత ప్రతి భారతీయుడి పైనా ఉందన్నారు. స్వదేశీ వస్తువుల వాడకాన్ని ప్రోత్సహించాలని ప్రజలను కోరారు. భారతదేశం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతున్నందున విదేశీ వస్తువులను పక్కన పెట్టి, స్వదేశీ వస్తువులను వాడడం ద్వారా దేశం మరింత స్థిరంగా ఉంటుందని కిషన్ రెడ్డి చెప్పారు.



## భక్తిశ్రద్ధలతో తీజ్ పండుగ



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** గిరిజనులు భక్తిశ్రద్ధలతో తీజ్ పండుగ నిర్వహించుకోవడం చాలా సంతోషమని కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు వీరునాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని మంగళితండ గ్రామంలో గిరిజన మహిళలు గత 9 రోజులుగా సంప్రదాయ ప్రకారం మొలకలు ఇంటి ఆవరణలో పెట్టి ప్రతి రోజు వాటిని సంప్రదాయ ప్రకారం నీళ్ల పోసి, చివరి రోజున ఇంటి నుండి తీసుకుని వచ్చి దేవత విగ్రహాల వద్ద ఉంచడం వల్ల పంటలు సమృద్ధిగా పండి ఆర్థికంగా అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. దీంతో ఆయా కూడల్లో మొలకలను ఏర్పాటు చేసుకుని మహిళలు నృత్యాలు చేయడంతో ఆ ప్రాంతం పండుగ వాతావరణం నెలకొంది. సింగం, పంతులు, వస్రం, శ్రీను, నాగ్య, రూప్లా, వెంకన్న, వెంకటేశ్వర్లు,మహిళలు పాల్గొన్నారు.

## సీలింగ్ ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు అందజేత

**ప్రజాపక్షం/మునుగోడు:** మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సతీమణి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్ పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి రాజగోపాల్ రెడ్డి జన్మదినం,యువజన కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినోత్సవాల తోపాటు నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మేకల ప్రమోద్ రెడ్డి సోదరి ప్రశాంతి జన్మదినం సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల విద్యాలయం, బోడంగిపర్తిలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర విద్యాలయాలకు, నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మేకల ప్రమోద్ రెడ్డి సొంత ఖర్చులతో రూ.40,000 వ్యయంతో 20 సీలింగ్ ఫ్యాన్లు, 20ఎల్ఈడీ ట్యూబ్ లైట్లు, అలాగే విద్యుత్ అంతరాయం జరిగినా హాస్టల్ విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఉండటానికి 20 ఛార్జింగ్ లైట్లు అందజేశారు. ఈ సందర్భంగా బోడంగిపర్తి పాఠశాల విద్యార్థులు కేక్ కట్ చేసి కోమటిరెడ్డి లక్ష్మీ రాజ్ గోపాల్ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పాల్వాయి జితేందర్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు అబ్బానబోయిన రాము యాదవ్,ఎండి. అన్వర్, జాల మణికంఠ, బెల్లి పూర్ణచందు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ పనిముట్లకు దరఖాస్తు

**ప్రజాపక్షం/చిట్యాల:** వ్యవసాయ యాంత్రీకరణ 20252026లో భాగంగా వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై పొందడానికి ఆయా గ్రామాల రైతులు తమకు సంబంధించిన రైతు వేదికలో ఏఈఓకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి గిరిబాబు ఒక ప్రకటనలో కోరారు. అలాగే రైతు భీమా కోసం కూడా రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మహిళా, సన్నకారు రైతులకు 50 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీతో పనిముట్లను అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. యాంత్రీకరణ పథకం కింద ఈ సంవత్సరం బ్యాటరీ పంపులు, చేతి పంపులు, పవర్ స్ప్రేయర్లు, రోటవేటర్లు, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్లర్లు, డిస్క్ హేరో, కల్టివేటర్లు, ఎంబి ఫ్లవ్, బండ్ ఫార్మర్, పవర్ టిల్లర్, స్ట్రా బేలర్ తదితర వస్తువులు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. అవసరమైన రైతులు దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, ట్రాక్టర్ పనిముట్ల కోసం అయితే ట్రాక్టర్ ఆర్సీ కాపీ, ఒక పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఈ నెల 13వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే రైతుభీమా కోసం 14.08.66 నుండి 14.08.2007 సంవత్సరాల మధ్య జన్మించి 59 సంవత్సరాలు లోపు వయస్సు ఉన్న రైతులు మాత్రమే రైతు భీమా కోసం ఈనెల 13లోపు పైన తెలిపిన పత్రాలను జత చేసి దరఖాస్తు చేసుకోవాలని గిరిబాబు పేర్కొన్నారు.

## బుద్ధవనం సందర్శనకు న్యూయార్క్ బౌద్ధాచార్యుని ఆసక్తి



**ప్రజాపక్షం/నందికొండ:** అనేక బౌద్ధ వారసత్వ ఆకర్షణలతో పేరుగాంచిన నాగార్జునసాగర్ లోని బుద్ధవనం, నాగార్జున కొండను సందర్శించడానికి న్యూయార్క్ లోని మహాయాన బుద్ధ విహార ప్రధానాచార్యుడు ఆసక్తి కనపరచారని బౌద్ధ పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సిఈఓ, డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. న్యూయార్క్ లోని బౌద్ధాలయాల సందర్శనలో భాగంగా శనివారం ఆయన న్యూయార్క్ కెనాల్ వీధిలోని మహాయాన బౌద్ధాలయాన్ని సందర్శించి, తెలుగు నేలపై గల ప్రసిద్ధ బౌద్ధ స్థావరాలను, ప్రత్యేకించి బుద్ధవనం, నాగార్జున కొండలను సందర్శించవలసిందిగా ఆహ్వానించినట్లు చెప్పారు. బుద్ధవనంలోని ఆచార్య నాగార్జున రచనలపై ఒక పరిశోధన కేంద్రాన్ని నెలకొల్పాలని, అమెరికాలోని బౌద్ధాలయాలు, విహారాల ప్రతినిధులు, కృష్ణ తీరంలో విలసిల్లిన ప్రముఖ బౌద్ధ స్థావరాల వివరాలను తెలుసుకోవడానికి తగిన సమాచారాన్ని అందజేయమని ఆయన కోరారని శివనాగిరెడ్డి తెలిపారు. తాను త్వరలో బుద్ధవనం అధికారులను కలిసి ఈ విషయంపై చర్చించి, కేవలం దక్షిణాసియా దేశాల నుంచేకాక యూరోప్, అమెరికా, ఆస్ట్రేలియా దేశాల బౌద్ధ పర్యాటకులను ఆకర్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆహార శాస్త్రవేత్త, న్యూయార్క్ యార్క్ తెలుగు లిటరరీ అండ్ కల్చరల్ సొసైటీ ప్రతినిధి, కథా రచయిత, డాక్టర్ కలశపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారని శివనాగిరెడ్డి తెలిపారు.

## రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో సూర్యాపేటవాసికి బంగారు పతకం




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఈనెల 7, 8 తేదీల్లో అదిలాబాద్‌లో జరిగిన తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి యోగాసన పోటీలలో సూర్యాపేట పట్టణానికి చెందిన గూడూరు నాగేశ్వర్‌రావు బంగారు పతకం సాధించినట్లు సూర్యాపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తీకుళ్ళ సాయిరెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీదేవి, కార్యదర్శి శ్రీనివాస్‌లు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో సీనియర్ బి విభాగంలో నాలుగు ఈవెంట్లలో పాల్గొని, నాలుగింటిలో కూడా ప్రథమ స్థానం పొంది బంగారు పతకాలు సాధించిన మన సూర్యాపేట వాసి నాగేశ్వరరావు అభినందనీయులన్నారు. యోగాసనాలలో మరెన్నో పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. సీనియర్ ఏ విభాగంలో సూర్యాపేటకు చెందిన దేశగాని ఉప్పలయ్య, సీనియర్ బి విభాగంలో కోదాడకు చెందిన కీత శ్రీనివాసరావులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు.

## యువజన కాంగ్రెస్ పునాదిలాంటిది



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** బూత్ స్థాయి నుంచే యువజన కాంగ్రెస్ ను పటిష్టం చేయాలని మాజీ జెడ్పిటిసి, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి అన్నారు.శనివారం స్థానిక మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో యువజన కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. గుమ్మల మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ కార్యకర్తలంతా కాంగ్రెస్‌కి సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో నాయకులుగా ఎదగడానికి యువజన కాంగ్రెస్ పునాది లాంటిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కత్తుల కోటి, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ జహంగీర్ బాబా, యువజన పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, నల్లగొండ మండల అధ్యక్షుడు కె.వి.ఆర్ సతీష్ పాల్గొన్నారు.

## మాజీ ఎంపిటిసి సుశీల మృతి

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** మండలం పరిధిలోని పల్లెపహడ్ గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి సభ్యురాలు సంగిశెట్టి సుశీల శనివారం అనారోగ్య కారణంతో మృతిచెందింది. సుశీల మృతి పట్ల తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర సంతాపం తెలిపారు. ఆమె మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. దంపతులు ఇద్దరు రాజకీయాలలో రాణించి గ్రామ సర్పంచ్‌గా, ఎంపిటిసి సభ్యులుగా పదవులు చేపట్టి ప్రజాసేవకే అంకితమైన కుటుంబమని కీర్తించారు. సంతాపం తెలిపిన వారిలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్ , సిపిఐ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్ , వెంపటి శ్రీనివాస్, ఆలకుంట నరసింహ, పుల్లసాని అనంతరెడ్డి, వనం వాసుదేవ్, పిచ్చిరెడ్డి మల్లారెడ్డి ఉన్నారు.

# ఆదివాసీల హక్కులను పరిరక్షిస్తాం

### దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్




**ప్రజాపక్షం/దేవరకొండ:** ఆదివాసీల హక్కులను పరిరక్షిస్తాం అని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకల్లో అధికారులు, నాయకులు, విద్యార్థులు, ఆదివాసి సంఘాల నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ప్రాచీన చరిత్రకు, సంస్కృతికి, సంప్రదాయాలకు, నిరాడంబరతకు నిలువుటద్దంగా నిలిచే జీవనశైలి ఆదివాసుల సొంతమని ప్రకృతి మాత బిడ్డలైన గిరిపుత్రులకు ప్రపంచ ఆదివాసి దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య భారత దేశంలో ఆదివాసీ గిరిజన ప్రజలు ఇంకా సమానత్వంకోసం, హక్కుల కోసం పోరాటాలు చేస్తూ భూమి కోసం, భుక్తి కోసం, వివక్ష లేని సమాజం కోసం ఇంకా ఉద్యమిస్తూనే ఉన్నారని ఎంఎల్‌ఏ బాలునాయక్ అన్నారు. గిరి పుత్రులు, వనవాసిలు ప్రత్యేకమైన ఆచార, సంస్కృతి, సాంప్రదాయాలను కలిగి ఉంటారని, ఆదివాసీల ఉనికి, మనుగడ, హక్కుల పరిరక్షణకు గాను ప్రపంచ వ్యాప్తంగా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని జరపాలని ఐక్యరాజ్యసమితి 1994లో ప్రకటించిందని తెలిపారు. ఆనాటి నుండి ఆగస్టు 9న ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసి దినోత్సవం జరుపబడుతూ ఆదివాసీల హక్కుల పరరక్షణకు నూతన మార్గాల అన్వేషణ, సంస్కృతి, సాంప్రదాయ విశిష్టతను చాటి, వారి విద్యా, వైద్య, భూ హక్కుల సాధన, మౌలిక వసతుల కల్పన దిశగా భారతదేశమంతా చర్చించుకునే దినంగా ఓ ప్రత్యేకత కలిగి ఉందని అన్నారు. ఈకార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య నాయకులు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపిపిలు, మాజీ కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### భువనగిరిలో ఘనంగా జిల్లా స్థాయి ప్రపంచ ఆదివాసీ దినోత్సవం




**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, పగిడిపల్లిలో శనివారం జిల్లా స్థాయి ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించ బడ్డాయి. జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి టి.నాగి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్య క్రమానికి అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కర్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్ర మంలో ముఖ్య అతిథులుగా శంకర్ నాయక్, గణేష్ నాయక్, సంతోష్ నాయక్, మోహన్ బాబు రాజు నాయక్, రాజేష్ నాయక్, చిరంజీవి, సురేష్, భాస్కర్ నాయక్ పాల్గొని, గిరిజన సమాజ హక్కులు, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, యువతలో విద్య , నైపుణ్యాభివృద్ధి అవసరంపై పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ డిపార్ట్మెంట్ సిబ్బంది, వార్డెన్లు, హాస్టల్ సిబ్బంది, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ఈ దినోత్సవాన్ని విజయవంతం చేశారు.



## భారీ వర్షాలతో ఇబ్బందులు

**ప్రజాపక్షం/ఉండవెల్లి:** జోగులాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ నియోజకవర్గంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు వంకలు నుండి రవాణా సౌకర్యాలు రాకపోకలు నిలిచిపోయాయి. సమీప గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.అల్లంపూర్ నుంచి సింగవరం కి వెళ్లేందుకు పాపనస దగ్గర ఉన్న వాగు నుండి పొర్లి పారడంతో అక్కడ ప్రజలు అలంపూర్ రావడానికి వీల్లేకుండా పోయింది. రెండు రోజుల వరకు సమస్యగానే ఉంటుంది. మానపాడ్ నుంచి అమరవాయి వాగు. మెన్నిపాడు నుంచి కలుగొట్ల వాగు ఐజ నుంచి రాయచూర్ చౌరస్తా రావడానికి మధ్యలో మాన్దొడ్డి తుమ్మిళ్ళ వెళ్లే వాగు పొంగి ప్రవహిస్తుంది. పైనుంచి వరద నీళ్లు రావడంతో స్థానిక పంచాయతీ కార్యదర్శి విరేష్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది సహాయం చర్యలో భాగంగా రోడ్డును బ్లాక్ చేసి వరద ప్రభావం కి అడ్డంగా ఉన్న కంప చెట్లు తొలగించడం జరిగింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రభుత్వం స్పందించి వంతనాల్లో బ్రిడ్జ్ నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు నాయకులు కోరుతున్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలి

### మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజాసంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకువెళ్లాల్సిన బాధ్యత యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై ఉందని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో నాటి నుండి నేటి వరకు యూత్ కాంగ్రెస్‌కు పార్టీ అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణను కల్వకుంట్ల కుటుంబం ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్ల అప్పుల్లో నెట్టి ప్రజాధనాన్ని దోచుకుందని ఆరోపించారు. అనంతరం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ మాట్లాడుతూ మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి యూత్ కాంగ్రెస్‌తోనే రాజకీయాల్లో ఉన్నతస్థాయి పదవులను అలంకరించారని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్‌ల సలహాలు, సూచనలతో క్షేత్రస్థాయిలో తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం యూత్ కాంగ్రెస్ శక్తి వంచన లేకుండా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు అంజద్ అలీ, యూత్ కాంగ్రెస్ పార్లమెంట్ నియోజక వర్గ మాజీ అధ్యక్షులు కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు బైరు శైలేందర్, రాపర్తి శ్రీనివాస్, గండూరి రమేష్, అనంతుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.




## అడ్డదారుల్లో గెలవాలనే బిజెపి కుట్రలు

### ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్ర ఎన్నికల సంఘం బీహార్ రాష్ట్రంలో ఓట్ల తొలగింపు నిర్ణయాన్ని వ్యతిరేకించాలని, ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన ఆందోళనకు ప్రజాస్వామ్యవాదులు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అడ్డదారిలో ఎలా ఎన్నికలు గెలవాలని, ఎలా రాష్ట్ర ప్రభుత్వాలను కూలగొట్టాలనే ఆలోచన తప్పా బీజేపీ ప్రజా సంక్షేమం కోసం పనిచేయదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని తమకు అనుకూలంగా మార్చుకోని అడ్డదారిన ఓట్ల తొలగింపు కార్యక్రమం చేపట్టారని విమర్శించారు. ఎన్‌డీఏ కూటమికి ఓట్లు వేయని ముస్లీం, క్రిస్టియన్ మైనార్టీల ఓట్లను జాబితాను నుంచి తొలగించి అక్రమాలకు పాల్పడుతుందన్నారు. బీహార్ రాష్ట్రంలో 65లక్షల ఓట్లను తొలగించడం సరైందికాదన్నారు. మళ్లీ అధికారం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక అడ్డదారులు తొక్కుతుందని ప్రజలందరు గ్రహించి కేంద్ర ప్రభుత్వ, ఎన్నికల సంఘం చర్యలను వ్యతిరేకించాలన్నారు. బీసీ ప్రధానిగా రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఆమోదం తెలుపకపోవడం విచారకరమన్నారు. రిజర్వేషన్ విషయంలో బీఆర్‌ఎస్, బీజేపీలు రకరకాలుగా బురద పూస్తున్నారని, విమర్శలు మానుకోని మద్దతు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో కాకునూరి బసవయ్యగౌడ్, మాలి కాంతారెడ్డి, ముదిరెడ్డి నర్సిరెడ్డి, తలకొప్పుల సైదులు, మహబూబ్‌అలీ, బక్క రెడ్డి, చలపతిరావు, కోటేశ్వర్‌రావు, శ్రీనివాస్, లక్ష్మణ్‌గౌడ్, నెహ్రూ, నాగరాజు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి ముఠా అరెస్ట్




### రూ.2.5 లక్షల విలువ గల 9.800 కేజీల గంజాయి, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం

### మత్తు పదార్థాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తప్పవు సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్

**ప్రజాపక్షం/సూర్యాపేట :** విశాఖపట్నం నుండి జనగామ మీదుగా అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను నాగారం క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు పట్టుకున్నట్లు సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్ తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. కామారెడ్డి జిల్లా, పెద్దకొడపగల్ మండలం, పోచారం గ్రామానికి చెందిన ఏ1 పడవాల్ సుధార్, ఏ2 భర్దవాల్ శంకర్‌లు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని వారు విశాఖపట్నం వద్ద గల పాడేరుకు వెళ్ళి గతములో పరిచయం ఉన్న మహేష్ అనే వ్యక్తి వద్ద సుమారు 10 కేజీల గంజాయిని కిలో ఒక్కంటికి వెయ్యి రూపాయల చొప్పున కొనుగోలు చేసినట్లు తెలిపారు. పాడేరు నుండి సూర్యాపేట మీదుగా వారి స్వగ్రామం వెళ్ళుటకు జనగామ వైపు వెళ్తూ తిరుమలగిరిలో పోలీసు తనిఖీ ఉంటుందని భావించి తొర్రూర్ మీదుగా వెళ్ళుటకు తేది.08.08.2025 మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బస్సుదిగినట్లు వివరించారు. ఆ సమయంలో నాగారం ఎస్సై అయిలయ్య తన సిబ్బందితో అనుమానం వచ్చి వారిని తనిఖీ చేయగా వారి వద్ద గల 5 ప్యాకెట్స్‌ల నుండి 9.800కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అట్టి గంజాయి విలువ సుమారు 2,45,000 రూపాయలు ఉంటుందన్నారు. వారి నుండి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా అక్రమ మార్గంలో సంపాదించేందుకు గంజాయి లాంటి మత్తుపదార్థాలను అమ్మడం, కొనడం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో నాగారం సిఐ డి నాగేశ్వరరావు, ఎస్సై అయిలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

### అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్ హెచ్చరించారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా వ్యభిచారం, జూదం లాంటి అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలోని ఆర్వి హాస్పటల్ పక్కన శ్రీశ్రీనగర్‌లో కొందరు వ్యక్తులు నామ సైదులు అనే వ్యక్తి ఇంటిని స్థావరంగా చేసుకొని జూదం ఆడుతున్నట్లు పక్కా సమాచారంతో పోలీసులు దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. 8 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి 42వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎవరైనా బహిరంగంగా మద్యపానం చేసిన, జూదం, వ్యభిచారం, రాత్రి వేళల్లో ఆకతాయిల పట్ల పోలీసుల ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు.

## మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన యానాల దామోదర్ రెడ్డి

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూర్ మండల కేంద్రంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ చిన్నమ్మ తాళ్లపెల్లి నర్సమ్మ గుండెపోటుతో మృతి చెందగా యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి నర్సమ్మ మృతదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, కాంగ్రెస్ నాయకులు బోలగాని లక్ష్మీ నారాయణ, సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం, మండల సహాయ కార్యదర్శి ఆలేటి బాల రాజు, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు బీరకాయల మధు, కారుపోతుల సత్య నారాయణ, కుటుంబ సభ్యులు తాళ్లపల్లి వెంకటేశ్, కృష్ణ పాల్గొన్నారు.



# కార్యాలయ భవనానికి సోలార్ విద్యుత్ వినియోగిస్తున్నాం

### ప్రతిరోజూ 372 కిలోవాట్ల విద్యుత్ జనరేట్ అవుతుంది

### రాష్ట్ర ఉపముఖ్యమంత్రి సమావేశంలో కలెక్టర్ వెల్లడి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవనానికి సోలార్ విద్యుత్‌ను వినియోగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రికి వివరించారు. 2023 లోనే సూర్యాపేట ఐడిఓసి రూఫ్ టాప్‌పై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, దీని ద్వారా ప్రతిరోజు 372 కిలోవాట్ల విద్యుత్ జనరేట్ అవుతుందని తెలిపారు. ఈ విద్యుత్‌ను సమీకృత జిల్లా అధికారుల కార్యాలయంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగిస్తున్నామని, కార్యాలయాలకు అవసరమైన విద్యుత్ డిమాండ్‌ను తీర్చగలుగుతుందని వెల్లడించారు. రాష్ట్ర ఉపముఖ్య మంత్రి, ఇంధన, ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క మల్లు శనివారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను సోలారైజేషన్ చేయడంలో భాగంగా సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేసే విషయమై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల వారీగా మాట్లాడిన సందర్భంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ స్పందిస్తూ తాము ఐడిఓసి లో ఇది వరకే సోలార్ పవర్‌ను వాడుతున్నట్లు తెలియజేశారు. దీనిపై స్పందించిన డిప్యూటి సీఎం మాట్లాడుతూ ఇదివరకే సోలార్ సిస్టమ్ అమలు చేస్తున్న జిల్లాలు ఇందుకు సంబంధించి సోలార్ ప్యానల్స్ చిత్రాలను, పూర్తి వివరాలతో సమాచారాన్ని పంపించాలని సూచించారు. రాష్ట్రంలో పెద్దఎత్తున సోలారైజేషన్‌కు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాన్ని తీసుకోవడం జరిగిందని, ఇందులో భాగంగానే గ్రామ పంచాయితీ మొదలకొని సెక్రటేరియట్ వరకు అన్ని శాఖల ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు ఉపముఖ్యమంత్రి తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయా జిల్లాల వారీగా పూర్తి వివరాలను నిర్దేశించిన ప్రొఫార్మాలో పూర్తి చేసి ఈనెల 18లోగా పంపించాలని ఆదేశించారు. ముఖ్యంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీలు, అన్ని ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన సమాచారాన్ని పూర్తిస్థాయిలో పంపాలన్నారు. నల్లమల్ల డిక్లరేషన్‌లో భాగంగా రాష్ట్రంలో ఉన్న 6,70,000 ఎకరాల అటవీ భూములకు సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేందుకు నిర్ణయించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఇరిగేషన్ శాఖకు సంబంధించి అన్ని ఖాళీ భూముల వివరాలు పంపించాలన్నారు. ఉదాహరణకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు కెనాల్స్‌కు ఇరువైపులా వాహనాలు వెళ్లే విధంగా స్థలాన్ని వదలడం జరిగిందని, కిలోమీటర్ల మేర స్థలం అందుబాటులో ఉంటుందని, అందువల్ల ఈ స్థలాలలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసేందుకు పరిశీలించి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ విద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటు చేసేందుకు గాను వివరాలు పంపాలన్నారు. మండలంలో సుమారు 135 నుండి 140 వరకు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయని, వీటన్నిటిపై సర్వే నిర్వహించి పూర్తి సమాచారాన్ని పంపించాలని కోరారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, ఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్, రెడ్ కో, సింగరేణి ఎండి, విసిలు, తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## తెగిన తల, పలుచోట్ల శరీర భాగాలు

**బెంగళూరు:** ఒక మహిళను కర్నాటకలో దారుణంగా హత్య చేశారు. తలతో పాటు శరీర భాగాలను ముక్కలుగా నరికారు. ఆ ముక్కలను పలు ప్రాంతాల్లో పడేశారు. చేతి భాగాన్ని కుక్క లాక్కెళ్తుండగా స్థానికులు చూసి అవాక్కయ్యారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు పది ప్రాంతాల్లో పడేసిన శరీర భాగాలు సేకరించారు. కర్నాటకలోని తుమకూరు జిల్లాలో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఆగస్ట్ 7న చింపుగనహళ్లిలోని ముత్యాలమ్మ ఆలయం సమీపంలో చెట్లపొదల నుంచి తెగిన చేతిని కుక్క రోడ్డుపైకి లాక్కొచ్చింది. ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి ఉన్న మరో చేతిని కూడా స్థానికులు చూసి భయాందోళన చెందారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ వ్యవహారంపై పోలీసులు కేసు నమోదు చేసి... దర్యాప్తు చేపట్టారు.

# పటిష్ఠంగా భారత రక్షణ రంగం

### డిఆర్‌డిఒ చైర్మన్ సమీర్ కామత్



**పుణే:** రక్షణ రంగంలో భారత్ స్వావలంబనకు ఆపరేషన్ సిందూర్ ఒక నిదర్శనమని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) చైర్మన్ సమీర్ కామత్ వ్యాఖ్యానించారు. భారత వ్యూహాత్మక చర్యలు, స్వదేశీ సాంకేతిక బలాలు ఇప్పుడు ప్రపంచానికి తెలిశాయని ఇక్కడి డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ (డిఐఎటి) 14వ సదస్సులో పాల్గొన్న కామత్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను ఎంతో ప్రణాళికాబద్ధంగానూ, సమన్వయంతోనూ నిర్వహించిందని ప్రశంసించారు. భారత సైనిక పాటవం, సైనికుల ధైర్యసాహసాలు, రక్షణ వ్యవస్థ, సాంకేతికత ఆపరేషన్ సిందూర్‌తో రుజువయ్యాయని అన్నారు. అందుకే దీనిని కేవలం ఒక ప్రతికార దాడిగానో, సర్జికల్ స్ట్రయిక్‌గానో భావించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. భారత రక్షణ వ్యవస్థ అత్యంత పటిష్ఠంగా ఉందని, సరిహద్దులను రక్షించుకునే అపారమైన సామర్థ్యం మన సొంతమని మిగతా దేశాలకు చాటి చెప్పగలిగామని కామన్ అన్నారు. మన దేశంలోనే తయారు చేసిన సెన్సార్లు, మానవ రహిత ప్లాట్‌ఫామ్‌లు, సురక్షిత కమ్యునికేషన్ వ్యవస్థ, కృత్రిమ మేధస్సు (ఎఐ) ఆధారిత అనుబంధ వ్యవస్థలు ఈ ఆపరేషన్ సిందూర్‌లో కీలక భూమిక పోషించాయని అన్నారు. ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించే ఆకాశ్ క్షిపణులు, మధ్య శ్రేణి క్షిపణులు, బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణులు మన రక్షణ వ్యవస్థ ఎంత బలంగా ఉందనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని కామత్ చెప్పారు. అలాగే, డి4 యాంటీ డ్రోన్ వ్యవస్థ, ఎడబ్ల్యుఎస్‌సి వైమానిక ముందస్తు హెచ్చరిక వ్యవస్థ, నియంత్రణ వ్యవస్థ, కాకాశ్‌టీర్ వ్యవస్థ పనితీరు కూడా అద్భుతంగా ఉందన్నారు. వీటిని డిఆర్‌డిఒ అభివృద్ధి చేసిన విషయాన్ని కామత్ గుర్తుచేశారు. మన రక్షణ వ్యవస్థ పటిష్టంగా ఉందని ఆయన అన్నారు.

**గరిష్ఠ స్థాయికి రక్షణ రంగ ఉత్పత్తి**

భారత దేశ వార్షిక రక్షణ ఉత్పత్తులు 2024–25లో ఎన్నడూ లేనంతగా, రూ.1,50,590 కోట్లకు చేరుకుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే వీటి విలువ దాదాపు 18 శాతం వృద్ధి నమోదైందని అన్నారు. 2019–20లో కేవలం రూ.79,071 కోట్ల విలువైన రక్షణ రంగ ఉత్పత్తులు జరిగాయని గుర్తుచేశారు. ఇప్పుడు రక్షణ శాఖకు సంబంధించిన 90 శాతం ఉత్పత్తులు దేశీయంగానే జరుగుతున్నాయని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సంబంధిత అన్ని రంగాల సమష్టి కృషితోనే ఈ మైలురాయిని సాధించడం సాధ్యమైందని ఆయన వ్యాఖ్యానించారు.

## హఠాత్తుగా ఎందుకు నిలిపివేశారు?

### ఆపరేషన్ సిందూర్‌పై కాంగ్రెస్ ప్రశ్న



**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్‌ను హఠాత్తుగా ఎందుకు నిలిపివేశారని ప్రధాని నరేంద్ర మోదీని కాంగ్రెస్ ప్రశ్నించింది. పాకిస్తాన్‌కు చెందిన ఐదు యుద్ధవిమానాలుసహా మొత్తం ఆరు విమానాలను కూల్చివేసినట్టు భారత ఎయిర్ చీఫ్ మార్షల్ ఎపి సింగ్ చేసిన వ్యాఖ్యలపై 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ స్పందిస్తూ, భారత్‌ది పైచేయిగా ఉన్నప్పుడు, ఆపరేషన్ సిందూర్‌ను ఎవరి ఒత్తిడి మేరకు ఆపేశారో తెలపాల్సిన బాధ్యత ప్రధానిపై ఉందని అన్నారు. పాకిస్తాన్‌లో ఉగ్రవాద కేంద్రాలే లక్ష్యంగా చేపట్టిన ఈ దాడులు ఎంత వరకు ఫలితాన్నిచ్చాయో వివరించాలని డిమాండ్ చేశారు.

## ఒక్క విమానాన్ని కూడా కూల్చలేదు

### పాకిస్తాన్ రక్షణ మంత్రి ఆసిఫ్ స్పష్టీకరణ

**ఇస్లామాబాద్:** తమ దేశానికి చెందిన ఏ ఒక్క విమానాన్నీ భారత్ కూల్చలేదని పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ స్పష్టం చేశారు. కనీసం ఒక్క విమానం కూడా ధ్వంసం కాలేదని సోషల్ మీడియా పోస్టులో ఆసిఫ్ పేర్కొన్నారు. మొత్తం ఆరు పాకిస్తాన్ విమానాలను కూల్చివేశామని, వీటిలో ఐదు యుద్ధ విమానాలు ఉన్నాయని భారత చీఫ్ ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ చేసిన ప్రకటకు సమాధానంగా ఆసిఫ్ ఈ పోస్టు పెట్టారు. భారత్ దాడులకు సంబంధించిన పూర్తి వివరాలను, సాంకేతిక అంశాలతోసహా అంతర్జాతీయ మీడియాకు తాము అందించి మూడు నెలలు గడుస్తుంటే, ఇంతకాలం భారత్ ఎలాంటి ప్రకటన చేయలేదని ఆసిఫ్ గుర్తుచేశారు. ఇప్పుడు హఠాత్తుగా ఈ విషయాన్ని గురించి భారత చీఫ్ ఎయిర్ మార్షల్ ప్రకటన చేయడంలో అర్థం లేదని విమర్శించారు. ఒక స్వతంత్ర బృందం లేదా సంస్థ ద్వారా ఇరు దేశాల యుద్ధ విమానాల సంఖ్యను, జరిగిన నష్టాన్నీ దర్యాప్తు చేయిస్తే, నిజానిజాలు వెల్లడవుతాయని వ్యాఖ్యానించారు.

# ఆర్‌జి కర్ ఘటనపై బెంగాల్ వ్యాప్తంగా నిరసనలు

### మృతురాలి కుటుంబీకులు సహా 100 మందికి గాయాలు

### మమతా బెనర్జీ రాజీనామాకు డిమాండ్



**కోల్‌కతా:** కోల్‌కతా ఆర్‌జి కర్ వైద్యకళాశాల ఆసుపత్రిలో విధినిర్వహణలో ఉన్న పోస్టు గ్రాడ్యుయేషన్ ట్రైనీ వైద్యురాలు అత్యాచారం–హత్యకు గురై ఏడాది పూర్తయిన సందర్భంగా మరోసారి న్యాయం కోరుతూ పశ్చిమ బెంగాల్‌లో పలుచోట్ల ప్రదర్శనలు జరిగాయి. 'నంబన్నా చలో అభియాన్' పేరుతో కోల్‌కతాలో జరిగిన నిరసన ప్రదర్శనపై పోలీసు లాఠీచార్జి చేశారు. మృతురాలి తల్లి దండ్రులులతోపాటు బిజెపి నాయకులు గాయపడ్డారు. ఏడాది క్రితం ఆగస్టు తొమ్మిదో తేదీన ట్రైనీ వైద్యురాలి హత్యఘటన దేశాన్ని కుదిపేసింది. పోలీసులు తీవ్రమైన ఆంక్షలు విధించినప్పటికీ సెక్రటేరియట్‌కు, అసెంబ్లీకి వెళ్ళి న్యాయంకోసం నిలదీయాలని నిరసన ప్రదర్శకులు బ్యారికేడ్స్ దాటుకుని ముందుకు వెళ్ళడంతో పోలీసులు వారిపై విరుచుకుపడ్డారు. హౌరా, కోల్‌కతా అసెంబ్లీ పాయింట్ల వద్ద ప్రజలు భారీ ఎత్తున గుమిగూడారు. అనేకమంది పౌరులు, విద్యార్థులు, వైద్యులు, బిజెపి కార్యకర్తలు ప్రదర్శనలో పాల్గొన్నారు. బాధితురాలికి న్యాయం చేయలేని ముఖ్యమంత్రి మమతాబెనర్జీ తన పదవికి రాజీనామా చేయాలని ప్రదర్శకులు నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. జాతీయ జెండాలతో నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. మృతురాలి కుటుంబీకులు ముందుగానే హైకోర్టు అనుమతి తీసుకుని ఈ శాంతియుత ప్రదర్శనకు సన్నాహాలు చేశారు. దీంతో ప్రభుత్వం భారీ ఎత్తున పోలీసు బలగాలను మోహరించింది. పోలీసులు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడ్డారని, పోలీసులు తమకు ఏమాత్రం సహకరించలేదని మృతురాలి తల్లిదండ్రులు విమర్శించారు. బిజెపి కార్యకర్తలు కూడా పెద్దసంఖ్యలో ఆ పార్టీ పతాకాలు చేబూని ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. పోలీసు ఆంక్షలు ఉల్లంఘించి అసెంబ్లీ వైపు దూసుకువెళ్ళడంతో ప్రదర్శకులు లాఠీచార్జి జరిగింది. సచివాలయం వరకు తలపెట్టిన ఈ నిరసన ప్రదర్శనను పోలీసులు మధ్యలోనే భగ్నం చేశారు. సెంట్రల్ కోల్‌కతా పార్క్ స్ట్రీట్ చౌరాస్తా వద్ద మృతురాలి కుటుంబీకులతోపాటు జూనియర్ వైద్యులు వందలమందిపై పోలీసులు లాఠీచార్జి చేశారు. ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. అసెంబ్లీ ఉన్న రాణి రాష్మోణి రోడ్ వైపు వెళ్ళవద్దని పోలీసులు ఆంక్షలు విధించినప్పటికీ నిరసన ప్రదర్శకులు లెక్కచేయకుండా విద్యాసాగర్ సేతు (హూగ్లీ నదిపై రెండో వంతెన) మీదుగా దూసుకువెళ్ళేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిపై విరచుకుపడ్డారు.


బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారితోపాటు ఆయన ఇతర బిజెపి సహచర నాయకులు అగ్నిమిత్ర పాల్, ఇతర శాసనసభ్యులు పార్క్ స్ట్రీట్‌లో జవహర్‌లాల్ నెహ్రూ రోడ్ క్రాసింగ్ వద్ద బైఠాయించారు. మమతా బెనర్జీ రాజీనామా చేయాలని కోరారు. గత ఏడాది ఆర్జీకర్ ఆసుపత్రిలో అత్యాచారం–హత్యకు గురైన జూనియర్ డాక్టర్ తల్లిదండ్రులు కూడా పోలీసు లాఠీచార్జిలో గాయపడ్డారని సువేందు అధికారి చెప్పారు. పోలీసు లాఠీచార్జిలో దాదాపు 100 మందిపైగా గాయపడ్డారని ఆయన చెప్పారు. ఐతే పోలీసుల వాదన భిన్నంగా ఉంది. కోర్టు ఉత్తర్వులకు కట్టుబడి శాంతియుతంగా ప్రదర్శన చేయాలని పదే పదే లౌడ్ స్పీకర్లద్వారా హెచ్చరికలు చేసినప్పటికీ ప్రదర్శకులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి బ్యారికేడ్లను దాటుకుని ముందుకు వెళ్ళేందుకు ప్రయత్నించారని పోలీసు అధికారులు చెప్పారు. ఈ ప్రదర్శనకు ముందుగానే పోలీసులు బెంగాల్ సెక్రటేరియట్ వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు.

**మహిళలకు రక్షణ లేదు**

**మమత ప్రభుత్వం నేటికీ స్పందించలేదు**

మమతా బెనర్జీ పాలనలో మహిళలకు రక్షణలేకుండా పోయిందని ఆర్‌జి కర్ ఆసుపత్రిలో అత్యాచారం,హత్య ఘటన స్మృతుల నేపథ్యంలో సంబంధిత వర్గాలు విమర్శించాయి. ఈ ఘటన జరిగిన ఏడాది గడచినప్పటికీ ప్రభుత్వం ఈనాటికీ మహిళల రక్షణకు తగిన చర్యలు తీసుకోలేదని సోషల్ సైన్స్ రీసెర్చర్ రిమ్‌ఝిమ్ సిన్హా విమర్శించారు. గత ఏడాది జరిగిన ఘటనలో లక్షలమంది వీధుల్లోకి వచ్చి మహిళలకు న్యాయం కోరుతూ ప్రభుత్వాలను నిలదీశారు. ఈ ఉద్యమం ప్రారంభమయ్యేందుకు మొదట సిన్హాయే బీజాలు వేశారు. మమతాబెనర్జీ ప్రభుత్వం ఇచ్చినవాగ్దానాలన్నీ వట్టి డొల్ల అని ఆయన విమర్శించారు. గత ఏడాది ట్రైనీ వైద్యురాలి మరణం తర్వాత ఐదు రోజులకు ఆగస్టు 14న అర్ధరాత్రి లక్షలమంది ప్రజలు గంటల వ్యవధిలో స్వచ్ఛందంగా వీధుల్లోకి వచ్చారు. ఇందుకు సోషల్ మీడియా ఎంతగానో దోహదం చేసింది. ఈ కేసులో ఒక దోషికి శిక్ష పడినప్పటికీ అసలు దోషులు వేరుగా ఉన్నారని, ఇందులో రాజకీయ ప్రమేయం ఉందని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

# చిరాగ్ పాశ్వాన్ సరికొత్త ప్రచారం



**న్యూఢిల్లీ:** బీహార్‌లో లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) నాయకుడు, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్... తన 'చిరాగ్ కా చౌపాల్' ప్రచారాన్ని ప్రారంభించే అవకాశం ఉంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీ ఆయన నాయకత్వ ప్రమాణాలకు ఊతం ఇవ్వాలని చూస్తోంది. పార్టీ సభ్యులు, ఎంపీలు సహా సంస్థకు మద్దతు కూడగట్టడానికి వివిధ ప్రదేశాలలో ప్రజలతో సంభాషిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. బీజేపీ, జనతాదళ్ (యునైటెడ్) తర్వాత బీహార్‌లో ఎన్డీఏ మూడవ ప్రధాన భాగస్వామి అయిన ఎల్‌జేపీ (ఆర్‌వీ) ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ భాగస్వామ్యం తగ్గడాన్ని గ్రహించి... తన అవకాశాలను పెంచుకునేందుకు అనేక బహిరంగ సమావేశాలను నిర్వహించడంలో ఎన్డీఏలో మొదటి స్థానంలో ఉంది. జేడీ(యూ) అధ్యక్షుడు నితీశ్ కుమార్‌కు ఉన్న ఆరోగ్య సమస్యల కారణంగా పాలక కూటమి నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తున్నందున, పాశ్వాన్ చుట్టూ ఉన్న ప్రచారం పట్ల ఎన్డీఏ పెద్ద ఆసక్తిని కలిగి ఉందని కొంతమంది ఎల్‌జేపీ (ఆర్‌వీ) నాయకులు పేర్కొన్నారు. 'బీజేపీకి దృఢమైన సంస్థ ఉంది. జేడీ(యూ)కి సంస్థాగత లోపం ఉంది. కానీ నాయకుడు ఉన్నాడు. కానీ ఆయన చుట్టూ సందేహాలు పెరుగుతున్నాయి. ఎన్డీఏకి బలమైన సామాజిక కలయిక ఉంది. కానీ ప్రతిపక్ష కూటమి మరింత కేంద్రీకృతమై... దృష్టిసారించింది' అని ఎల్‌జేపీ (ఆర్‌వీ) నాయకుడు ఒకరు పేర్కొన్నారు. పాశ్వాన్ రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందారని, శాంతిభద్రతల పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర మంత్రి చేసిన వరుస వ్యాఖ్యలను ప్రజల మనోభావాలకు ప్రతిబింబంగా ఆయన సమర్థించారు. అయితే పాశ్వాన్ ఇటీవల సున్నిత వైఖరిని తీసుకున్నారు. అక్టోబరు నవంబరులో జరిగే ఎన్నికల్లో ఎన్డీఏ అధికారంలో ఉంటే నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. అయితే ఈ వ్యాఖ్యను తీవ్రమైన విమర్శల తర్వాత రాజకీయ సమతుల్యత చర్యగా పరిగణిస్తున్నారు. కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ, కేంద్ర మాజీ మంత్రి ఉపేంద్ర కుష్వాహా కూడా ఉన్న ఈ ఎన్డీఏ శిబిరంలో సీట్ల పంపకాల చర్చలు ఇంకా ప్రారంభం కాకపోవడంతో కొంతమంది కూటమి నాయకులు ఆయన ఇటీవలి కఠినమైన వ్యాఖ్యలను రాజకీయ వైఖరికి సంబంధించినవని పేర్కొన్నారు. పాశ్వాన్ సన్నిహితుడు, లోక్‌సభ ఎంపీ అరుణ్ భారతి ఇటీవల పీటీఐతో మాట్లాడుతూ శాంతిభద్రతలు వంటి కీలక అంశంపై తమ పార్టీ ప్రజల మనోభావాలను వినిపించాల్సి ఉందని అన్నారు. అయితే, తమ పార్టీ ఎన్డీఏ నుంచే పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. సీట్ల పంపకంపై 'ఫలవంతమైన చర్చ' జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పాశ్వాన్ నేతృత్వంలోని అవిభక్త ఎల్‌జేపీ 2020 అసెంబ్లీ ఎన్నికల సమయంలో నితీశ్‌తో విభేదాల కారణంగా బీహార్‌లో ఎన్డీఏ నుంచి బయటకు వచ్చింది. జేడీ(యూ) తమకు సీట్లు ఇవ్వడానికి నిరాకరించిందని ఆరోపించింది. ఆ తర్వాత ఎన్నికల్లో ఎల్‌జేపీ ఒక సీటు మాత్రమే గెలుచుకుంది. కానీ జేడీ(యూ) తీవ్ర నష్టాన్ని కలిగింది. ఇది 30 సీట్లకు పైగా ఓటమికి కీలక కారణంగా మారింది. అయితే ప్రస్తుతం ఈ రెండు పార్టీల మధ్య సంబంధం బాగానే ఉంది. కానీ జేడీ(యూ) సీనియర్ నాయకుడు ఇటీవల ఒక కీలక ఎల్‌జేపీ (ఆర్‌వీ) నాయకుడితో తన పార్టీతో కాకుండా బీజేపీతో సీట్ల పంపకం అంశం మాట్లాడుకోవాలని సూచించారు. ఎల్‌జేపీ (ఆర్‌వీ) బీజేపీ మిత్రపక్షమని, జేడీ(యూ) కు కాదని అన్నారు.

# 'న్యాయం'లో ఎపి టాప్ 2

### న్యాయ వ్యవస్థ, న్యాయసాయంలో ఐదో స్థానం

### ఇండియా జస్టిస్ రిపోర్ట్

**న్యూఢిల్లీ:** కోటికిపైగా జనాభా గల రాష్ట్రాలలో న్యాయం అందజేయడం సంబంధించి ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండవ స్థానంలో నిలిచింది. మొదటి స్థానం కర్నాటకకు దక్కింది. ఈ మేరకు ఇండియా జస్టిస్ రిపోర్ట్ (ఐజేఆర్)2025 పేర్కొంది. న్యాయం అందజేయడంలో 18 పెద్ద మధ్యస్థాయి రాష్ట్రాలో టాప్ 2లో కర్నాటక, ఏపీ ఉన్నాయి. న్యాయం అందజేయడంలో నాలుగు మూల స్తంభాలైన 'పోలీస్, న్యాయ వ్యవస్థ, జైళ్లు, న్యాయ సాయం'కు సంబంధించిన ప్రభుత్వ డేటా ఆధారిత గణాంకాలతో ఈ నివేదిక వెలువడింది. రాష్ట్రం నిర్దేశించే ప్రమాణాలు, లక్ష్యాల నేపథ్యంలో పోలీస్, న్యాయ వ్యవస్థ (జ్యుడిషియరీ), జైళ్లు (ప్రిజన్స్), న్యాయ సాయం (లీగల్ ఎయిడ్)'కు బడ్జెట్, మానవ వనరులు, పని భారం, వైవిధ్యత, మౌలిక వసతులు, కొత్త ధోరణులను ఐజేఆర్ అధ్యయనం చేసింది. పోలీస్ కింద ఆంధ్రప్రదేశ్‌కు రెండవ స్థానం దక్కింది. న్యాయ వ్యవస్థ, న్యాయం సాయం కింద ఐదో స్థానంలో ఉంది. ఖైదీలపై ఆంధ్రప్రదేశ్ అత్యధికంగా ఖర్చు చేస్తున్నట్లు ఐజేఆర్ పేర్కొంది. ఒక్కో ఖైదీ కోసం ఏటా రూ.2.6లక్షలు అంటే రోజుకు రూ.733 లెక్కన వ్యయం చేస్తున్నట్లు తెలిపింది. 7,200 మంది ఖైదీలు ఉన్నట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు తమ జైళ్లు కిక్కిరిసివుండటం గురించి రికార్డుల్లో పేర్కొనవని, 250 శాతం ఆక్యుపెన్సీని ఏ జైలు మించలేదని తెలిపింది. లీగల్ ఎయిడ్ (న్యాయ సాయం) కింద కేటాయించే బడ్జెట్‌లో 80 శాతానికిపైగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వినియోగిస్తున్నాయని, 2022–23లో 100 శాతం నిధుల వినియోగం నమోదు అయిందని నివేదిక వెల్లడించింది. ది నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) నిధులలో 89 శాతం వినియోగాన్ని ఏపీ నమోదు చేయగా, తెలంగాణ 61 శాతం వినియోగించినట్లు పేర్కొంది. ఇక లింగం, కుల ప్రాతినిధ్యం విషయానికొస్తే 2016 నుంచి ఎస్‌సీ వర్గీయులైన అధికారుల సంఖ్యలో 10 శాతం క్షీణత ఆంధ్రప్రదేశ్‌లో నమోదైంది. ఎస్‌టీ కానిస్టేబుల్ పోస్టుల్లో ఖాళీలు 2019లో ఆరు శాతంగా ఉంటే 2022లో 11 శాతానికి పెరిగాయి. జిల్లా కోర్టుల్లో 50 శాతానికిపైగా మహిళా ప్రాతినిధ్యం ఉన్నట్లు తెలుగు రాష్ట్రాలు నివేదించాయి. పోలీసుల్లో 22 శాతం మహిళలు ఉన్నారని, ఇది అత్యధికమని ఏపీ చెప్పుకుంటోంది. కానిస్టేబుల్ పోస్టుల్లో 21 శాతం ఖాళీలు ఉంటే, పోలీసు అధికారుల పోస్టుల్లో 10 శాతం ఉన్నట్లు రాష్ట్రం వెల్లడించింది. జిల్లా జడ్జిల స్థానాల్లో ఖాళీలు ఏపీలో కనిష్ఠంగా 2025లో 12 శాతం నమోదు అయినట్లు ఐజేఆర్ వెల్లడించింది. 2022 నుంచి హైకోర్టు జడ్జి పదవుల్లో ఖాళీలు 19శాతం పెరిగినట్లు పేర్కొంది. ఐజేఆర్ నివేదికపై రిటైర్డ్ జస్టిస్ మదన్ బి లోకుర్ స్పందిస్తూ ఇండియా జస్టిస్ రిపోర్ట్ నాల్గో సంచిక ప్రకారం దృష్టి పెట్టడం నుంచి వనరులు సమకూర్చడం వరకు పురోగతి అత్యల్పంగా ఉందని తెలుస్తోందని అన్నారు. న్యాయం పొందాల్సిన భారాన్ని వ్యక్తి మోస్తున్నాడే తప్ప రాష్ట్రం కాదని చెప్పారు. 2019లో మొదటిసారిగా టాటా ట్రస్ట్ ద్వారా ఐజేఆర్ తొలి నివేదిక వెలువడింది. సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్, కామన్ కాజ్, ది కామన్‌వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇనిషియేటివ్, ఇతరుల మధ్య సయోధ్యతో ఐజేఆర్ వెలువడుతుంది. 24 నెలల పరిమాణాత్మక పరిశోధన (క్వాంటిటేటివ్ రీసెర్చ్) ఆధారంగా తాజా నివేదిక విడుదల అయింది. 'భారత దేశం ప్రజాస్వామ్య, చట్టబద్ధమైన దేశంగా శతవసంతాలు జరుపుకునే దిశగా ముందుకు సాగుతున్న తరుణంలో సంస్కరించిన న్యాయ వ్యవస్థ ద్వారా హామీ ఇవ్వలేకపోతే న్యాయ పాలనసమాన హక్కుల వాగ్దానం డొల్లహామీగా ఉంటుంది' అని ఐజేఆర్ చీఫ్ ఎడిటర్ మాజా దారువాలా అభిప్రాయపడ్డారు. తక్షణ, వ్యవస్థీకృత సంస్కరణలు... ఖాళీల సత్వర భర్తీ... ప్రాతినిధ్యం పెంపుదల అత్యవసరమని ఐజేఆర్ నివేదిక నొక్కిచెబుతోంది. న్యాయం అందజేయడం అన్నది అత్యవసర సేవగా ఉండాలని సూచించింది.



# దేశాన్ని కంటతడి పెట్టిస్తున్న మోదీ

### నకిలీ ఓట్లపై ఖర్గే...

**న్యూఢిల్లీ:** నకిలీ ఓట్లతో ప్రధాని మోదీ దేశాన్ని కంటతడి పెట్టిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో విమర్శించారు. 2019 వరకు తనకు ఓటమి అంటే ఏమిటో తెలియదని చెప్పారు. కేవలం నకిలీ ఓట్ల వల్ల ఓడిపోయాను... ఆ మోసాలన్నీ ఇప్పుడు వెలుగులోకి వచ్చాయని వ్యాఖ్యానించారు. కర్నాటక లోక్‌సభ నియోజకవర్గం గుల్బర్గాలో ఓట్ల జాబితాల్లో మోసాల వల్ల తనకు పరాభవం తప్పలేదని ఖర్గే అన్నారు. ఎనిమిదికిగాను ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తన ప్రత్యర్థులు కనీసం 20వేల నకిలీ ఓట్లను పొందారని ఆరోపించారు. 1942, ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమాన్ని మహాత్మాగాంధీ చేపట్టారని గుర్తుచేస్తూ... అదే స్ఫూర్తితో చావోరేవో అన్నట్లుగా ప్రజాస్వామ్యం, ఎన్నికల సమగ్ర పరిరక్షణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా జరిగిన రోజు 'ఆగస్టు క్రాంతి దివస్'ను పురస్కరించుకొని ఖడ్గే శనివారం స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులర్పించారు. ఎక్స్ మాధ్యమంగా వారి తోడ్పాటు, త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నాయకత్వంలో క్విట్ ఇండియా ఉద్యమం సాగిందని, బ్రిటిష్ పరిపాలనకు వ్యతిరేకంగా అసంఖ్యాక మంది భారతీయులు ఏకతాటిపైకి వచ్చారని, స్వాతంత్ర్య సమరంలో ఈ ఉద్యమాన్ని కీలకంగా మార్చారని ఖడ్గే వెల్లడించారు. డూ ఆర్ డై (చావోరేవో) వంటి విలువకట్టలేని నినాదాన్ని నాడు గాంధీ ఇచ్చారని, ఈ నినాదం క్విట్ ఇండియా ఉద్యమానికి ఊపిరి పోసిందన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. 'ఆగస్టు క్రాంతి దివస్‌ను పురస్కరించుకొని స్వతంత్ర భారతదేశం కోసం తమ ప్రాణాలు త్యజించిన అమరవీరులకు హృదయపూర్వకంగా నివాళులు అర్పిస్తున్నా' అంటూ ఖర్గే పేర్కొన్నారు.

## జమ్మూకశ్మీర్‌లో ఎదురుకాల్పులు

### ఇద్దరు సైనికులు మృతి

**కుల్గాం:** ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం ప్రాంతంలో సైనిక ఆపరేషన్ కొనసాగుతోంది. శుక్రవారం అర్ధరాత్రి భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. దట్టమైన అటవీ ప్రాంతంలో ముగ్గురు ఉగ్రవాదులు రహస్య స్థావరాలు ఏర్పరుచుకొని ఉంటున్నట్లు నిఘా సమాచారం అందింది. దీంతో భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి కాల్పులు జరిపాయి. ఈ సందర్భంగా జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు సైనికులు లాన్స్‌నాయక్ ప్రీత్‌పాల్ సింగ్, సిపాయి హర్మిందర్‌సింగ్ మరణించారు. మరో ఇద్దరు సైనికులు గాయపడ్డారు. మతుల కుటుంబాలకు చినార్ కార్ప్స్ సానుభూతి తెలిపింది. ఆపరేషన్ కొనసాగుతోందని తెలిపింది. ఉగ్రవాదులు ఉన్నారన్న నిఘా సమాచారంతో ఆగస్టు 1న అఖల్ గ్రామ పరిసరాల్లో 'ఆపరేషన్ అఖాల్' పేరుతో భద్రతాధికారులు ఆపరేషన్ చేపట్టారు. ఇది తొమ్మిదో రోజుకు చేరుకుంది. ఈ ఆపరేషన్‌లో ఇప్పటికే కొంతమంది ఉగ్రవాదులను దళాలు మట్టుబెట్టాయి. పలువురు సైనికులు గాయపడ్డారు. ఆపరేషన్ నేపథ్యంలో ఈ ప్రాంతంలో తుపాకీ శబ్దాలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. దీంతో ఇక్కడి మహిళలు, చిన్నారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

## ఆంక్షల వేళ గర్భగుడిలోకి ప్రవేశం

### ఇద్దరు బిజెపి ఎంపిలపై కేసు



**రాంచి:** ఆంక్షలు ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా ఆలయంలోకి ప్రవేశించారనే ఆరోపణలతో బీజేపీ ఎంపీలు నిషికాంత్ దూబే, మనోజ్ తివారీపై కేసు నమోదైంది. ఆలయ పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... శ్రావణమాసం సందర్భంగా జార్ఖండ్ దేవ్‌గఢ్‌లోని బాబా వైద్యనాథ్ ఆలయానికి భక్తులు పెద్దఎత్తున హాజరవుతారు. దీంతో ఇక్కడ వీవీఐపీల ప్రవేశాలు నిలిపివేశారు. అయితే, ఈనెల 2న బీజేపీ ఎంపీలు నిషికాంత్ దూబె, మనోజ్ తివారీ దేవాలయానికి వెళ్లారు. భద్రతా సిబ్బంది అడ్డు చెప్పినప్పటికీ... లెక్కచేయకుండా గర్భగుడిలోకి ప్రవేశించి పూజలు చేశారు. దీనిపై ఆలయ పూజారి కార్తీక్‌నాథ్ ఠాకూర్ ఫిర్యాదు చేశారు. ఎంపీలు బలవంతంగా ప్రవేశించడమే కాక... భద్రతా సిబ్బందితో వాదనకు దిగినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో ఆలయంలోని భక్తులు భయాందోళనకు గురయ్యారని, తొక్కిసలాట వాతావరణం నెలకొందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇక, కేసు నమోదు విషయంపై నిషికాంత్ దూబే ఎక్స్ వేదికగా స్పందించారు. పూజలు చేసినందుకు తనపై కేసు నమోదు చేశారన్నారు. ఇప్పటివరకు 51 కేసులు నమోదయ్యాయని తెలిపారు. రేపు తాను అరెస్టు అయ్యేందుకు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళతానన్నారు.

## మోదీకి రాఖీ కట్టిన చిన్నారులు



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్రమోదీ రక్షా బంధన్ వేడుకలను విద్యార్థులు, ఆధ్యాత్మిక సంస్థ బ్రహ్మకుమారి సభ్యులతో కలిసి జరుపుకొన్నారు. ఢిల్లీలోని ప్రధాని నివాసంలో శనివారం ఉదయం 7 గంటల సమయంలో పలువురు విద్యార్థులు, బ్రహ్మకుమారి సభ్యులు మోదీకి రాఖీ కట్టారు. అనంతరం మోదీ వారితో కొంతసేపు సరదాగా ముచ్చటించారు. ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. గతేడాది కూడా ప్రధాని ఇలాగే స్కూల్ విద్యార్థినులతో రాఖీ కట్టించుకున్నారు. అంతకు ముందు రాఖీ పండుగను పురస్కరించుకొని దేశ ప్రజలకు మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. 'సోదర సోదరీమణుల మధ్య అపరిమిత ప్రేమకు ప్రతీక ఈ రక్షా బంధన్. ఈ పండుగ మీ బంధాలను మరింత తీపికరంగా చేయాలని, ఆప్యాయత, సామరస్య భావాలు బలోపేతం చేయాలని, ప్రజంతా ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు.

## 334 రాజకీయ పార్టీలపై ఈసీ వేటు

**న్యూఢిల్లీ:** దేశంలో రాజకీయ పార్టీల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం సవరించింది. గుర్తింపు పొందని 334 రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగించింది. నిబంధనల ప్రకారం ఈసీ వద్ద నమోదైన రాజకీయ పార్టీలు ఆరేళ్లలో కనీసం ఒక్క ఎన్నికలోనైనా పోటీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ పార్టీలు 2019 నుంచి ఒక్క ఎన్నికలోనూ బరిలోకి దిగకపోవడంతో వాటిపై ఈసీ వేటు వేసింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 334 పార్టీలను జాబితా నుంచి తొలగించినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. పేరుకు పార్టీలు పెట్టినప్పటికీ... వీటికి భౌతికంగా ఎలాంటి కార్యాలయాలు అందుబాటులో లేవని వెల్లడించింది. ఇప్పటివరకు దేశంలో 2,854 గుర్తింపుపొందని పార్టీలు ఈసీ వద్ద రిజిస్టర్ అయి ఉన్నాయి. తాజా చర్యతో ఆ సంఖ్య 2,520కి తగ్గింది. ఎన్నికల సంఘం వద్ద ఉన్న డేటా ప్రకారం... ప్రస్తుతం దేశంలో ఆరు జాతీయ పార్టీలుగా కొనసాగుతున్నాయి. 67 ప్రాంతీయ రాజకీయ పార్టీలు మనుగడలో ఉన్నాయి.



అవనిగడ్డ (ఆంధ్రప్రదేశ్)లోని గాంధీ క్షేత్రంలో దివంగత మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా 'పాటిరత్నాలు సప్తపదులు' సంకలన ఆవిష్కరణలో దేవినేని ఉమ, పితాని సత్యనారాయణ, గుమ్మడి గోపాలకృష్ణ, మండలి బుద్ధ ప్రసాద్, నరసం అరుణ, నూనె అంకమ రావు, ప్రముఖ రచయిత యువి రత్నం తదితరులు.




## సందడి చేస్తున్న మసాజ్ రోబోట్‌లు




అభివృద్ధి చెందిన చాలా దేశాల్లో మసాజ్ చేస్తున్న రోబోట్‌ల సందడి పెరుగుతున్నది. మసాజ్ సెంటర్లలో కృత్రిమ మేధస్సు (ఎఐ) ఆధారిత రోబోట్‌లకు డిమాండ్ పెరుగుతున్నది. ప్రత్యేకంగా తయారు చేసిన మసాజ్ కస్టమర్ తనకు సౌకర్యంగా ఉన్న విధంగా కూర్చోవచ్చు లేదా పడుకోవచ్చు. సాధారణంగా చాలా మంది మెడ, భుజాలు, నడుము నొప్పితో బాధపడుతుంటారు. అయితే, మసాజ్ సెంటర్లపై వస్తున్న వార్తలు, ఆ పేరుతో జరుగుతున్న అరాచకాలను గమనించి, వెళ్లడానికి జంకుతుంటారు. ప్రత్యేకించి మహిళలు సాధ్యమైనంత వరకూ ఈ మసాజ్ సెంటర్లకు దూరంగా ఉంటారు. అలాంటి వారికి ఈ మసాజ్ రోబోట్‌లు ఉత్తమ సేవలు అందిస్తాయి. ఈ రోబోట్‌లు ఆరోగ్య సంరక్షణ, ఫిజియోథెరపీ, స్పా, పర్సనల్ వెల్‌నెస్ రంగాలలో విస్తృతంగా వినియోగించబడుతున్నాయి. మసాజ్ రోబోట్ ఎఐ, మానవ అనుకరణ టెక్నాలజీని ఉపయోగిస్తుంది. మానవ చేతుల తాకిడి, ఒత్తిడిని అనుకరిస్తూ మసాజ్ చేస్తుంది. యూజర్ యొక్క శరీర ఆకారాన్ని, ఒత్తిడి ప్రాంతాలను గుర్తించి అనుగుణంగా స్పందిస్తుంది. 3డి బాడీ మ్యాపింగ్, ప్రెషర్ సెన్సింగ్, హీట్ డిటెక్షన్ ద్వారా ఖచ్చితంగా పని చేస్తుంది. పీడన తీవ్రతను, వేడి స్థాయిని, మసాజ్ విధానాన్ని యూజర్ తనకు అనుకూలంగా మార్చుకోవచ్చు. షియాట్సు, స్వీడిష్, టప్పింగ్, నీడింగ్, రోలింగ్ తదితర పద్ధతులలో మసాజ్ చేసే శక్తి ఈ రోబోట్‌లకు ఉంది. వాయిస్ ఆదేశాలతో లేదా స్మార్ట్‌ఫోన్ యాప్ ద్వారా రోబోట్‌ను ఉపయోగించవచ్చు. హోమ్ వెల్‌నెస్ సెంటర్లు, ఆసుపత్రులు, రికవరీ కేర్ యూనిట్లు, వృద్ధాప్య సంరక్షణ కేంద్రాలు, స్పోర్ట్స్ ఫిజియోథెరపీ సెంటర్లలో ఈ రోబోట్‌లను వాడవచ్చు. అందుకే, వీటికి డిమాండ్ క్రమంగా పెరుగుతున్నది.

## 'గిన్నిస్'లో వృద్ధ అల్పాకా




న్యూజిలాండ్‌కు చెందిన 'హథోర్న్‌డెన్ వైనుయ్' అనే అల్పాకా గిన్నిస్ పుస్తకంలో చోటు సంపాదించింది. గొర్రె, ఒంటె జాతులకు చెందిన ఈ జీవి సహజంగా 15 నుంచి 20 సంవత్సరాల వరకూ జీవిస్తుంది. కానీ, వైనుయ్ వయసు ఇప్పుడు 27 సంవత్సరాల, 212 రోజులు. ప్రపంచంలోనే అత్యంత వృద్ధ అల్పాకాగా రికార్డు నెలకొల్పింది. అరుదైన ఘనతను సొంతం చేసుకున్న ఈ వృద్ధ జీవిని చూసేందుకు సందర్శకులు క్యూలు కడుతున్నారు. 'లాంగ్ లివ్ వైనుయ్'.

## వింత శబ్దాల మర్మం ఏమిటో?



ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో పొద్దుపోయే వేళ లేదా తెల్లవారు జామున ఒక్కసారిగా భీకర శబ్దాలు వినిపించడం అందరినీ ఆశ్చర్యానిక గురి చేస్తున్నది. ఈ శబ్దాలు అమెరికా, యూరప్, ఆఫ్రికాతోపాటు, ఆసియా లోనూ కొన్ని ప్రాంతాల్లో నమోదయ్యాయి. టాకోమా (వాషింగ్టన్, అమెరికా), స్కైజిలాండ్ (యుకె), సాబాడెల్ (స్పెయిన్), బెంగాల్, మణిపూర్ (భారతదేశం) తదితర ప్రాంతాల్లో వినిపించిన ఈ శబ్దాలను కొన్ని ప్రాంతాల్లో 'స్కై ట్రంపెట్స్' అని, మరికొన్ని ప్రాంతాల్లో 'ది హమ్' అని పిలుస్తున్నారు. 'బాంగ్స్ ఫ్రమ్ హెవెన్', 'ఎర్త్ గ్రోనింగ్' వంటి పేర్లు కూడా ఉన్నాయి. ఈ శబ్దాలకు స్పష్టమైన కారణాలు ఇంకా తెలియకపోయినప్పటికీ, శాస్త్రవేత్తల అభిప్రాయాల ప్రకారం, మనకు వినిపించని అత్యల్ప శబ్ద తరంగాలు (ఇన్‌ఫ్రాసోనిక్ వేవ్స్) వాతావరణంలో ప్రయాణిస్తున్నప్పుడు, కొన్ని అవి మన చెవుల వినిపించే స్థాయిలో ఉండవచ్చు. ఇవి సముద్రాల నుంచి, బలమైన తుఫానుల నుంచి వస్తాయి. భూకంపాలు రావడానికి ముందు భూమి లోతుల్లో ఉండే పగుళ్లలో గాలి, వాయువు కదలిక వల్ల శబ్ద తరంగాలు వస్తాయి. ఇవి భూమి ఉపరితలానికి వచ్చేసరికి ధ్వని పేలుడు లా వినిపించొచ్చు. ఆకాశంలో ఒక్కసారిగా గాలి ఘనత మారినప్పుడు లేదా భీరకమైన శబ్ద తరంగాలు బలంగా వ్యాపించి, ఓ గంభీర ధ్వనిగా అవి మన చెవులకు చేరుతాయి. అమెరికన్ అకాడెమీ ఆఫ్ ఆడియాలజీ శాస్త్రవేత్తల అభిప్రాయాన్ని అనుసరించి, భూకంపాల మాదిరిగానే, ఆకాశంలో ప్రకంపనలు ఏర్పడతాయి. అవి అరుదుకావచ్చుగానీ, అసాధ్యం మాత్రం కాదు. గాలిలో వచ్చే మార్పులు లేదా అంతరిక్షం నుంచి వచ్చే శబ్ద ధ్వనులు కూడా ఆకాశ ప్రకంపనలకు కారణం కావచ్చు. గ్రహశకలాలు వాయుమండలంలోకి సూపర్‌సోనిక్ వేగంతో ప్రవేశించడం వల్ల షాక్‌వేవ్స్ తయారై, భారీ శబ్దాలు సృష్టించే అవకాశం లేకపోలేదు. ఇలావుంటే, కొంత మంది శాస్త్రవేత్తలు ఈ శబ్దాలను చెవుల నుంచి వచ్చే 'ఆటోయాకస్టిక్ ఎమిషన్'గా పేర్కొంటున్నారు. అయితే, ఈ వాదన ఇంకా ధ్రువపడలేదు. మూఢ నమ్మకాలతో, దేవతలు ఆగ్రహించడం వల్ల వచ్చే శబ్దాలుగా అనుకోకూడదని, ఇది ముమ్మాటికీ శాస్త్ర సంబంధమైన అంశమేనని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. ఎన్నో మిస్టరీలు తొలుత ఆశ్చర్యం కలిగించినప్పటికీ, తర్వాతి కాలంలో వాటి మూలాలను శాస్త్రవేత్తలు ఛేదించగలిగారు. అదే విధంగా ఈ శబ్దాలపైనా స్పష్టత వచ్చే రోజు ఎంతో దూరంలో లేదని ఆశిద్దాం.

## 'మృగరాజు'కు కష్టాలు



పర్యావరణ కష్టాలు, ప్రత్యేకించి అడవుల నరికివేత కారణంగా వచ్చిన పడుతున్న సమస్యలు చివరికి మృగరాజులకు కూడా తప్పడం లేదు. సింహాల సంఖ్య గణనీయంగా తగ్గిపోతున్నదని అంతర్జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దాదాపు 10 నుంచి 14 ఏండ్లు జీవించగలిగిన సింహాల జనాభా ప్రపంచవ్యాప్తంగా క్రమంగా తగ్గడం ఫలితంగా అంతరించే ప్రమాదం ఉన్న జంతువుల జాబితాలో సింహం కూడా చేరనుందనే వార్త విచారకరం. ప్రపంచవ్యాప్తంగా సింహాల జనాభా 20,000 నుంచి 35,000 వరకు ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2001 నుంచి నేటి వరకు ఆఫ్రికన్ సింహాల జనాభా 43 శాతం వరకు పడిపోవడం గమనించారు. అయితే, భారత ప్రభుత్వ చొరవతో ఇండియాలో కనిపించే ఏసియాటిక్ సింహాల జనాభా క్రమంగా పెరుగుతూ నేడు 891 వరకు చేరింది. ఇది సంతోషించాల్సిన విషయమే అయినప్పటికీ, ప్రపంచ వ్యాప్తంగా సింహాల సంఖ్య తగ్గడం ఆందోళన కలిగించే విషయం. సింహాల జనాభా క్రమంగా తగ్గడానికి కారణాలుగా అడవుల నరికివేత లేదా సింహాల ఆవాసాలు కుచించుకుపోవడం, అవసర ఆహారం దొరక్కపోవడం, ప్రతికూల వాతావరణ మార్పులు, మానవులు వన్యప్రాణుల మధ్య ఘర్షణ, మానవ అక్రమ వేట, పౌర సమాజ అవగాహన రాహిత్యం లాంటి అంశాలను గుర్తించారు. ప్రపంచ సింహాల దినం వేదికగా ఈ అంశాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వాలు ప్రత్యేక సింహాల అభయారణ్యాలను ఏర్పాటు చేసి సింహ జాతిని రక్షించడానికి సత్వర చర్యలు తీసుకోవడం అనివార్యం. సింహాల ఆవాసాలను కాపాడడం, అక్రమ వేటలను కట్టడిచేయడం, ప్రజలకు అవగాహన కలిపించడం, సింహాల అభయారణ్యాలను నిర్వహించడం, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం, సుస్థిర పర్యాటకం, సింహాల రక్షణకు అవసరమైన నిధులను విరాళాల రూపంలో జంతు ప్రియుల నుంచి సేకరించడం లాంటి చర్యలు తీసుకోవడం నిరంతరం జరగాలి. గంభీరంగా ఉండే సింహాల జనాభా కాపాడుకోవడానికి ప్రతినబూనని యెడల రానున్న రోజుల్లో సింహాలు అంతరించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

— బిఎస్ఎస్ మైత్రేయి

# అణ్వస్త్రాల రద్దుకై ఉద్యమించుదాం!

ప్రపంచం నుంచి అణ్వాయుధాలను నిర్మూలించాల్సిన తరుణం ఆసన్నమైంది. అణ్వస్త్ర రాజ్యాలేవీ తమ అణ్వస్త్ర ఆయుధాగారాలను తగ్గించుకోకపోగా, కొత్త రాజ్యాలు ఆ జాబితాలో చేరాయి. ప్రస్తుతం వాటి సంఖ్య 9. అవి అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా, ఉత్తరకొరియా, భారత్, పాకిస్తాన్, ఇజ్రాయెల్. ఇరాన్ ఆ దారిలో ఉందని ఆరోపణకు గురవుతున్నది. ప్రపంచ యుద్ధాలేవి అక్కర్లేదు, ప్రాంతీయ యుద్ధాలు సైతం అణ్వస్త్ర ప్రయోగానికి, సర్వ వినాశనానికి దారి తీయవచ్చు. 1945 ఆగస్టులో అణుబాంబుల విధ్వంసానికి గురైన హిరోషిమా, నాగసాకి శిథిల క్షేత్రాలను నెల రోజుల తర్వాత సెప్టెంబర్ 8న తొలిసారి సందర్శించిన అంతర్జాతీయ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ మార్సెల్ జునోద్, తొలి ప్రపంచ యుద్ధం తరువాత విషపు గ్యాస్‌ను నిషేధించినట్లే ఆటంబాంబును తక్షణం నిషేధించాలని విజ్ఞప్తి చేశాడు. అది అరణ్య రోదన గానే మిగిలిపోయింది.

అణ్వాయుధాలు భూగోళానికి ఎంత విపత్కరమో, విధ్వంసకారకమో ఈనాడు ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ తెలుసు. 1945 ఆగస్టు 6న జపాన్‌లోని హిరోషిమాపై, 9న నాగసాకిపై అమెరికన్ సామ్రాజ్యవాదులు వేసిన అణుబాంబులతో అణ్వస్త్ర యుగం ప్రారంభమైంది. ఆ బాంబు ప్రయోగాల తక్షణ వినాశం రెండు లక్షల మంది పౌరుల ఆకస్మిక భస్మీపటలం. గాయపడిన, అనాథలైన, ఇల్లు వాకిలి కోల్పోయిన బాధితుల సంఖ్య అంతకు రెట్టింపు. మానవాళి పట్ల అమెరికా మహానేరం చేసి 80 ఏళ్ళు గడిచిపోయినా మానవ పునరుత్పత్తిపై, జీవనంపై, పర్యావరణంపై ఆ అణుధార్మికత దుష్ప్రభావం నేటికీ కొనసాగుతూనే ఉంది.

అమెరికా ఎందుకు ఈ ఘోరానికి పాల్పడిందో ఇప్పటికీ పూర్తి స్పష్టత లేదు. జర్మనీ పీచమణచటానికి ఆటంబాంబును అభివృద్ధి చేశారని చెప్పబడుతున్నది. అయితే అది సిద్ధం అయ్యేలోపు రెండవ ప్రపంచ యుద్ధం ముగింపుకు వచ్చింది. హిట్లర్ వాతుడైనాడు. 1945 మే నెల లోనే సోవియట్ యూనియన్, బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్‌తో కూడిన మిత్రరాజ్య కూటమి నలు దిశల నుంచి బెర్లిన్ నగరాన్ని ఆక్రమించాయి. జర్మన్ సైన్యాల లొంగుబాటు జరిగింది. ఈ బాంబు అమెరికా చేతిలో భద్రంగా ఉంటే సోవియట్ యూనియన్‌ను నిరోధించవచ్చని, ప్రపంచాధిపత్యానికి తిరుగుండదని నిపుణులు అధ్యక్షునికి చెప్పారట. అయితే దాన్ని ప్రయోగించి ప్రేలు డు సామర్థ్యాన్ని పరీక్షించేందుకు జపాన్‌పై ప్రయోగించారు. ఈ చర్య ఇతర దేశాలు తమ సొంత అణుబాంబులు అభివృద్ధి చేసుకునేందుకు ప్రో త్సాహకమైంది. సోవియట్ యూనియన్ నాలుగేళ్లలోనే తమ బాంబును పరీక్షించింది. దాంతో ఉత్తరకొరియాపై బాంబులు వేసే ఆలోచనను అమెరికా విరమించుకుంది. ఆ తర్వాత కాలంలో బ్రిటన్, ఫ్రాన్స్, చైనా తదితర దేశాలు తమ బాంబులు అభివృద్ధి చేసుకున్నాయి. అణుశక్తి ప్రేలుడు సామర్థ్యాన్ని ఎన్నో రెట్లు పెంచుకున్నాయి. అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా భద్రతా మండలిలో వీటో హక్కు కలిగిన శాశ్వత సభ్యత్వ దేశాలుగా ఐరాస ఆమోదం పొందడంతో అవి వాటి ఆకాంక్షలకు పరస్పర నిరోధకంగా పనిచేశాయి. సామ్రాజ్యవాదుల విస్తరణ ఆకాంక్షలు నియంత్రించబడ్డాయి.

ప్రజాపక్షం
10-08-2025, ఆదివారం

ఇదిలా ఉండగా, అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకు అనగా అణుశక్తి విద్యుత్ రియాక్టర్లు, శాస్త్ర – సాంకేతిక అవసరాలు వగైరాలకు అభివృద్ధి చేసుకోవచ్చనే క్లాజును ఉపయోగించుకుని భారత్, పాకిస్తాన్ అణ్వస్త్ర రాజ్యాలుగా మారాయి. అమెరికా అండతో ఇజ్రాయెల్ గోప్యంగా అణుపాటవ శక్తిని సంతరించుకుంది. ఇరాన్ అదే బాటలో ఉంది. ఉత్తరకొరియా మీద కూడా అటువంటి ఆరోపణలున్నాయి.

1960 దశకంలో క్యూబా సంక్షోభం సందర్భంలో అమెరికా, సోవియట్ యూనియన్ తలపడడంతో ప్రపంచం తొలిసారి అణుయుద్ధం అంచుకు వెళ్ళింది. క్యూబా నుంచి యుఎస్ఎస్ఆర్ అణు క్షిపణులు ఉపసంహరించుకోవడంతో ఆ సంక్షోభం ముగిసింది. ప్రపంచం ఊపిరి పీల్చుకుంది. ఆ కాలంలో అణ్వస్త్ర రాజ్యాలు విజ్ఞత ప్రదర్శించడం వల్లనే కాదు, 1980వ దశకంలో ప్రపంచవ్యాప్తంగా శాంతి ఉద్యమం బలంగా అణ్వస్త్ర వ్యతిరేక ఉద్యమాలు నిర్మించడం వల్ల కూడా అణు సంఘర్షణలు నివారించబడ్డాయి. అణుక్షిపణులు, అణు శీర్షాల సంఖ్యను తగ్గించుకోవడం, భూగర్భంలో, సముద్రంలో అణుపరీక్షలపై నిషేధం, వ్యూహాత్మక ఆయుధాల పరిమితి ఒప్పందం (స్టార్ట్) వంటివి ప్రధానంగా అమెరికా, సోవియట్ యూనియన్ మధ్య జరిగాయి. అయితే ఇటీవల ముందుగా అమెరికా, కొద్దిరోజుల క్రితం రష్యా స్టార్ట్ ఒప్పందం నుంచి వైదొలిగాయి. ఇరాన్ అణు కార్యక్రమం ధ్వంసం చేయడానికే ఇజ్రాయెల్, అమెరికాలు ఇటీవల ఇరాన్ అణుపరీక్ష వసతులపై దాడులు చేశాయి. టెర్రరిజం పేరుతో తరచూ కీచులాడుకుంటున్న భారత్, పాకిస్తాన్ రెండూ అణ్వస్త్ర రాజ్యాలు. ఆపరేషన్ సిందూర్ మరికొన్ని రోజులు కొనసాగి ఉంటే యుద్ధం ఏ రూపం తీసుకునేదో! ఉక్రేన్–రష్యా యుద్ధంలో ఉక్రేన్ కొమ్ముగాస్తున్న యూరప్ రాజ్యాల్లో అణ్వస్త్ర రాజ్యాలున్నాయి. ఎక్కడ ఏ ప్రభుత్వాధినేత తప్పుడు అభిప్రాయంతో, అంచనాతో తొందరపాటు ప్రదర్శిస్తే అణువిలయమే. అందువల్ల అణ్వాయుధ నిషేధానికై మరోమారు పెద్దఎత్తున శాంతి ఉద్యమం–అనగా ప్రజల నుంచి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడమే ప్రపంచ శాంతికి రక్ష!

## సిపిఐ జోక్యంతో కదులుతున్న డొంక

# వెలుగులోకి ధర్మస్థలి భయంకర రహస్యాలు

వివేక్ శర్మ

భారతదేశమంతటా ప్రసిద్ధి చెందిన మంజునాథ స్వామి ఆలయం ఉన్న ధర్మస్థల ఆలయ పట్టణం ఇప్పుడు ఒక భయంకరమైన విచారణ నీడలో ఉంది. దశాబ్దాలుగా అపహరణలు, లైంగిక వేధింపులు, పట్టణం చుట్టుపక్కల అడవులు, కొండల్లో రహస్యంగా పూడ్చిపెట్టిన ఘటనల గురించి కనిపించకుండా పోయిన మహిళలు, మైనర్ల, విజిల్‌బ్లోయర్‌లు, పౌర సమాజ కార్యకర్తల కుటుంబాలు గుసగుసలాడుకునేవారు. స్థానిక అధికారులు ఈ ఆరోపణలను పట్టించుకోలేదు. వరుస ప్రభుత్వాలు కూడా వీటిని గమనించకుండా వదిలేశాయి. దీంతో కర్ణాటకలో అత్యంత దారుణమైన విషాదాల్లో ఒకటి రహస్యాల పొరల్లో అదృశ్యమై, కనిపించకుండా, తెలియకుండా పోయింది.

నాటి ఆలయ పారిశుద్ధ్య కార్మికుడు ఇచ్చిన వాంగ్మూలంతో నిశ్శబ్దం బద్దలవడం మొదలైంది. 1995 నుంచి 2014 మధ్య వందకు పైగా మృతదేహాలను పూడ్చిపెట్టడానికి తనను బలవంతం చేశారని, వారిలో చాలామంది లైంగిక నేరాలకు బలైన బాధితులేనని ఆయన సాక్ష్యం ఇచ్చాడు.1979లో ఉపాధ్యాయురాలు వేదవల్లిని సజీవదహనం చేసిన కేసు, 1986లో పద్మలత మరణం, 2012లో 17 ఏళ్ల సౌజన్యపై జరిగిన అత్యాచారం, హత్య వంటి దశాబ్దాల తరబడి పరిష్కారం కాని కేసులతో అతని వాంగ్మూలానికి సంబంధం ఉంది. ధర్మస్థల ప్రశాంతమైన ప్రతిష్ట వెనుక బాధితుల వ్యవస్థీకృత అణచివేత చరిత్ర ఉందని బయటపెట్టింది.

దశాబ్దాల సుదీర్ఘ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా సిపిఐ నిర్ణయాత్మకంగా జోక్యం చేసుకుంది. వరుస నేరాలు, వాటిని విచారించడంలో సంస్థాగత వైఫల్యంపై నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) చేత దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు జూలై 19న సిపిఐ ఎంపి పి. సందోష్ కుమార్ లేఖ రాశారు. ఆ లేఖలో దిగ్భ్రాంతికరమైన సాక్షి వాంగ్మూలం, అంతుచిక్కని అదృశ్యాల చరిత్ర, చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర అధికారులు పదేపదే తిరస్కరించడం వంటి విషయాలను వివరంగా పేర్కొన్నారు. 'ధర్మస్థల ఆధ్యాత్మిక పవిత్రతను కాపాడాలి. కేవలం ఆచారం లేదా పైకి కనిపించే విధంగా కాకుండా నిజం, న్యాయం, పారదర్శకతతో కూడి




ఉండాలి. భారతదేశం అంతటా భక్తులు పూజించే ఒక పవిత్ర పట్టణం భయం, అనుమానం, పూడ్చిపెట్టిన సత్యాల నీడలో ఉండకూడదు. ప్రజా ప్రతినిధులుగా బాధితులకు, దేశానికి, ధర్మస్థల వారసత్వానికి నష్టం వాటిల్లకుండా భయం , పక్షపాతం లేకుండా సత్యాన్ని బయట పెట్టాలి' అని పి. సందోష్ కుమార్ నొక్కి చెప్పారు.

ఈ లేఖతో సిపిఐ ఆగిపోలేదు. సిపిఐ జిల్లా, రాష్ట్ర ప్రజా సంఘాలు వెంటనే క్షేత్ర స్థాయిలో ప్రచారాన్ని బలోపేతం చేశాయి. ఎంపి విజ్ఞప్తి తర్వాత, సిపిఐ కర్ణాటక రాష్ట్ర కార్యదర్శి సత్తిసుందరేశ్ మార్గదర్శకత్వంలో ధర్మస్థల పరిధిలోకి వచ్చే దక్షిణ కన్నడ సిపిఐ జిల్లా సదస్సు పూర్తిస్థాయి విచారణ కోరుతూ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. ఇది స్థానికులకు విశ్వాసాన్ని కల్పించింది. విచారణను డిమాండ్ చేయడానికి విజిల్ బ్లోయర్లకు ధైర్యం ఇచ్చింది. పెరుగుతున్న ఆధారాలు, ప్రజా ఆగ్రహం ఉన్నప్పటికీ, సిపిఐ జోక్యానికి ఒక రోజు ముందు కర్ణాటక హోంమంత్రి జి. పరమేశ్వర ఆరోపణలు అతిశయోక్తులని చెబుతూ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) డిమాండ్‌ను తిరస్కరించారు. అయితే, సిపిఐ పార్లమెంటరీ చర్యకి తోడు జిల్లా స్థాయి చర్య, సామాజిక మాధ్యమాల్లో దూకుడుగా సాగిన ప్రచారం కార్యకర్తలు, ఆర్‌టిఐ పిటిషనర్లు, యూట్యూబర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని వెనక్కి తగ్గేలా చేశారు. ఎంపి లేఖ అందిన 24 గంటల్లోనే ప్రభుత్వం సంవత్సరాలుగా ప్రతిఘటించిన సిట్‌ను ప్రకటించింది.


దశాబ్దాల నిరాకరణ తర్వాత సిట్ పని ప్రారంభమై, మొదటి భౌతిక ఆధారాలను వెలికితీసింది. ప్రారంభ తవ్వకాలలో, నేత్రావతి నదికి సమీపంలోని సైట్ 6లో నాలుగు అడుగుల లోతులో సుమారు పదిహేను ఎముకల శకలాలు, ఒక పాన్ కార్డ్, ఒక డెబిట్ కార్డ్, దుస్తుల పేలికలు లభించాయి. బైటపడిన ఆధారాలు చాలా కాలంగా అణచివేయబడిన ఆరోపణలకు నిజంగా ఆధారం ఉందని మొదటి స్పష్టమైన సంకేతాలు ఇచ్చాయి. బంగ్లెగుడ్డె కొండపై అదనంగా అస్థిపంజర అవశేషాలు లభించినట్లు మీడియా కథనాలు సూచించాయి. అయితే అధికారిక నిర్ధారణ ఇంకా జరగలేదు. ఇప్పుడు డిఎన్ఎ పరీక్షలు జరుగుతున్నాయి. పట్టణం చుట్టూ ఉన్న దట్టమైన అడవులు, కొండల్లో మరిన్ని పూడ్చిపెట్టిన ప్రదేశాలను గుర్తించడానికి భూమిలో చొచ్చుకుపోయే రాడర్‌ను ఉపయోగించాలని కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. సిపిఐకి, ముందుగా బైటపడిన ఆధారాలు కుటుంబాలు, ఉద్యమకారులకు ఎప్పటి నుంచో తెలిసిన విషయాన్ని ధృవీకరించాయి. ధర్మస్థల భూమిలో ప్రభుత్వం అంగీకరించడానికి సిద్ధంగా ఉన్న దానికంటే ఎక్కువే ఉంది. సిట్‌పై విశ్వాసం పరిమితంగానే ఉంది. దశాబ్దాలుగా బాధితులను పట్టించుకోకుండా, ఆధారాలను అణచివేసిన అదే స్థానిక యంత్రాంగం న్యాయానికి చివరి నిర్ణేతగా ఉండ జాలదని సిపిఐ బలంగా చెప్పింది. పూర్తి స్థాయిలో నేరాలను వెలికితీసేందుకు, ఎంతటి ప్రభావం కలిగిన వారైనా సరే బాధ్యులను చట్టం ముందు నిలబెట్టడానికి ఒక తటస్థ, జాతీయ స్థాయి, కోర్టు పర్యవేక్షణలో ఉండే ఎన్ఐఎ విచారణ అవసరం.

ఈ విషాదం మొదటి వెలికితీతలలో కనిపించిన దాని కంటే పెద్దదిగా ఉండవచ్చు. కనిపించకుండా పోయిన కుమార్తెలు, ఇంటికి తిరిగి రాని విద్యార్థులు, 'అసాధారణ మరణాలు'గా త్వరగా ముగించిన కేసుల గురించి కుటుంబాలు చాలా కాలంగా మాట్లాడుతున్నాయి. విజిల్‌బ్లోయర్లు నిశ్శబ్దాన్ని ఛేదించడానికి తమ ప్రాణాలను పణంగా పెట్టారు. ఆర్‌టిఐ కార్యకర్తలు వేధింపులను ఎదుర్కొన్నారు. స్థానిక పాత్రికేయులను పదేపదే బెదిరించారు. చివరకు భౌతిక ఆధారాలు వెలికిరావడం అనేది పరిపాలనా సద్భావనకు ఫలితం కాదు, సామూహిక పోరాటానికి ఫలితం. ధర్మస్థలలో బైటపడింది ఒక స్థానిక సమస్య కాదు; అవి కర్ణాటక, దేశం అంతరాత్మకు ఒక పరీక్ష. ఇన్ని కుటుంబాలను ఎలా నోరు మూయించగలిగారు? ఆధ్యాత్మిక పవిత్రతకు పేరుగాంచిన చోట ఇంతటి వ్యవస్థాగత నిర్లక్ష్యం ఎలా వృద్ధి చెందింది? సిపిఐకి సంబంధించినంత వరకు సత్యాన్ని బయటపెట్టడం, చివరకు న్యాయం అందించడం కోసమే ఈ పోరాటం. సిట్ ఈ విషయాన్ని పరిశీలిస్తున్నప్పటికీ, ఎన్ఐఎ దర్యాప్తును చేపట్టాలని, స్వతంత్రతను పూచీ ఇచ్చేందుకు కోర్టులు, కార్యకర్తలచే ఈ ప్రక్రియ పర్యవేక్షించబడాలని సిపిఐ ఇప్పటికీ నొక్కి చెబుతోంది. ఈ రోజు అస్థిపంజర శకలాలు తవ్వి తీయబడుతున్నాయి. ఫోరెన్సిక్ విశ్లేషణలు ప్రారంభమవుతున్నాయి. సిపిఐ, పౌర సమాజం, బాధితుల కుటుంబాలు నిర్వహించిన ప్రచారం ధర్మస్థలలో పూడ్చిపెట్టిన సత్యాలు ఇకపై గుసగుసలుగా కాకుండా, బలమైన ఆధారాలుగా మారుతున్నాయి. సిపిఐకి ముం దుకు వెళ్లాల్సిన మార్గం స్పష్టంగా ఉంది: ప్రతి బాధితుడికి న్యాయం, ప్రతి నేరస్తుడిని బయటపెట్టడం, నిశ్శబ్దం, అణచివేత ద్వారా కాకుండా నిజం, పారదర్శకత ద్వారా ధర్మస్థల గౌరవాన్ని పునరుద్ధరించడం.





# బిఆర్ఎస్‌పై బిజెపి కన్ను




భారత రాష్ట్ర సమితి అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఆ పార్టీ నాయకులు, క్యాడర్‌పై బిజెపి దృష్టి సారిస్తున్నట్లు ఇటీవల పరిణామాలు సూచిస్తున్నాయి. ఇప్పటికే కవిత వ్యవహారం, కెసిఆర్‌ను తప్పుబడుతూ కాళేశ్వరంపై జస్టిస్ పి.సి.ఘోష్ ఇచ్చిన నివేదికతో తలపట్టుకుంటున్న గులాబీ పార్టీకి, తాజాగా ఫోన్ ట్యాపింగ్ కేసు కూడా ఇబ్బందులు సృష్టిస్తోంది. రెండు రోజుల క్రితం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ విచారించింది. గతంలో ఆయన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్న సమయంలో బిఆర్ఎస్ సర్కార్ ఫోన్ ట్యాపింగ్ పాల్పడినట్లు వెల్లడైంది. అందులో భాగంగా బండి సంజయ్ విచారణ సందర్భంగా, గతంలో ఆయనతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బిజెపి కీలక నేతలు మాట్లాడిన సందర్భాలలో కూడా ఫోన్‌ను ఎస్ఐబి ఆధ్వర్యంలో ట్యాప్ చేసినట్లు ఆయన నిర్ధారణ చేశారు. ఇది తీవ్రమైన అంశమే. ఎందుకంటే, బిఆర్ఎస్ నలుగురు ఎమ్మెల్యేలను బిజెపిలో చేర్చుకునే వ్యవహారంలో నాటి బిజెపి ప్రధాన కార్యదర్శి బి.ఎల్.సంతోష్ పేరు, ఫామ్‌హౌస్‌లో జరిగిన తతంగానికి సంబంధించిన వీడియోలను స్వయంగా నాటి సిఎం కెసిఆర్ బైట పెట్టారు. అది బిజెపిని తీవ్రంగా అప్రదిష్టపాలు జేసింది. అప్పట్లో సంజయ్‌తో బి.ఎల్.సంతోష్ ఫోన్ సంభాషణలు కూడా ట్యాపింగ్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. నాడు ఫామ్‌హౌస్ వ్యవహారాన్ని కెసిఆర్ కనుసన్నల్లో బైటపెట్టిన నలుగురు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలలో ఒకరైన గువ్వల బాలరాజు అకస్మాత్తుగా ఆగస్టు 2న ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆయన ఆదివారం(నేడు) బిజెపిలో చేరిక ఖరారైంది. పార్టీలో రెండు దశాబ్దాలు కెసిఆర్‌తో సన్నిహితంగా మెలిగిన, మూడుసార్లు ఎమ్మెల్యేగా అచ్చంపేట మాజీ శాసనసభ్యుడు బాలరాజు బిజెపిలో చేరడం ప్రస్తుత పరిస్థితులలో బిఆర్ఎస్‌కు పెద్ద షాకే కాకుండా ఆందోళన కలిగించే విషయమే. ఫామ్‌హౌస్ ఘటనలో భాగస్వామిగా ఉన్న వ్యక్తిని చేర్చుకోవడం ద్వారా బిఆర్ఎస్‌ను ఇరుకున పెట్టే ప్రణాళికను బిజెపి రచించిందని పరిశీలకులు భావిస్తున్నారు. బాలరాజు బాటలో మరికొందరు బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారని వార్తలు వినిపిస్తున్నాయి.

మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నప్పటికీ వరుస పరిణామాలు ఎటు దారితీస్తాయోననే ఆందోళన బిఆర్ఎస్ నేతల్లో నెలకొంది. అందులో భాగంగా మరో దారి చూసుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి పార్లమెంటు ఎన్నికలకు ముందే పదిమంది ఎంఎల్‌ఏలు బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. తరువాత కాంగ్రెస్ అధిష్ఠానం బ్రేకులు వేయడంతో మరికొందరు సిద్ధమైన, ఫిరాయింపులకు బ్రేక్ పడింది. ఇప్పుడు స్థానిక ఎన్నికలకు ముందు బలోపేతం అవ్వాలనుకుంటున్న బిజెపికి తక్షణం రెడీమేడ్‌గా కనిపిస్తోంది. బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలే. కాంగ్రెస్, బిజెపిల మధ్య సైద్ధాంతిక వ్యతిరేకతలు ఉండడమే కాకుండా, కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో ఆ పార్టీని వీడి బిజెపివైపు చేరే అవకాశాలు తక్కువే. అందుకే గులాబీ పార్టీపై బిజెపి దృష్టి సారించింది. బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలే కాదు, కొందరు సిట్టింగ్ ఎంఎల్‌ఏలు కూడా తమ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారంటూ బిజెపి రాష్ట్ర నూతన అధ్యక్షుడు ఎస్.రామచంద్రరావు ప్రకటించారు. అంతకుముందే బిఆర్ఎస్‌ను అస్థిరపరిచేందుకు కాళేశ్వరం అక్రమాలపై సిబిఐ దర్యాప్తు కోరాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బిజెపి కోరుతున్నది. తాజాగా ఫోన్ ట్యాపింగ్ కేసును కూడా సిబిఐకి అప్పగించాలని, అందులో డబ్బులు చేతులు మారిన వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు అప్పగించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేస్తున్నారు. బిజెపి చేతిలో సిబిఐ, ఇడి, ఐటి ఉంటే చాలు ఫిరాయింపులు సులువు అనే అనేక రాష్ట్రాలలో నిరూపితమైంది. ఈ త్రిశూలాస్త్రాన్నే తెలంగాణలో కూడా ప్రయోగించాలని ఆ పార్టీ భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది. అందుకే కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్‌లపై సిబిఐ దర్యాప్తు చేయించాలని రాష్ట్రం కోరాల్సిందిగా డిమాండ్ చేస్తున్నారు. ఎందుకంటే రాష్ట్ర ప్రభుత్వం కోరితేనే సిబిఐ అనుమతి సాధ్యం తప్ప కేంద్రం తనంతట తాను నిర్ణయించలేదు. అయితే, బండి సంజయ్‌కు ఫోన్ చేసిన సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫోన్ కూడా ట్యాప్ అయిందనే అంశంతో ట్యాపింగ్ కేసును కేంద్రం చేతిలోకి తీసుకునే అవకాశాలను కూడా కొట్టిపారేయలేమనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే, ఇప్పటికే బిఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలు, భూముల వ్యవహారం, అవినీతి వంటి విషయాలలో ఆ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులపై ప్రజల్లో సదాభిప్రాయం లేదు. వారిని బిజెపి చేర్చుకుంటే ఆ మరకలు కాషాయ పార్టీకి మేలు కంటే కీడు చేసే అవకాశాలే ఎక్కువ. గతంలో రాజకీయ పునరేకీకరణ పేరుతో వివిధ పార్టీల ఎమ్మెల్యేలు, నాయకులను తనలో కలిపేసుకున్న బిఆర్ఎస్‌కు ఇప్పుడదే ఏకుమేకులా మారింది. ఈ నెలలో జరిగే శాసనసభ వానాకాలం సమావేశంలో కాళేశ్వరంపై ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై చర్చకు ముందు బిజెపి నుంచి తమ పార్టీకి ప్రమాదం కమ్ముకొచ్చే అవకాశం లేకపోలేదని బిఆర్ఎస్ నాయకులే ప్రైవేటు సంభాషణలలో అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. బైటికెళ్ళాలని భావిస్తున్న నాయకులు బిఆర్ఎస్ ప్రతిపక్ష పాత్ర సరిగా పోషించడం లేదని, అందుకు శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కెసిఆర్ సభకు రాకపోవడాన్ని కూడా ఒక సాకుగా చెబుతున్నారు. ఏదేమైనప్పటికీ బిఆర్ఎస్ అత్యంత గడ్డుకాలం ఎదుర్కొంటున్నదనడంలో సందేహం లేదు.

## కాంగ్రెస్ కార్యకర్త అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/గంగాధర :** గంగాధర మండల కేంద్రానికి చెందిన రాజుల ఆదిరెడ్డి శుక్రవారం కొత్తపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శనివారం గంగాధర మండల కేంద్రంలో ఆదిరెడ్డి అంతిమ యాత్రను నిర్వహించగా ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం అంత్యక్రియల్లో పాల్గొని ఆదిరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. ఆదిరెడ్డి కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి ఎమ్మెల్య మేడిపల్లి సత్యం అంతిమ యాత్రలో ఆదిరెడ్డి పాడెను మోశారు. ఆదిరెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

## మంత్రి శ్రీధర్ బాబుకి రాఖీ కట్టిన దొడ్డ గీతారాణి



**ప్రజాపక్షం/ముత్తారం :** రక్షాబంధన్ వేడుకలను పురస్కరించుకొని పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ సతీమణి అడవి శ్రీరాంపూర్ తాజా మాజీ ఎంపీటీసీ దొడ్డ గీతా రాణి బాలాజీ లు శనివారం హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు నివాసంలో రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** యూత్ కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు బొంకూరి అవినాష్ ఆధ్వర్యంలో పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ జెండా ఎగురవేశారు. ఈసందర్భంగా స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి అవినాష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి యూత్ కాంగ్రెస్ వెన్నుముక లాంటిదన్నారు. పార్టీ ఇచ్చిన ఏ పిలుపునైనా యూత్ కాంగ్రెస్ తప్పకుండా పాటిస్తుందని పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్‌లో పని చేసిన వారు చాలామంది ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులయ్యారని గుర్తు చేశారు. యువత రాజకీయాల్లోకి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు భూషణవేణ సురేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి దొడ్డుపల్లి జగదీష్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు ముత్యాల నరేష్, మండల అధ్యక్షుడు జడల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రావణ్, ఓదెల, జూలపల్లి మండలాల అధ్యక్షులు రాహుల్, దేవేందర్, నాయకులు రాకేష్, అయూబ్, నాంసాని శ్రీనివాస్, తూముల మహేష్, పవన్ కుమార్, శ్రీనివాస్, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మాన్ని సంస్కృతిని కాపాడుకోవాలి

జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి బాబాజీ పెల్లి గ్రామంలో శనివారం హనుమాన్ ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని జగిత్యాల శాసనసభ్యులు డా.సంజయ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హనుమాన్ ఆలయ అభివృద్ధికి తన వంతుగా కృషి ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. బ్రిటిష్ మొగలుల కాలంలో భారత ఆలయాలు ధ్వంసం చేయబడ్డాయి. మన చరిత్రను మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మన ధర్మాన్ని సంస్కృతిని మనం కాపాడుకోవాలని మన మతాన్ని మనం ప్రేమిస్తూ ఇతర మతాలను గౌరవించాలి ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సదాశివరావు, ప్రకాష్, శంకర్, శేఖర్, శాంతపు రావు, రవీందర్రావు, వెంకటేశ్వరరావు, శ్రీకాంత్, గంగ నీలయ్య, మహేశ్వర్ రావు, రామ్ శంకర్, గ్రామ ప్రజలు, హనుమాన్ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా గృహ నిర్మాణ కార్యక్రమం చేపట్టాం

మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం చలిగల్ గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ కార్యక్రమంలో మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి పాల్గొన్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తదుపరి గత దశాబ్ద కాలం గృహ నిర్మాణ కార్యక్రమం పూర్తిగా స్తంభించిపోయిందని, ఒక విధంగా గృహ నిర్మాణ శాఖను రద్దు చేశారని ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో 2004–2014 మధ్యకాలంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి సిఎం ఉండగా స్యాచిరేషన్ ప్రాతిపదికన ఇల్లు లేని వంటి ప్రతి నిరుపేదను ఒక ఇంటివారిని చేయాలని లక్ష్యంతో రాజకీయాలకు అతీతంగా గృహ నిర్మాణ కార్యక్రమం చేపట్టబడడం జరిగిందిని జీవన్ రెడ్డి అన్నారు. మళ్లీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా అర్హత ప్రాతిపదికన ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి పెరిగిన విలువలకు అనుగుణంగా ప్రతి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు మంజూరు చేయబడే విధంగా ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్ల నిర్మాణం మొదటి విడతగా తొలి దశలో చేపట్టడం జరుగుతుందని రాష్ట్రంలో దాదాపు 4 లక్షల పైచిలుకు ఇండ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుంది. దశలవారీగా రాబోయే 3 సంవత్సరాలలో మొత్తం రాష్ట్రం లోపల ఇల్లు లేని నిరుపేద వర్గాలను ఒక ఇంటి వారిని చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ గృహ నిర్మాణ కార్యక్రమం గ్రామ గ్రామాన స్థలాలు సేకరింపచేసి గృహ నిర్మాణ కార్యక్రమం చేపట్టబడడం జరిగిందన్నారు. అదే విధంగా ఇల్లులేని నిరుపేద వర్గాల వారి అందరికీ కూడా 5 లక్షల రూపాయలతో ఇంటి నిర్మాణ కార్యక్రమం చేపట్టబడే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టబడడం జరుగుతుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. అందులో భాగంగానే చలిగల్ గ్రామంలో ఇంటి నిర్మాణ కార్యక్రమానికి భూమి పూజ చేయడం జరిగిందని లబ్ధిదారులు అందరు కూడా 400 గజాల నుండి 600 గజాల లోపు చేసుకోవాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శిలు కూడా చాలా బాగా పని చేస్తున్నారు లబ్ధిదారులకు సూచనలు ఇస్తూ వారికి తోడుగా నిలుస్తున్నారు అని మాజీ మం త్రి జీవన్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్, గ్రామ నాయకులు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## రైతు బీమా దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్ :** ఆగస్టు 13 వరకు రైతు బీమా దరఖాస్తు చేసుకోవాలని ఎఓ వసంతరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో కొత్త పట్టాదారు పాసుపుస్తకం కలిగిన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 5 వరకు పట్టా పాస్ పుస్తకం వచ్చిన వారు దరఖాస్తులకు అర్హులని అన్నారు. మండలంలోని ఇటిక్యాల,తిగుల్,మునిగడప,తిమ్మాపూర్, చాట్లపల్లి, జగదేవ్‌పూర్ రైతు వేదికల్లో 2025 సంవత్సరానికి గాను రైతు బీమా నమోదు కార్యక్రమాన్ని సంబంధిత వ్యవసాయ విస్తీరణ అధికారులు చేపట్టారని పేర్కొన్నారు. ఇంతకు ముందు పట్టా పాసు బుక్ ఉండి రైతు బీమా నమోదు చేసుకోని 18 సంవత్సరాల నుండి 59సంవత్సరాలలోపు వయస్సు గల పట్టాదారులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంతకు ముందు రైతు బీమా నమోదు చేసుకున్న రైతులు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని ఏఓ స్పష్టం చేశారు.

# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ !

### పుట్టింటికి చేరుకున్న ఆడపడుచులు

### కిటకిటలాడిన ఆర్‌టిసి బస్సులు, రాఖీ దుకాణాలు

### ఇంటింటా ఆడపడుచుల సందడి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** అన్నా చెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీక రాఖీ పర్వదినం. సోదరుడికి కట్టే రాఖీలు సోదరీమణులకు రక్షణ కవచంగా నిలుస్తాయని విశ్వాసం. ప్రస్తుత మార్కెట్లో రుద్రాక్ష, స్టోన్, వెండి రాఖీలు ప్రత్యేకంగా నిలిచాయి. వాటితో పాటు కుందన్లు మెరుపులు జరితో స్పాంజితో తయారుచేసిన రాఖీల సైతం మార్కెట్లోకి వచ్చాయి చిన్నపిల్లలను ఆకర్షించేందుకు కార్టూన్ రాఖీలు కూడా మార్కెట్ లో విరివిగా లభిస్తున్నాయి. పాతకాలంలో అతిపెద్దగా ఉండే రాఖీలు ధరించేవారు రాను రాను అవి చిన్నగా మారిపోయాయి. మళ్లీ ఈ సంవత్సరం పాత కాలంలో లభించే పెద్ద పెద్ద రాఖీలు దుకాణాల్లో దర్శనమిస్తున్నాయి. కొందరు దూర ప్రాంతంలో ఉన్న సోదరులకు సోదరీమణులు కొరియర్, పోస్ట్ ఆఫీస్ ల ద్వారా ముందుగానే రాఖీలను పంపించారు.

### ఒక రోజు ముందే స్వస్థలాలకు

మండల వ్యాప్తంగా ఆడపడుచులు ఈ ఏడాది రాఖీ పర్వదినాన్ని సుఖ సంతోషాలతో జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. రాఖీ పండుగ ఒకరోజు ముందుగానే పుట్టింటికి చేరుకునేందుకు ఆడపడుచులు తరలివస్తున్నారు. రాఖీ పర్వదినాన్ని రాఖీ పౌర్ణమి, శ్రావణ పౌర్ణమి, జంజాల పౌర్ణమి కూడా 9వ తేదీన పౌర్ణమితి కాబట్టి ఈరోజే రాఖీ పౌర్ణమి జరుపుకోవాలని వేద పండితులు, అర్చకులు చెబుతున్నారు. అర్చకుల పంచాంగం ప్రకారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాఖీ పండుగను జరుపుకోవాలని చెబుతున్నారు. ఆ సమయంలో సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టవచ్చని వేద పండితులు తెలిపారు.

### కిటకిటలాడిన బస్సులు, రాఖీ దుకాణాలు

ఒక్కరోజు ముందే దూర ప్రాంతాలకు వెళ్లే ఆడపడుచులు ఆర్‌టిసి బస్సులో ఒక్కసారిగా అత్యధికంగా ప్రయాణించడంతో బస్సులలో కాలు తీసి కాలు పెట్టే చోటు లేక పోవడంతో నాన్న ఇబ్బందులు పడుతున్నారు. రాఖీల దుకాణల వద్ద సైతం జన సందోహం కనిపిస్తుంది. అలా



గే సోదరుడికి రక్షాబంధన్ కట్టిన తర్వాత హారతి ఇచ్చి నోరును తీపి చేసేందుకు స్వీట్స్‌ను వాడుతుంటారు. అందులో భాగంగానే స్వీట్స్ దుకాణాలు బిజీగా ఉంటున్నాయి.

### హిందూ పండుగల్లో ఒకటి... రాఖీ

హిందువులు జరుపుకునే పండుగల్లో రాఖీ ఒకటి. ఈ పండుగ సోదర సోదరీమణులకు మధ్య ప్రేమగా గుర్తుగా పేరుగాంచింది రాఖీ కట్టిన తర్వాత తన సోదరికి సోదరుడు తన జీవితాంతం అండగా ఉంటానని మాట ఇస్తాడు. ఈ రోజున సోదరీమణులు తన సోదరుడి మణికట్టుపై రాఖీ కట్టి స్వీటు తినిపించి హారతిస్తారు. తనకు రాఖీ కట్టిన సోదరికి ఏదైనా చిరుకానుక బహుమతిగా ఇచ్చి జీవితాంతం కాపాడుతానని హామీ ఇచ్చినట్లుగా భావిస్తారు. ఈ పండుగ ప్రతి సంవత్సరం శ్రావణమాసం పౌర్ణమి రోజున జరుపుకుంటారు. రక్షాబంధన్ అనే పదం రక్ష, బంధన్ అనే రెండు పదాలతో ఏర్పడింది దేవత మూర్తుల కాలం నుంచి ఈ పండుగను జరుపుకుంటున్నట్లుగా చరిత్ర ద్వారా తెలుస్తుంది.

### ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మండల కేంద్రంలో ఉన్న దేవాలయాల్లో రాఖి పర్వదినం పురస్కరించుకొని భక్తులతో దేవాలయాలు కిటకిటలాడాయి. భక్తులు ఉదయాన్నే తలంటూ స్థానాలు ఆచరించి దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి సోదరులకు పార్టీలు కట్టనున్నారు. దీంతో మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో కూడా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ల నిర్వాహకులు అన్ని సౌకర్యాలతో ఏర్పాట్లుచేశారు.

## తెలంగాణలో కరువుతో రైతుల గోస

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** తెలంగాణ రాష్ట్రంలో ఎటు చూసినా రైతు కంట కన్నీరే వస్తుందని, సాగు నీరు లేక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని, యూరియా కొరతతో, కరెంటు కొరతతో రైతుల బతుకు అగమ్యగోచరంగా మారిందని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శనివారం పెద్దపల్లి బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రెస్ మీట్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కారు కక్ష కారణంగా ఈ ఏడాది ఎస్ఆర్ఎస్‌పి ఆయకట్టు నీరు లేక ఎండిపోయే పరిస్థితిలో ఉన్నదని, ప్రస్తుతం నీటి లభ్యత ఆధారంగా ఖరీఫ్‌లో గోదావరి బేసిన్‌లో మొత్తంగా 6 లక్షల ఎకరాలకే నీళ్లివ్వాలని నీటి నిర్వహణ కమిటీ నిర్ణయించిందని, కానీ రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో 55 టిఎంసిలు మాత్రమే అందుబాటులో ఉండగా, 3,93,430 ఎకరాల్లో వరి పంటకు, 78,307 ఎకరాల్లో ఆరుతడి పంటలకు నీళ్లివ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని గుర్తు చేశారు. ఎస్ఆర్ఎస్‌పి ఫేజ్1 లో 9.65 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా ప్రభుత్వం 2.34 లక్షల ఎకరాలకు మాత్రమే అందించింది,అంటే దాదాపు 7.3 లక్షల ఎకరాల పంటలను ఎండబెట్టే పాపానికి ఈ ప్రభుత్వం ఒడిగట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు లేకున్నా సాగునీరందించామని ప్రగల్భాలు పలుకుతూ గత యాసంగిలో ఆయకట్టుకు నీరందిస్తామని కాంగ్రెస్ ప్రకటించి తుదకు నీరి వ్వలేక చేతులేత్తేసిందన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో ఈ వానా కాలం సీజన్‌కు సంబంధించి యూరియాతో పాటు డిఏపి, పొటాష్, కాంప్లెక్స్, ఎస్ఎస్‌పి ఎరువులు కలిపి 22 లక్షల మెట్రిక్ టన్నులు ఇచ్చినట్లు కేంద్ర మంత్రి చెప్పారు. కానీ రాష్ట్రంలో యూరియా 9 లక్షల మెట్రిక్ ట న్నులు అవసరం ఉంటే, 4 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చారని, ఇంకా కావాల్సిన యూరియా 5 లక్షల మెట్రిక్ టన్నులు అందాల్సి ఉంద ని,ప్రైవేటు షాపుల్లో యూరియా బస్తా కావాలంటే 266 బదులు 350 నుండి 400 వరకు అమ్ముతున్నారని, దానితో పాటు 400 రూపాయలు గంట గోళీలు, లేదా 650 రూపాయలు ట్రై గోల్డ్ తీసుకోవాలని నిబం ధనలు పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కోరుకొంటి చందర్, పెద్దపెల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్, పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, మాజీ జెడ్పిటిసి గంటా రాములు తదితరులు పాల్గొన్నారు.



## స్వాతంత్ర్య వీరుల త్యాగాలు చిరస్మరణీయం



**ప్రజాపక్షం/కరీంనగర్:** క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిసిసి ప్రధాన కార్యదర్శి రహ్మత్ హుస్సేన్‌తో కలిసి పద్మాకర్ రెడ్డి మాట్లాడారు. రాక్షస పాలన చేస్తున్న బ్రిటీష్ సామ్రాజ్యాన్ని దేశం నుంచి తరిమికొట్టాలని భారతదేశంలో స్వాతంత్రం తీసుకురావాలనే ఉద్దేశ్యంతో మహాత్మాగాంధీ 1942లో క్విట్ ఇండియా ఉద్యమాన్ని చేపట్టి ఎన్నో పోరాటాలు, సత్యాగ్రహాలు, ధర్నాలు, నిరాహార దీక్షలు చేపట్టి 1947 ఆగస్టు 15న మహాత్మాగాంధీ నేతృత్వంలో ఈ దేశానికి స్వాతంత్రం రావడం జరిగిందని తెలిపారు. స్వాతంత్ర సమరయోధులైన ఎంతో మంది మహనీయులను స్మరించుకోవడం జరుగుతుందన్నారు. దేశంలో పరిపాలిస్తున్న బిజెపి కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మరోసారి ప్రజలు ఉద్యమానికి నాంది పలకాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాజ్యాంగ వ్యవస్థపై ప్రజాస్వామ్య వ్యవస్థపై బిజెపి ఉక్కుపాదం మోపడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. బిజెపి అరాచక పాలన బ్రిటిష్ ప్రభుత్వాన్ని తలపిస్తున్నదన్నారు. ప్రజలంతా ఏకమై బిజెపిని దేశం నుంచి తరిమికొట్టి భారతదేశాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పత్తి మధుసూధన్ రెడ్డి, వెన్న రాజమల్లయ్య, లింగంపల్లి బాబు, బొబ్బిలి విక్టర్, వంగల విద్యాసాగర్, హైమద్, మాదాసు శ్రీనివాస్, చింతల కిషన్, కుంభాల రాజ్ కుమార్, గంగుల దిలీప్, సిరికొండ శివప్రసాద్, రాచర్ల పద్మ, మల్కాపురం అనిల్ కుమార్, నాత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన యువత ఉన్నత విద్యను అభ్యసించాలి

### జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సంగీత

**ప్రజాపక్షం/కరీంనగర్ సిటీ:** గిరిజన యువత ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడాలని గిరిజన అభివృద్ధి అధికారి సంగీత పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్‌లోని విజయపురిలోని గిరిజన సంక్షేమ హాస్టల్‌లో నిర్వహించిన ప్రపంచ గిరిజన దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని కొమురం భీమ్‌కు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని గిరిజన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమా సాహెబ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం జాతీయ స్థాయిలో గిరిజన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. పది శాతం గిరిజన రిజర్వేషన్లను పార్లమెంటులో చట్టం చేసి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో తక్షణమే చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సేవాలాల్ మహరాజ్, కొమురం భీం, ఏకలవ్యుడు, టాను నాయక్‌ల స్ఫూర్తితో గిరిజన తెగలు ఐక్యంగా తమ హక్కుల సాధనకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గిరిజన యూనివర్సిటీని తక్షణమే ప్రారంభించాలని, బయ్యారం ఉక్కు పరిశ్రమను ప్రారంభించి గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మైదాన ప్రాంత గిరిజనుల అభివృద్ధికి ఐటిడిలను ఏర్పాటు చేయాలని కోరారు. ఆదివాసి తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి గుర్రాల రవీందర్ మాట్లీఆడుతూ పోడు సాగుదారులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు పోడు పట్టాలు ఇవ్వాలని ప్రబుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సహాయ గిరిజన అభివృద్ధి అధికారి దివాకర్ రావు,



తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బోడా మోహన్ నాయక్, జిల్లా నాయకులు శివ రాజు, కునుసోథ్ శ్రీనివాస్ నాయక్, తుడుం దెబ్బ నాయకులు సుమన్, వెంకటరావు, మోహన్ నాయక్, శ్రీనివాస్, రవీందర్, వీరన్న, గిరిజన శాఖ ఉద్యోగులు, విధ్యార్థులు పాల్గొన్నారు.

## ఆదివాసుల హననానికి వ్యతిరేకంగా నిరసన

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** శనివారం రోజున పెద్దపల్లి జిల్లా కేంద్రంలో అమరుల వీరుల స్థూపం దగ్గర మద్యాహ్నం అంతర్జాతీయ ఆదివాసుల దినోత్సవం సందర్భంగా మద్య భారతంలో జరుగుతున్న అదివాసులపై హింస వ్యతిరేకంగా పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటి ప్రజాసంఘాలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా ప్రజా సంఘం నాయకులు మాట్లాడుతూ సామ్రాజ్యవాదులకు బహుళ జాతి కంపనీలకు కార్పొరేట్ సంస్థలకు మధ్యభారతంలో అపారమైన ఖనిజ సంపదను దోచిపెట్టడం కోసం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అడవిలో ఉన్న ఆదివాసులను అంతం చేస్తూ హింస నిర్బంధం కొనసాగిస్తున్నదనీ, బస్తర్ ప్రాంతంతో 250 పోలీస్ క్యాంపులను ఏర్పాటుచేసి 8 లక్షల పారా మిలటరీ పోలీసు బలగాలు నిత్యం కుంబింగ్‌లతో బూటకపు ఎన్కౌంటర్ల ద్వారా ఆదివా





సులను చంపి వేస్తున్నారని ,2005 లో సల్వాజుడుం, 2009 లో ఆపరేషన్ గ్రీన్‌హంట్, 2015 లోఅపరేషన్ సమాధాన్, 24లో అపరేషన్ కార్ పేరుతో 6నెలల పసిపాప మంగ్లి సోడి నుంచి 60 సంవత్సరాల వృద్ధుల వరకు చంపివేస్తున్నారనీ , 13 నెలల కాలంలోనే 600 ఆదివాసి ప్రజలను ప్రభుత్వం చంపివేసిందనీ, ఈ మానవ హింసను నివారించుటకు అదివాసుల జీవించే హక్కుకోసం దేశంలో ఉన్న ప్రతిపక్ష పార్టీలు, వామపక్ష పౌరులు, మేధావులు, ప్రజా తంత్ర దేశ భక్తులు అదివాసులకు మద్దతుగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుబొంకురి లక్ష్మ ణ్ ,బొడ్డుపెల్లి రవి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మదన కుమారస్వామి,పౌర హక్కుల ప్రజాసంఘాల నాయకులు నారావినోద్ ,ఎరుకల రాజన్న ,కట్ట విశ్వనాథ్ ,టి రత్నకుమార్ ,రామిళ్ళ బాపు ,గాండ్ల మల్లేష్ యాదవనేని పర్వతాలు ,బండారి రాజలింగయ్య ,నక్క సత్యనారాయణ ,బండి శంకర్ గౌడ్ ,బియ్యాల స్వామి ,తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జెండా మోస్తున్నందుకు నిరంతరం గర్వపడతాం


### జెండా ఆవిష్కరించిన సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ :** స్వాతంత్ర సంగ్రామంలో కీలక ఘట్టం క్విట్ ఇండియా ఉద్యమమని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. బ్రిటిష్ పాలన అంతమవ్వాలని క్విట్ ఇండి యా తీర్మాణం ఆమోదించడం జరిగిందన్నారు. ఆగస్టు 9న ఎన్నో నిర్బంధాల మధ్య క్విట్ ఇండియా ఉద్యమం విజయవంతం అయ్యిందని, కానీ ఎందరో ఉద్యమకారులు అమరులయ్యారని, మరెందరో జైళ్లలో బంధింపబడ్డారని గుర్తు చేశారు. ఆనాటి స్వాతంత్ర ఉద్యమం మొత్తం గాంధీ, నెహ్రూతో పాటు ఎందరో మహానుభావులు కాంగ్రెస్ జెండా పట్టుకుని పో రాటం చేవారని, అటువంటి కాంగ్రెస్ పార్టీ జెండా మోయడాన్ని నిరంతరం కాంగ్రెస్ కార్యకర్తలుగా గర్వపడతామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎండి తాజ్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, కుర్ర పోచయ్య, రవీందర్ గౌ డ్, మేరాజ్, అష్రఫ్, సుదర్శన్, షబానా మహమ్మద్, ముల్కల కవిత, జ్యోతిరెడ్డి, మాసూమ్ ఖాన్, యనమల మంజుల, హసీనా, సాయిరాం, బషీర్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## మానేరు వంతెన పనులు పూర్తి అయ్యేదెన్నడో?

### 9 ఏళ్లయిన పూర్తికాని మానేరు వంతెన

**ప్రజాపక్షం/ముత్తారం :** రెండు జిల్లాల సరిహద్దు అయిన పెద్దపల్లి జిల్లా అటు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలను కలిపే మానేరు వంతెన నిర్మాణ పనులు మాత్రం 9 ఏండ్లు పూర్తి అయినప్పటికీ కూడా నిర్మాణ పనులు మాత్రం పూర్తిగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా వంతెన పరిస్థితి ఉంది. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు మానేరు వాగు వద్ద హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం కోసం 47 కోట్ల నలబైలక్షల ప్లాన్ నిధులతో 2016 సంవత్సరం ఆగస్టు నెల నాలుగో తేదీన అప్పటి మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, శాసనసభ అధ్యక్షులు మధుసూదన్ చారి, ఈటెల రాజేందర్, మంథని ఎమ్మెల్యే పుట్ట మధు తో పాటు మరికొంతమంది ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. అప్పటినుండి రెండేళ్ల పాటు వంతెన నిర్మాణ పనులు



చురుగ్గా జరిగినప్పటికీ తదనంతరం వంతెన నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ఇంకేముంది అప్పటినుండి వంతెన నిర్మాణ పనులు జరగకుండా అలాగే ఉన్నాయి. అయితే బ్రిడ్జి నిర్మాణ పనుల ఆగిపోయి ఉండడంతో గత రెండేళ్ల క్రితం గడ్డర్లు కూలిపోయాయి. వంతెన నిర్మాణానికి సంబంధించినగడ్డర్లు కూలిపోయిన విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు వంతెన పరిశీలనకు వచ్చి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు చేయడం వల్లే ఇలా గడ్డర్లు కూలిపోవడం జరిగిందని సంబంధిత కాంట్రాక్టర్ లైసెన్సును రద్దుచేసి కొత్తవారికి వంతెన నిర్మాణ పనులు అప్పజెప్పి వంతెన పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపి మళ్లీ రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పనులు మాత్రం జరగక అలాగే ఉంది. కాగా వంతెన నిర్మాణానికి సంబంధించిన వ్యయం కూడా 50 కోట్ల పైచిలుకు పెంచిఈ మధ్యకాలంలో వంతెన నిర్మాణ పనులు జరుగుతాయని ఆర్ అండ్ బి అధికారులు మరో మారు వంతెన నాణ్యత పై రీసర్వే చేస్తున్నప్పటికీ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ఏది ఏమైనా మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ తీసుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లా, పెద్దపల్లి జిల్లా ఈ ఇరు జిల్లాల ప్రజల కల మానేరు వంతెన నిర్మాణ పనులను పూర్తి చేసి ఈ ప్రజల కల నెరవేరేల చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సౌర ఫలకాలు ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సౌర ఫలకాలు ఏర్పాటు చేయనున్నట్లు ఉపముఖ్య మంత్రి,ఫైనాన్స్, ప్లానింగ్, ఎనర్జీ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు,అధికారులతో వీడియో కన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన,సౌర విద్యుత్ వినియోగాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.జిల్లాల వారీగా ప్రభుత్వ భవనాల వివరాలు, నెల వారీ విద్యుత్ వినియోగం,బిల్లులను వారంలోగా సమర్పించాలని సూచించారు. గ్రామపంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఇతర శాఖ భవనాలపై కూడా సౌర ఫలకాలు అమర్చనున్నట్లు ఉపముఖ్య మంత్రి వెల్లడించారు. జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కిషోర్ కుమార్, డిపిఓ శ్రీనివాస్, టీజీ రెడ్ కో ఎండి ఎల్.శ్రీనివాస్, ఏపిడి నాగవర్ధన్,కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడాలి

### మిన్పూర్ సబ్ స్టేషన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/పాపన్నపేట:** విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని మిన్పూర్ 220/132/33 కెవి సబ్ స్టేషన్‌ను కలెక్టర్ పరిశీలించారు. అక్కడ జరుగుతున్న విద్యుత్ సరఫరా ,నిర్వహణ ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన పరికరాలు, నిర్వహణ ఏర్పాట్లు, భద్రతా చర్యలు మొదలైన వాటినిపరిశీలించారు. అంతేకాకుండా, సబ్ స్టేషన్‌లో సాంకేతిక పరికరాల పనితీరును పరిశీలించి, అవసరమైన సూచనలు చేశారు. సబ్ స్టేషన్‌లోని సాంకేతిక సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## డిచ్‌పల్లి పిహెచ్‌సిని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తూ, ప్రభుత్వ ఆస్పత్రుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. శనివారం ఆయన డిచ్‌పల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ సెంటర్, ఇన్ పేషంట్, ఫిమేల్, జనరల్ వార్డులు, ల్యాబ్ తదితర విభాగాల పని తీరు పరిశీలించారు. ఆస్పత్రిలో అందుబాటులోని వైద్యులు సిబ్బందిపై ఆరా తీసిన కలెక్టర్ అటెండెన్స్ రిజిస్ట్రర్ తనిఖీ చేశారు. ప్రతిరోజు ఎంతమంది పేషంట్లు వస్తున్నార. స్థానికంగానే కాన్పులు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని వైద్యులకు సూచించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా అంకిత భావంతో పని చేయాలని హితవు పలికారు. రౌండ్ ది క్లాక్ ఆస్పత్రులలో అన్ని సమయాలలో వైద్యులు, సిబ్బంది విధుల్లో ఉండాలని ఆదేశించారు. ప్రతినెల రెండవ శనివారం ప్రత్యేకంగా నిర్వహించే ఆరోగ్యశ్రీ శిబిరానికి అన్ని విభాగాల స్పెషలిస్ట్ డాక్టర్లు హాజరయ్యేలా చూడాలని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల పని తీరును ప్రతిరోజు పర్యవేక్షణ చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిని డాక్టర్ రాజశ్రీని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ డిచ్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలపై తహసీల్దార్ సతీష్‌రెడ్డిని ఆరా తీశారు. త్వరితగతిన అర్జీలు పరిష్కరించాలని సూచించారు.

## నూతన రైతులు రైతు భీమాకు దరఖాస్తు చేసుకోవాలి

### ఏవో సిద్దిరామేశ్వర్



**ప్రజాపక్షం/ఎడపల్లి:** జూన్ 6లోపు కొత్తగా పట్టా పాస్ బుక్‌లు పొందిన రైతులకు రైతు బీమా పథకం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధిరామేశ్వర్ తెలిపారు. ఆగస్టు 12వ తేది చివరి తేది అని ఆయన స్పష్టం చేశారు. కొత్తగా పట్టా పాస్‌బుక్ పొందిన రైతులు ఈ పథకానికి అర్హులని, రైతు పట్టాదారు పాస్‌బుక్, రైతు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు, పూర్తిగా నింపిన అప్లికేషన్ ఫారం ఈ పత్రాలన్నింటిని జతపరిచి, తమ తమ క్లస్టర్లలో సమర్పించాలని ఏవో సిద్ధిరామేశ్వర్ సూచించారు. అలాగే ఒకవేళ నామినీ మరణించినా లేదా ఇతర మార్పులు చేయాల్సి వచ్చిన ఆగస్టు 12లోపు తమ రైతు వేదికలలో సంప్రదించాలని ఆయన కోరారు. ఈ గడువులోపు మార్పులు చేసుకుంటే, రైతు బీమా పథకానికి సంబంధించిన వివరాలు సక్రమంగా నమోదవుతాయని ఆయన తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని ఏవో సిద్ధిరామేశ్వర్ కోరారు. మరిన్ని వివరాల కోసం తమ క్లస్టర్ అధికారిని లేదా రైతు వేదికను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

## శ్రీరామ స్పిన్నింగ్ మిల్ పరిశ్రమలో ప్రమాదం

### గోడకూలి ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** మనోహరాబాద్ మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కళ్ళకల్ గ్రామ చివరలో గల శ్రీ రామ స్పిన్నింగ్ మిల్ పరిశ్రమలో శనివారం వాటర్ ట్యాంక్ గోడ కూలి ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ గ్రామానికి చెందిన బాల్ రెడ్డి 45 సం॥ కళ్ళకల్ గ్రామానికి చెందిన గానుగు రవీందర్ లు పరిశ్రమలో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్ దగ్గర నీరు పడుతుండగా ఒక్కసారిగా గోడ కూలి మీద పడడంతో గుర్తు పట్టరాని విధంగా బాల్ రెడ్డి తల చితికిపోయి చనిపోయాడు. రవీందర్ కి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కిమ్స్ హాస్పిటల్ కి తరలించారు. బాల్ రెడ్డి మరణించిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పరిశ్రమకు చేరుకొని తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఉద్రిక్తత జరగకుండా చర్యలు తీసుకున్నారు. పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని స్థానిక నాయకులు హామీ ఇచ్చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపారు.

# విస్తృత స్థాయిలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి

### గ్రామపంచాయతీ మొదలుకొని రాష్ట్ర సచివాలయం వరకూ అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో సోలార్ యూనిట్ల ఏర్పాటు

### ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** గ్రామపంచాయతీ భవనం నుంచి మొదలుకుని రాష్ట్ర సచివాలయం వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల భవనాలపై సోలార్ పవర ప్లాంట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. రాష్ట్రంలో సోలార్ విద్యుత్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ విధానపరమైన నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. శనివారం ఆయన డాక్టర్ బిఆర్.అంబేడ్కర్ సచివాలయం నుండి సాంఘీక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్, రెడ్కో సీఎండీ అనిలా తదితరులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాట్లు, ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజ వికాసం పథకం అమలు, ఇరిగేషన్, దేవాదాయ తదితర శాఖల పరిధిలోని ఖాళీ భూములలో అవకాశమున్న అన్ని చోట్ల సోలార్



విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అన్ని జిల్లాల సమీకృత కార్యాలయాల భవనాలపై పార్కింగ్, క్యాంటీన్ల వద్ద సోలార్ యూనిట్ల ఏర్పాటు కోసం ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్లు అన్ని కూడా ఒకే నమూనాలో నిర్మించినందున సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అనుకూలమైన డిజైన్లను హైదరాబాద్ నుంచి ఎంపిక చేసి పంపిస్తామని డిప్యూటీ సిఎం తెలిపారు. ఇప్పటికే కలెక్టర్ కార్యాలయాల్లో సోలార్ యూనిట్లకు సంబంధించిన మంచి డిజైన్లు ఉంటే వాటిని పంపాలని సూచించారు. అన్ని కార్యాలయాల్లో సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటుకు అవసరమైన వివరాలకు సంబంధించి కలెక్టర్లు హైదరాబాద్‌కు పంపాల్సిన వివరాలకు సంబంధించి నిర్ణీత ఫార్మాట్ పంపిస్తున్నామని, అందులో అన్ని వివరాలు నమోదు చేసి వారం రోజుల్లోపు విద్యుత్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కార్యాలయానికి పంపాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. ప్రభుత్వ భవనాతో పాటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు వంటి ఉన్నత విద్యాసంస్థలభవనాలపై కూడా సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాని అందుకు సంబంధించిన భవనాల వివరాలు పంపాలని కలెక్టర్లకు సూచించారు. నీటిపారుదల శాఖ, రోడ్లు, భవనాల శాఖ పరిధిలో పెద్ద ఎత్తున ఖాళీ స్థలాలు ఉన్నాయని, వాటి వివరాలు సైతం పంపాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ఓఎఫ్ఆర్ చట్టం కింద 6.70 లక్షల ఎకరాల భూములను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసిందని,ఈ భూముల్లో నల్లమల డిక్లరేషన్ కింద ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ద్వారా ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ సిఎం కలెక్టర్లకు వివరించారు. నల్లమల డిక్లరేషన్‌లో భాగంగా ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గంలో ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. ఇందిరా సౌర గిరిజల వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని దీనిని దృష్టిలో పెట్టుకుని జాప్యానికి తావు లేకుండా వారం రోజుల్లోపు వివరాలు పంపాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, డీఆర్‌డీఓ సాయగౌడ్, టీజీ రెడ్కో డిఎం రమణ, ట్రాన్స్‌కె ఎస్ఈ రవీందర్, కలెక్టరేట్ ఎఓ ప్రశాంత్ పాల్గొన్నారు.



## భారీగా నిషేధిత గుట్కా పట్టివేత

### గుట్కా తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసిన హాజీపూర్ పోలీసులు

**ప్రజాపక్షం/ హాజీపూర్:** హాజీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాపల్లి వద్ద పోలీస్ తనిఖీల్లో భారీగా నిషేధిత గుట్కా పట్టుబడింది. హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ్ తెలిపిన వివరాల ప్రకారం నమ్మదగిన సమాచారం మేరకు శనివారం జన్నారం నుండి మంచిర్యాల వైపు అనుమానస్పదంగా వెళ్తున్న బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా భారీ మొత్తంలో నిషేధిత గుట్కా (అంబర్) బ్యాగులుగా గుర్తించామని తెలిపారు. గుట్కా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించడం జరిగిందన్నారు. పట్టుబడిన 30 బ్యాంకుల విలువ సుమారు ఒక్క లక్ష డెబ్బై వేల రూపాయలు ఉంటుందని తెలిపారు. తదుపరి చర్య నిమిత్తం జిల్లా ఆహార నాణ్యత ప్రమాణాల అధికారికి పంపించడం జరిగిందని అన్నారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుళ్లు గుమ్ముల చంద్ర శేఖర్, సత్యనారాయణ, గంగాధర్, తిరుపతి పాల్గొన్నారు.

# ఆదివాసీల అభివృద్ధి కోసం నిరంతరం కృషి

### జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి

### ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** ఆదివాసీల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. 31వ ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా ఎస్‌పి కాంతిలాల్ సుభాష్ పాటిల్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవిలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదివాసి, గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు ప్రపంచ ప్రసిద్ధి చెందాయ ని, వాటిని కాపాడుకుంటూ భావితరాలకు అందించాలని తెలిపారు. జల్ జంగల్ జమీన్ కోసం పోరాటం చేసిన కొమురం భీమ్ స్ఫూర్తిగా ఆదివాసీలు ముందుకు సాగాలని అన్నారు. ఆర్పిరషనల్ బ్లాక్ కింద ఎంపికైన జిల్లాలోని తిర్యాణి మండలం 2సార్లు జాతీయ స్థాయి అవార్డు పొందడం అధికారుల సమన్వయంతో సాధ్యపడిందని అన్నారు. జీవో నం. 49 రద్దు చేసే దిశగా రాష్ట్ర



ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతుందని, ఆదివాసీల అభివృద్ధి కోసం అనేక పథకాలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆదివాసి, గిరిజన ప్రాంతాలలో రక్తహీనత నివారణ కోసం పౌష్టికాహారం అందించడం జరుగుతుందని, విద్యాభివృద్ధిలో భాగంగా అదనపు తరగతి గదులు నిర్మించి గిరిజనుల పిల్లలకు గుణాత్మక విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతందని, ఈ క్రమంలో జిల్లాకు నూతన వసతి గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. ఆదివాసి యువత విద్యాభివృద్ధి కోసం ముందుకు రావాలని, గిరిజనుల పిల్లలు పాఠశాలకు వచ్చి చదువుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ ఆదివాసీలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది తెలిపారు. ఆదివాసీల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ చౌక్ వద్ద రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి, కొమురం భీమ్ చౌక్ వద్ద భీమ్ విగ్రహానికి పూలమాల వేసి గుస్సాడి నృత్యాలతో డప్పు చప్పుళ్ల మధ్య ఆదివాసి భవన్‌కు చేరుకున్నారు. ఆదివాసి జెండాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పలు పాఠశాలల విద్యార్థులు ఆదివాసి గీతాలపై చేసిన నృత్యాలు అందరిని అందించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సీతారాం, అటవీ డివిజన్ అధికారి దేవిదాస్, గోండ్వానా మహాసబ జాతీయ ఉపాధ్యాక్షుడు అర్జు మాస్టర్, జిసిడిఓ శకుంతల, గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు సోయం బాపురావు, మాజీ శాసనసభ్యులు ఆత్రం సక్కు, ఎసిఎంఒ ఉద్దవ్, జిల్లాలోని 9 ఆదివాసి సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



## కోర్ట్ భవనానికి ఐదు ఎకరాల స్థలం ఇచ్చేలా చూడండి..

### ఎమ్మెల్యేని కలిసిన నిర్మల్ జిల్లా న్యాయవాదులు..

**ప్రజాపక్షం/బైంసా:** నిర్మల్ జిల్లా కేంద్రంలోని జిల్లా సెషన్స్ న్యాయమూర్తి,ఇతర న్యాయస్థానాలు 10 కోర్ట్ కాంప్లెక్స్ కోసం నిర్మల్ పట్టణంలో ఐదు ఎకరాల స్థలం కేటాయించేలా చూడాలని నిర్మల్ బార్ అసోసియేషన్ సభ్యులు (న్యాయవాదులు)శనివారం ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్‌ను కోరారు. బైంసాలోని ఎమ్మెల్యే నివాసానికి న్యాయవాదులంతా వచ్చి ఈ విషయమై విన్నవించారు.ప్రస్తుతం కోర్టు ప్రాంగణం 3.20 ఎకరాల స్థలంలో ఉందని,ప్రస్తుతం నూతన కోర్టు నిర్మాణానికి 5 ఎకరాల స్థలం అవసరమని దీనికోసం పాత ఎమ్మార్వో, ఆర్ అండ్ బి కార్యాలయ స్థలాలు అందుబాటులో ఉన్నాయని వాటిని కేటాయించాలన్నారు.ఎమ్మెల్యేను కలిసిన వారిలో నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లారెడ్డి,ప్రధాన కార్యదర్శి ఎస్ నరేందర్,స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు న్యాయవాదులు ఉన్నారు.

# ఆదివాసీ హక్కులను కాలరాస్తే ఊరుకోం

### అడవిపై ఆధారపడి బతికే ఆదివాసీలకు జీవన హక్కులు కల్పించాలి

### తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం

**ప్రజాపక్షం/ చెన్నూరు :** అడవిపై ఆధారపడి జీవించే ఆదివాసీల హక్కులను కాలరాసే కుట్ర చేస్తే ఊరుకోబోమని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం హెచ్చరించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోటపల్లి మండల అల్గామ గ్రామంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో సంఘం సీనియర్ నాయకులు మడే వెంకటస్వామి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసిచ ట్టాలను కాలరాస్తూ అడవిపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసులను తల్లి నుండి బిడ్డను వేరు చేసిన ట్టుగా ఆదివాసులను అడవి నుండి దూరం చేస్తున్నారని, తరతరాలుగా పట్టుపురుగులను పెంచుతూ వాటిపై వచ్చే కొద్ది పాటి ఆదాయంతో జీవనాన్ని సాగిస్తున్న అలాంటి వారిని అటవీ శాఖ అధికారులు కర్కశకంగా వ్యవహరిస్తూ వారు వేసిన పట్టుపురుగులను చంపి వేయడం, ఆదివాసులను భయభ్రాంతులకు గురిచేసి ఫారెస్ట్ ఆఫీసులలో బంధించడం చేస్తున్నారని, ఆదివాసులకు అటవీ హక్కు పత్రాలు ఉన్నప్పటికి ఆ యొక్క వ్యవసాయ భూముల పైన అటవీ శాఖ అధికారులు పెత్తనం చెలాయిస్తూ ఆంక్షలు విధించి వ్యవసాయాన్ని ఆటంకపరుస్తున్నారని ఆయన అసహనం వ్యక్తం చేశారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న ఆదివాసి రైతులకు క్రాఫ్



లోన్ ఇవ్వకపోవడం మూలంగా ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పులు తెచ్చి వ్యవసాయాలు చేసి అప్పులు కట్టలేక పేదరికంలోకి కూరుకుపోతున్నారని, పోడు వ్యవసాయం చేసుకుంటున్న ఆదివాసి రైతులు క్రాఫ్ లోన్ ఇవ్వాలని ప్రభుత్వానిక, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఏ మాత్రం కూడా పట్టించుకోవడం లేదు అంటే ఈ ప్రభుత్వాలకు ఆదివాసి ప్రజలంటే ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చని, పైకి మాత్రం మేము ఆదివాసుల కోసమే పని చేస్తున్నాము అంటారు కానీ ఆదివాసి చట్టాలను ఏ మాత్రం కూడా రాజకీయ నాయకులు, అధికారులు గౌరవించరు వాటిని కాపాడరని ఆవేదన వ్యకత చేశారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వాలు మేలుకొని ఆదివాసులపైన జరిగే అన్యాలను, దురాక్రమాలను అటవీ అధికారుల వేధింపులను అరికట్టి పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు క్రాఫ్ లోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు మడే వెంకటస్వామి, చాకటి శేఖర్, కుమురం సమ్మయ్య, రమేష్, మాజీ సర్పంచ్ సంతోష్, మత్తయ్య, రాజేష్, అంబేద్కర్ సంఘం నాయకులు వలి హైదర్, తలండి సంపత్, గణేష్, శంకర్, రామ్ చందర్, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో ఆదివాసీ మ్యూజియం ఏర్పాటు చేయాలి

### ట్రైబల్ విద్యార్థులకు కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి

### ఆదివాసి జెఏసి డిమాండ్

### నిర్మల్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహణ..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ పట్టణంలో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ ఆదివాసీల హక్కులను కాపాడాలని, వారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం నిర్వహించారు. టీఎన్జీవో భవనం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ అంబేద్కర్ విగ్రహం మీదుగా కొమురం భీమ్, రాంజీ గోండు విగ్రహాల వరకు సాగింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు విగ్రహాలకు పాలాభిషేకం చేసి జెండాలను ఆవిష్కరించారు. అనంతరం టీఎన్జీవో భవనంలో జరిగిన సభలో నాయకులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ మంద మల్లేష్, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకగారి భూమాయ్య మాట్లాడుతూ ఆదివాసీల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆదివాసీ మ్యూజియం ఏర్పాటు చేయాలని,ఆదివాసీ విద్యార్థుల కోసం ప్రత్యేక కోచింగ్ సెంటర్ ను ప్రారంభించాలని కోరారు. నిర్మల్ జిల్లాలో 80 వేలకు పైగా ఆదివాసులు ఉన్నారని, ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయాలన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఇచ్చిన పోడు భూముల పట్టాలపై సాగు చేసుకునే విధంగా ఆదివాసీలకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, మారుమూల గూడేలకు రోడ్డు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని, ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు శంభు, నైతభీమ్రావు,తోడుసం గోవర్ధన్, సుంచు శ్రీనివాస్, సాకి లక్ష్మణ్,సూరపు సాయన్న, నాయకపోడు సంఘం అధ్యక్షులు పోత్తిండ్లశంకర్,మాజీ అధ్యక్షులు మొసలి చిన్నయ్య ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవి, కార్యదర్శి సతీష్, ఎల్లయ్య, పోతురాజ్ శ్రీనివాస్, భీమేష్, బొసిండ్ల రాజేశ్వర్, సూర్యభాను, ఉద్యోగ సంఘం నాయకులు కస్తూరి భీమేష్,సొండి శివ శంకర్, పుష్పార్ నరసయ్య, రాజుల నారాయణ,ఇతర ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కొత్త ప్రభాకర్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సహించేది లేదు

### ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్

**ప్రజాపక్షం/గజ్వేల్ :** దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దుబ్బాక ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొత్త ప్రభాకర్ రెడ్డిపై దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు స్పష్టం చేశారు. రెండు సార్లు ఎంపీగా, ప్రస్తుతం దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిచి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న ప్రభాకర్ రెడ్డి పట్ల ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని తెలిపారు. మెదక్ లో జరిగిన సభలో ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, రైతులకు నీళ్లు ఇవ్వకుంటే గేట్లు పగులగొట్టి నీళ్లు తీసుకెళ్తామని అనడంలో తప్పులేదని అన్నారు. జిల్లాలో మంత్రులుగా పని చేస్తున్న వారు నియోజకవర్గాలకు నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. గతంలో జిల్లా ఇన్చార్జి మంత్రిగా పని చేసిన వారిని తొలగించి తిరిగి కొత్త ఇన్చార్జి



మంత్రిని నియమించడంలో అంతర్యమేమిటని ఆయన నిలదీయగా, అది జీర్ణించుకొని శ్రీనివాస్ రెడ్డి దళిత మంత్రులను అవమానపరచాడంటూ కొత్త రాగం అందుకోవడం సిగ్గుచేటని చెప్పారు. అలాగే ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను బెదిరించే ధోరణితో మాట్లాడడం ఖండిస్తుండగా, దమ్ముంటే దళితులకు దళిత బంధు, బీసీలకు బీసీ బందు, రెడ్డిలకు రెడ్డి కార్పొరేషన్, పూర్తిస్థాయిలో రైతుబంధు అమలుకు సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడాలని, అంతేగాని ప్రజల కోసం మాట్లాడుతున్న కొత్త ప్రభాకర్ రెడ్డిని విమర్శిస్తే చూస్తూ ఊరుకునేది లేదని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బెండ మధు, టౌన్ అధ్యక్షులు నమాజ్ మీరా, మాజీ కౌన్సిలర్ బొగ్గుల చందు, నాయకులు గొడుగు స్వామి, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

# కెజిబివి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలి

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/టేక్మాల్ :** టేక్మాల్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాలని, అలాగే కేజీబీవీ విద్యార్థులను ఉత్తమ ఫలితాల కోసం సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలు, అటెండెన్స్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ప్రతిరోజు ఆసుపత్రికి వచ్చే పేషంట్ల సంఖ్య, అందుబాటులో ఉన్న సదుపాయాలపై ఆరా తీశారు. సాధ్యమైనంతవరకు సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని వైద్యులకు సూచించారు. అన్ని రకాల మందులు సమృద్ధిగా ఉండేలా చూడాలని, ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై విశ్వాసం పెంపొందించేలా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. తరువాత కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్, తరగతి గదులు, వంటగది, డార్మెటరీ, స్టోర్‌రూమ్‌ను తనిఖీ చేశారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులతో మాట్లాడి వారి అవసరాలు, సమస్యలు తెలుసుకున్నారు. స్టోర్‌రూమ్‌లోని కూరగాయలు, నిత్యావసర వస్తువుల నాణ్యతను పరిశీలించారు. పాఠశాల ప్రాంగణం పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని, విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థినుల అభ్యాస సామర్థ్యాలను మెరుగుపరచి ఉత్తమ ఫలితాల సాధనపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



**సోదర భావానికి ప్రతీక రాఖీ పండగ : కలెక్టర్**

టేక్మాల్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో శనివారం రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు. విద్యార్థినులు కలెక్టర్‌కు రాఖీ కట్టి, సాంప్రదాయపూర్వకంగా పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సోదర భావానికి ప్రతీకగా రాఖీ పండుగ నిలుస్తుంది. ఇది మన దేశ సంస్కృతి, సాంప్రదాయాల ప్రతిబింబం. సోదరీమణులు సోదరులకు రాఖీ కట్టి, వారి రక్షణ కోసం ప్రార్థించడం ఒక అందమైన సంప్రదాయం. ఈ పండుగ సమాజంలో సోదర భావం, ఐక్యతను పెంపొందించడానికి ఒక అద్భుతమైన అవకాశం అని అన్నారు.

# క్రీడ

## జింబాబ్వేపై న్యూజిలాండ్ భారీ విజయం



సుదీర్ఘ ఫార్మాట్‌లో న్యూజిలాండ్ భారీ విజయాన్ని నమోదు చేసింది. రెండో టెస్టులో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన కివీస్ ఆతిథ్య జింబాబ్వేను వణికిస్తూ ఇన్నింగ్స్ 369 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. బ్యాటర్ల వైఫల్యంతో తొలి ఇన్నింగ్స్‌లో 125కే కుప్పకూలిన ఆతిథ్య జట్టు రెండో ఇన్నింగ్స్‌లోనూ అంతకంటే తక్కువకే చతికిపడింది. రచిన్(165), కాన్వే (153), నికోల్స్(150) శతకాల మోతతో కుదేలైన జింబాబ్వేను కుర్ర స్పిన్నర్ జకరీ ఫౌల్క్(537) గట్టి దెబ్బకొట్టాడు. పేసర్ మ్యాట్ హెన్రీ (216) సైతం ఓ చేయి వేయడంతో శాంట్నర్ సేన జింబాబ్వేను వైట్ వాష్ చేసింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025–27లో న్యూజిలాండ్ జోరు కొనసాగుతోంది. తొలి టెస్టులో భారీ తేడాతో గెలుపొందిన కివీస్ రెండో మ్యాచ్‌లోనూ తిరుగులేని ఆటతో జింబాబ్వేను ఓడించింది. క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో న్యూజిలాండ్ బ్యాటర్లు సెంచరీతో విరుచుకుపడితే.. బౌలర్లు వికెట్ల పండుగతో ఆతిథ్య జట్టుకు ఘోరమైన పరాజయాన్ని అందించారు. మ్యాట్ హెన్రీ(540) విజృంభణతో తొలుత జింబాబ్వేను 125కే కట్టడి చేసిన కివీస్.. తొలి ఇన్నింగ్స్‌లో కొండంత స్కోర్ చేసింది. ఓపెనర్ డెవాన్ కాన్వే(153 ), హెన్రీ నికోలస్ (150), రచిన్ రవీంద్ర(165)లు సెంచరీలతో కదం తొక్కగా.. విల్ యంగ్(74) అర్ధ శతకంతో రాణించాడు. దాంతో, తొలి ఇన్నింగ్స్‌ను 601–3 వద్ద డిక్లేర్ చేసిన కివీస్.. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లోనూ ప్రత్యర్థి భరతం పట్టింది. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లతో జింబాబ్వే పతనాన్ని శాసించిన హెన్రీ రెండో ఇన్నింగ్స్‌లోనూ తన పేస్ పవర్ చూపిస్తూ ఆదిలోనే రెండు వికెట్లు పడగొట్టాడు. ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్ (0), బ్రెండన్ టేబెండన్ ఔట్ చేశాడు. ఆ తర్వాత కుర్రాడు జకరీ ఫౌల్కెస్ (5 37) బంతిని గింగిరాలు తిప్పుడూ జింబాబ్వే బ్యాటర్లను క్రీజులో నిలువనీయలేదు. అతడి స్పిన్‌కు బదులివ్వలేక మిడిలార్డర్ కుప్పకూలగా.. నిక్ వెల్చ్(47 నాటౌట్) మత్రం కాసేపు పోరాడాడు. కానీ, సహచరులు ఇలా వచ్చి అలా వెళ్లడంతో జింబాబ్వే తమ టెస్టు చరిత్రలో దారుణ ఓటమిని మూటగట్టుకుంది.

## రెండో టీ20లో 73కే టీమిండియా ఆలౌట్..



ఇంగ్లాండ్ పర్యటనలో చెలరేగిన అమ్మాయిలు ఆస్ట్రేలియా గడ్డపై మాత్రం తడబడుతున్నారు. వరుసగా రెండో టీ20లోనూ బ్యాటర్లు సమిష్టిగా విఫలమవ్వగా భారత ఏ జట్టు 73కే ఆలౌటయ్యింది. ఆస్ట్రేలియా ఏ బౌలర్ల ధాటికి నిలువలేక 144 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఓపెనర్ షఫాలీ వర్మ, కెప్టెన్ రాధా యాదవ్‌లు నిరాశపరచగా.. బృందా దినేశ్, మిన్ను మణిలు పోరాడినా భారీ ఓటమిని తప్పించలేకపోయారు. ఓపెనర్ల విధ్వంసానికి కిమ్ గార్త్ సంచలన బౌలింగ్‌తోడవ్వడంతో మరో మ్యాచ్ ఉండగానే సిరీస్ కైవసం చేసుకుంది. సిరీస్ సమం చేయాల్సిన మ్యాచ్‌లో భారత అమ్మాయిలు పంజా విసరలేకపోయారు. ప్రత్యర్థికి భారీ స్కోర్ సమర్పించుకొని.. ఒత్తిడికి లోనై వరుసగా డగౌట్ చేరారు. కిమ్ గార్త్ (47) అద్భుతమైన బౌలింగ్‌తో టీమిండియాను కోలుకోలేని దెబ్బ తీసింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆసీస్ నిర్ణీత ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 187 రన్స్ కొట్టింది. ఓపెనర్లు తహ్లియా విల్సన్(43), అలీసా హేలీ (70)లు తొలి వికెట్‌కు 95 పరుగుల భాగస్వామ్యంతో శుభారంభమిచ్చారు. ఆ తర్వాత కౌర్నే వెబ్(26 నాటౌట్), కెప్టెన్ నికోలీ ఫాల్టమ్ (8) ధనాధన్ ఆడగా ఆసీస్ ఏ జట్టు భారత్‌కు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన భారత ఏ జట్టుకు ఆదిలోనే షాకిచ్చింది కిమ్ గార్త్. డేంజరస్ ఓపెనర్ షఫాలీని ఔట్ చేసి ఒత్తిడిలో పడేసింది. ఉమా ఛెత్రీ సున్నాకే పెవిలియన్ చేరగా.. బృందా దినేశ్ (21) కాసేపు పోరాడింది. కానీ.. ఆమెకు సహకారం అందించేవాళ్లు కరువయ్యారు. గార్త్ జోరుకు మిడిలార్డర్ చేతులెత్తేయగా 15.1 ఓవర్ వద్ద 73 పరుగులకే టీమిండియా ఇన్నింగ్స్ ముగిసింది. నామమాత్రమైన మూడో టీ20 ఆదివారం జరుగనుంది.

## అమ్మకానికి 'లార్డ్స్' పిచ్

ప్రపంచంలోనే అత్యంత పురాతన క్రికెట్ మైదానం లార్డ్స్ క్రికెట్ స్టేడియం. ఈమైదానాన్ని మెరిల్బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసిసి) నిర్వహిస్తోంది. ఇక్కడ సెంచరీ చేస్తే క్రికెట్ ప్రపంచమంతా అభినందిస్తుంది. ఐదు వికెట్ల ప్రదర్శన చేస్తే టాప్ బౌలర్‌గా మారిపోవచ్చు. ఇటీవలే టీమిండియా కూడా లార్డ్స్ ఇంగ్లాండ్‌తో టెస్టు మ్యాచ్ ఆడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఎంసిసి కీలక నిర్ణయం తీసుకుంది. పిచ్‌తో పాటు మైదానం టర్ఫ్‌ను కూడా సేల్ చేసేందుకు రంగంసిద్ధం చేసింది. తొలుత లార్డ్స్ మెంబర్స్‌కు అవకాశం ఇచ్చింది. ఇప్పటికే ఈ విషయాన్ని సభ్యులకు తెలియజేసిం ది. తర్వాత సాధారణ క్రికెట్ అభిమానులకు ఛాన్స్ ఇవ్వనుంది. ఎంసిసికి 25 వేలమందికి పైగా సభ్యులు ఉన్నారు. అయితే, 1.2 మీటర్లు X 0.6 మీటర్ల సైజులో ఉండే టర్ఫ్ 50 యూరోల (రూ.5వేలు)కు విక్రయించనున్నారు. దీని ద్వారా వచ్చిన నిధుల్లో 10 శాతం ఎంసిసి ఫౌండేషన్‌కు వెళ్తాయి. మిగిలిన వాటితో లార్డ్స్ మౌలిక సదుపాయాల కోసం కేటాయించనున్నట్లు ఎంసిసి వెల్లడించింది. 'ఎంసిసి ఫౌండేషన్ కోసం, క్రికెట్ మైదానం భవిష్యత్తులో అభివృద్ధి కోసం ఫండ్స్‌ను సేకరించేందుకుఈ నిర్ణయం తీసుకున్నాం. ఎన్నో అద్భుతమైన మ్యాచులకు వేదికగా నిలిచిన మైదానం టర్ఫ్, పిచ్ కోసం పెద్ద ఎత్తున ఆసక్తి చూపిస్తారని భావిస్తున్నాం' అని ఎంసిసి వెల్లడించింది. మైదానమంతా కొత్తగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా పాత పచ్చికను తొలగించనున్నారు. 15 ఎంఎంతో ఉన్న టర్ఫ్‌ను తీసేసి.. మళ్లీ ఫ్రెష్ సర్ఫేస్‌ను పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సెప్టెంబర్ నుంచి ఆ కార్యక్రమం మొదలుకానుంది.

# ఫోకస్ బిజినెస్



## ట్రంప్ దూకుడు మార్కెట్లు బేజారు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు అంతర్జాతీయ మార్కెట్లను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రత్యేకించి సుంకాలను పెంచుతూ, ప్రపంచ స్టాక్ మార్కెట్లను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారు. తాజాగా, బంగ్లాదేశ్‌పై ట్రంప్ 20 శాతం అదనపు టారిఫ్‌ను ప్రకటించారు. దీనితో ప్రస్తుతం ఉన్న 16.5 శాతం సుంకాలు 36.5 శాతానికి పెరిగాయి. అనేక రోజుల పాటు సుదీర్ఘ సంభాషణల తర్వాత ఈ ఒప్పందం కుదిరినట్లు మీడియా తెలిపింది. బంగ్లాదేశ్ ప్రస్తుతం 8.2 బిలియన్ డాలర్లు విలువైన ఎగుమతులు చేస్తుండగా, అమెరికా నుండి బంగ్లాదేశ్‌కు 2 బిలియన్ డాలర్లు విలువైన సరుకు దిగుమతుల వ్యాపారం మాత్రమే జరుగుతున్నది. తాజా ఒప్పందం ప్రకారం అమెరికా నుండి ఎయిర్‌క్రాఫ్ట్‌లు, గోధుమలు, సోయాబీన్, కాటన్ దిగుమతులకు అంగీకరించింది. అంతేకాకుండా అమెరికా పాడి పరిశ్రమ ఉత్పత్తులు, మాంసం, కోళ్ళపరిశ్రమకు సంబంధించిన ఉత్పత్తులను భారీగా దిగుమతి చేసుకునేందుకు అంగీకరించింది. ఫారిన్ ఓనర్‌షిప్‌పై ఆంక్షలు ఎత్తివేసింది. పెట్టుబడుల అమోదాలకు పట్టువిడుపులు ప్రదర్శిస్తామని ప్రకటించింది. దీంతో బంగ్లాదేశ్‌లో స్థానికంగా ఉన్న వ్యవసాయ ఆధారిత వ్యాపారులు తీవ్ర సమస్యలు ఎదుర్కోనున్నారు. ఇలాంటి ఒప్పందానికి భారత్ అంగీకరించకపోవడంవల్లనే ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసి 25 శాతం భారీ సుంకాలు విధించారు. పాకిస్థాన్‌పై 19 శాతం సుంకాలు ట్రంప్ విధించారు. చైనా,భారత్ వంటి దేశాలతో పోల్చిచూస్తే ఈ సుంకాలు చాలా తక్కువ అని, చాలా న్యాయబద్ధమైన ఒప్పందం జరిగిందని బంగ్లాదేశ్ ఎగుమతిదారులు, ప్రభుత్వం సంతృప్తి వ్యక్తం చేస్తున్నది. "మీరు ఎంత సుంకం వేస్తే మేం అంతే సుంకం వసూలు చేస్తాం' అనే ట్రంప్ టిట్ ఫర్ టాట్ విధానానికి అనుగుణంగా ఈ సుంకాలు అమలులోకి వచ్చాయి. దీని ప్రకారం, గార్మెంట్ రంగంలో బంగ్లాదేశ్ 10 డాలర్లు ఖరీదైన షర్టు తయారీకి బంగ్లాదేశ్ గనుక 20 శాతం అమెరికా కాటన్ ఉపయోగిస్తే పరస్పర సమాన సుంకాల సూత్రం ప్రాతిపదికపై 20 శాతంలో బంగ్లాదేశ్ సరుకుకు ఎనిమిది డాలర్ల విలువకు మాత్రమే సుంకం వర్తిస్తుంది తప్ప పూర్తిగా 10 డాలర్ల షర్టు విలువకు సుంకం వర్తించదు. ఐతే బంగ్లాదేశ్‌కు చెందిన ఎగుమతిదారులు ఇప్పటికే 40 శాతం పైగా అమెరికా కాటన్‌ను గార్మెంట్స్ తయారీలో ఉపయోగిస్తున్నారు గనుక ఇదెంతో లాభదాయకమైన ఒప్పందంగా భావిస్తున్నారు. భవిష్యత్‌తో ఈ వినియోగం ఇంకా పెరుగుతుందని ఎగుమతిదారులు అంచనావేస్తున్నారు. ఇంకా భారీగా అమెరికా కాటన్ దిగుమతులకు, బంగ్లాదేశ్‌లో అమెరికా కాటన్ నిల్వలకు గోదాముల నిర్మాణానికి కూడా ఆ దేశంతో బంగ్లా ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. కొద్ది సంవత్సరాలక్రితం బంగ్లాదేశ్ నుండి అమెరికా 107 బిలియన్ డాలర్ల షర్టులు, ఇతర గార్మెంట్స్‌ను మాత్రమే దిగుమతి చేసుకునేది. కానీ అత్యధికమైన టారిఫ్ రేట్ల కారణంగా 2024లో ఈ దిగుమతులు 85 డాలర్లకు, తర్వాత ప్రస్తుతం 75 డాలర్లకు పడిపోయాయి. పరస్పర సమానస్థాయి సుంకాలకు ముందుగా అమెరికా విధించిన సుంకాలు సగటున 2.2 శాతంగా ఉండేవి, కానీ రాత్రికి రాత్రి ఈ సుంకాలు 20 శాతానికి పెరిగాయి. దీనివల్ల టారిఫ్‌ల భారం అంతిమంగా వినియోగదారులపైనే పడుతుంది. ఇప్పుడు అమెరికా గార్మెంట్స్ మార్కెట్ సర్‌ప్లస్‌లో ఉంది. ఓవర్‌ఫ్లో కారణంగా అనేక దేశాల వస్తువులు ఒకే చోట ఉండటంతో తీవ్ర పోటీ సమస్య ఏర్పడింది. మొత్తం మీద ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచ మార్కెట్లను పతనం వైపు నడిపిస్తున్నది. మదుపరులు బంగారం కొనుగోళ్లకు మొగ్గు చూపడంతో, బులియన్ మార్కెట్ కళకళలాడుతున్నది. ఈ వారం కూడా బంగారం ధరల పెరుగుద కొనసాగింది. ఈ ఒరవడికి తెరపడే అవకాశం ఇప్పట్లో లేదని మార్కెట్ నిపుణులు అంటున్నారు.

### ట్రంప్ సుంకాలు దేశాల వారీగా చూస్తే..

**10 శాతం చొప్పున..** ఫాక్లాండ్ దీవులు, బ్రెజిల్, యునైటెడ్ కింగ్‌డమ్

**15 శాతం చొప్పున...** అఫ్ఘనిస్థాన్, అంగోలా, బొలీవియా, బోట్స్వానా, కామెరూన్, కోస్టారికా, కోట్ డి ఐవోయిర్, కాంగో (డెమొక్రాటిక్ రిపబ్లిక్), ఈక్వెడార్, ఈక్వటోరియల్ గినియా, ఫిజి, ఘనా, గయానా, ఐస్‌లాండ్, ఇజ్రాయెల్, జపాన్, జోర్డాన్, లెసోతో, లీచ్టెన్‌స్టెయిన్, మడగాస్కర్, మలావి, మారిషస్, మొజాంబిక్, నమీబియా, నౌరు, న్యూజిలాండ్, నైజీరియా, ఉత్తర మాసిడోనియా, నార్వే, పాపువా న్యూగినియా, దక్షిణ కొరియా, వెనిజులా, జాంబియా, జింబాబ్వే, ఉగాండా, టర్కీ, ట్రినిడాడ్ అండ్ టొబాగో.(యూరోపియన్ యూనియన్: 15 శాతం కంటే ఎక్కువ సుంకం ఉన్న వస్తువులులపై అదనపు సుంకాలు లేవు. 15 శాతం కంటే తక్కువ సుంకాలు ఉన్న వస్తువులపై 15 శాతం).

**18 శాతం..** నికరాగ్వా

**19 శాతం చొప్పున..** మలేషియా, కంబోడియా, ఇండోనేషియా, థాయ్‌లాండ్, పాకిస్తాన్, ఫిలిప్పీన్స్.

**20 శాతం చొప్పున..** శ్రీలంక, వియత్నాం, తైవాన్.

**25 శాతం చొప్పున..** ట్యునీషియా, బ్రూనై, భారతదేశం, కజకిస్తాన్, మోల్డోవా.

**30 శాతం చొప్పున..** అల్జీరియా, బోస్నియా ,హెర్జెగోవినా, లిబియా, దక్షిణాఫ్రికా.

**35 శాతం చొప్పున..** ఇరాక్, సెర్బియా.

**36.5 శాతం..** బంగ్లాదేశ్

**39 శాతం..** స్విట్జర్లాండ్.

**40 శాతం చొప్పున..** లావోస్, మయన్మార్ (బర్మా).

**41 శాతం..** సిరియా.

**అత్యధికంగా 50 శాతం భారత్**

## రిజర్వేషన్లకు ప్రధాన అడ్డంకిగా కేంద్ర ప్రభుత్వం

### సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్ రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు చట్టం కాకుండా అడ్డుకుంటున్నది కేంద్రంలోపాలన చేస్తున్న బిజెపి పార్టీనే అని ఆత్మ కమిటీ చైర్మన్ , సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారుసిపిఐ కొరవి మండల కార్యవర్గ సమావేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో శాస్త్రీయ సర్వే నిర్వహించి అధిక జనాభా కలిగిన బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించికేంద్రానికి పంపినప్పటికీ, కుంటి సాకులు చెబుతూ, బిల్లుకు మోకాలడ్డుతూ బిసిలకు న్యాయంగా చెందాల్సిన 42 శాతం వాటాను అడ్డుకుంటున్న బిజెపికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు పార్టీ రాష్ట్ర మహాసభల గోడ పత్రాలను ఆవిష్కరించి ఈ నెల 20 నుండి 22 వరకు మేడ్చల్ జరిగే సిపిఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, బుర్ర సమ్మయ్య, తురక రమేష్, బుడమ వెంకన్న, కన్నే వెంకన్న. కలగూర నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## పల్లె రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- కొత్తగూ డెం శాసనసభ సభ్యుడు కూనంనేని సాంబశివరావు
- ప్రతి గ్రామానికీ పక్కా రహదారులు నిర్మించే దిశగా ప్రణాళిక
- రవాణా సౌకర్యం మెరుగుపడితేనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయి



**ప్రజాపక్షం/సుజాతనగర్ :** గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు ముమ్మరంగా రహదారుల నిర్మాణాలు చేపడుతున్నామని, రహదారుల నిర్మాణం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి అనతికాలంలోనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పంచాయతిరాజ్ రోడ్ల శాఖ రూ.1.80 కోట్ల నిధులతో మండలంలోని బేతంపూడి నుంచి నల్లవాగు మీదుగా నాన్యతాండా వరకు 2.50 కిలోమీటర్ల బిటి రోడ్డు పనులకు శనివారం కూనంనేని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన శంకుస్థాపన సభలో కూనంనేని మాట్లాడుతూ ప్రతి గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం కల్పించి రవాణా వ్యవస్థను మెరుగుపర్చడంతోపాటు గ్రామాలు, పట్టణాలను అనుసంధానం చేందుకు నిరంతర కృషి జరుగుతోందని, రవాణా సౌకర్యం మెరుగుపడితేనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయన్నారు. పంచాయతి రాజ్ శాఖా నుంచి నియోజకవర్గంలో 8.50 కిలోమీటర్ల రహదారుల నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరయ్యాయని త్వరలో పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. రహదారులతో పాటు ప్రజలకనీస అవసరాలైన విద్యుత్ సౌకర్యం, వైద్యం, డ్రైన్ల, తాగునీటి వసతి కల్పించేందుకు చేసిన కృషి ఫలితంగా ఇప్పటివరకు 80 శాతం మేర పనులు పూర్తికాగా, కొన్ని గ్రామాల్లో నిర్మాణదశలో ఉన్నాయన్నారు. త్వరలోనే నియోజకవర్గంలో సమస్యలులేని గ్రామాలు ఆవిష్కృతమవుతాయని, మునుపెన్నడూ లేని అభివృద్ధిని సాధించి చూపెడుతున్నామన్నారు.

నిర్మాణ పనుల్లో కచ్చితంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ప్రజల నుంచి ఫి ర్యాదులు అందితే ఉపేక్షించేదిలేదని దీనికి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. శంఖుస్థాపనికు వచ్చిన ఎమ్మెల్యే కూనంనేనిని శాలువా, పూలమాలలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, సొ సైటీ చైర్మన్ మండే హన్మంతరావు, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్యా దస్రు, మండల కార్యదర్శి కొమారి హన్మంతరావు, జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు తాళ్లూరి పాపారావు, ధర్మారావు, మూడు గణేష్, సిపిఐ నాయకులు కొమారి కృష్ణ, అనిల్, ఊకె నాగేశ్వరరావు, రఫీ, సక్రం, దండు సురేష్, కొమరయ్య, ఆకుల వెంకన్న, దొడ్డ వెంకన్న, ప్రభుత్వ శాఖల అధికారులు, మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాసంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ చేయలేదని కెటిఆర్ ప్రమాణం చేస్తారా?

### కెటిఆర్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్



**ప్రజాపక్షం/కరీంనగర్ :** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కేంద్ర హోంశాఖ సహా య మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బిఆర్‌ఎస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో తన ఫోన్‌తో పాటు రాష్ట్రం లో అనేక మంది ఫోన్లు ట్యాపింగ్ చేవారని ఆరోపించారు. ఈ సందర్భంగా కెటిఆర్‌కు కేంద్ర మంత్రి సవాల్ విసిరారు. ఫోన్ ట్యాపింగ్‌పై తడి బట్టలతో ప్రమా ణం చేసేందుకు నేను సిద్ధంగా ఉన్నాను.. కెటిఆర్ ఫోన్ ట్యాపింగ్ చేయించాడని నాకు తెలుసు.. నా కుటుంబం మొత్తాన్ని తీసుకొచ్చి ప్రమాణం చేయిస్తా.. ఏ గుడికి రమ్మంటారో టైమ్, డేట్ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రె స్, బిఆర్‌ఎస్ పార్టీలు నీకు నేను రక్ష.. నాకు నువ్వు రక్ష అని స్నేహంలో ఉన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను బిఆర్‌ఎస్ ప్రశ్నించడం లేదు. కెటిఆర్ సోదరి కవితనే తన ఫోన్ ట్యాపింగ్ అయ్యిందని చెప్పారు. ఇక, ఎస్‌ఐబి దేని కోసం పనిచేయాలి.. ఎస్‌ఐబి అనేది మావోయిస్టుల కదలికలపై పనిచేయా లి.. ప్రభాకర్‌రావును తీసుకొచ్చి ఎస్‌ఐబిలో పెట్టారని బండి సంజయ్ పేర్కొన్నా రు. ఇక ప్రభాకర్ రావు ఎవరని తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రం అడిగితే ఎస్‌ఐబి అని చెప్పకుండా ఐజి అని తప్పుడు సమాచారం ఇచ్చిందని ఆరోపించారు. కాగా ముంబై ఎన్నికల కోసం ఇక్కడి నుంచి డబ్బు పంపలేదా? అని ప్రశ్నించారు? అన్ని డబ్బు లు ఎక్కడి నుంచి వచ్చాయని అడిగారు.మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు బిఆర్‌ఎస్‌ను వదిలేసి బయటికి రావాలి. కాళేశ్వరం రిపోర్టు వ చ్చాక ప్రభుత్వం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సిట్ అధికారులకు నా దగ్గర ఉన్న ఆధారాలు ఇచ్చాను. సిట్ అదికారులు నిజాయితీ పరులు.. కానీ పరిమితులు తక్కువగా ఉన్నాయి. కానీ ప్రభుత్వంపై నమ్మకం లే దు. దాదాపు ఆరు వేలకు పైగా ఫోన్లు ట్యాపింగ్ అయ్యాయి. ఈ ఫోన్ ట్యాపింగ్‌పై సిబిఐ విచారణతో జరిపించాలి. అప్పుడే సమగ్రమైన నివేదిక వస్తుందని పేర్కొన్నారు.

## కొమరంభీం పోరాట స్ఫూర్తితో... ఆదివాసీలు ఉద్యమించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా
### సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా ఆదివాసీ దినోత్సవం

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** ఆదివాసీల హక్కుల పోరాట నీదుడు కొమరం భీం అని, ఆదివాసీల సంక్షేమ, వారి అభ్యున్నతికోసం తన తుదిశ్వాసవరకు పోరాడిన యోధుడు భీం అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిపిఐ, తెలంగాణ గిరిజన సమాఖ్య, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో కొమరంభీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ ఆదివాసీల జీవన విధానాన్ని గుర్తించి వారి అభ్యున్నతికోసం పాలకులు కృషి చేయాలనే ఉద్దేశంతోనే ఐక్యరాజ్య సమితి ఆగస్టు 9వ తేదీని ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా ప్రకటించిందని గుర్తుచేశారు. కొమరంభీం, మల్లుదొర, సమ్మక్క, సారక్క లాంటి ఎందరో ఆదివాసీ నాయకులు రాజంగం కల్పించిన చట్టాల, ఆదివాసీ హక్కుల అమలుకోసం ప్రాణత్యాగాలు చేశారని, పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికి ఆదివాసీలు అభివృద్ధికి నోచుకోవడం లేదని అన్నారు. జల్ జంగల్ జమీన్లపై ఆదివాసీలకే సంపూర్ణ హక్కులు ఉన్నాయని, ఆదిలాబాద్ జిల్లా జోడేఘాట్ కేంద్రంగా ఆదివాసీ ప్రజలను కూడగట్టి నిజం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి అమరుడైన ధీరుడు కొమరం భీం అని అయన సేవలను కొనియాడారు. ప్రపంచ వ్యాపితంగా ఆదివాసీలు ఇంకా అన్ని రంగాల్లో వెనుకబడి వున్నారని దీనికి పాలకుల నేరపూరిత నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. ఆదివాసీలు కలిసికట్టుగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్నారు. భీం పోరాట స్ఫూర్తిని కొనసాగించి గిరిజన చట్టాల అమలు, పరిరక్షణకోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, భూక్య దస్రు, కందుల భాస్కర్, జిల్లా సమితి సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు, భూక్య శ్రీనివాస్, ప్రజాసంఘాల నాయకులు పల్నాటి ప్రశాంత్, నర్సయ్య, బోయిన విజయ్ కుమార్, షాహీన్, విజయలక్ష్మి, బాణోత్ శ్రీనివాస్, రాజేశ్వర్ రావు, బాణోత్ చందర్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఆగస్టు 19 నుండి 22వ తేదీ వరకు మేడ్చల్ జిల్లాలో రాష్ట్ర నాలుగవ మహాసభలు



### సిపిఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్ రావు

**ప్రజాపక్షం/గండిపేట:** సిపిఐ తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలు ఆగస్టు 19 నుండి 22వ తేదీ వరకు మేడ్చల్ జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్‌లో జరుగుతున్నాయి.ఈ మహాసభ సందర్భంగా శనివారం రాజేంద్ర నగర్ మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన గోడ పత్రికను విడుదల చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్ రావు,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కన్యగారి నర్సింహ్మారెడ్డి హాజరై పార్టీ నాయకులతో కలిసి గోడ పత్రికను విడుదల చేశాడు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభల విజయవంతానికి సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు సిపిఐ పార్టీ రాష్ట్ర మహాసభల లో ప్రజా సమస్యలు రాజకీయ సమస్యలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక విధానాలపై సమగ్రంగా చర్చ చేసి విధివిధానాలను రూపొందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ మహాసభకు రాజేంద్ర నగర్ మండలం నుండి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.ఎ రియాజ్,సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు జె.ఆనంద్ గౌడ్,మండల సహాయ కార్యదర్శిలు జె.విజయానంద్ గౌడ్,ఎండి షఫీ,ఎర్రబోడు కార్యదర్శి పాండు,లక్ష్మిగూడ కార్యదర్శి జె.సదానంద గౌడ్,ఆఫీస్ కార్యదర్శి సత్యం,భారత జాతీయ మహిళా సమాఖ్య రాజేంద్రనగర్ మండల ప్రధాన కార్యదర్శి,జిల్లా ఉపాధ్యక్షులు కన్యగారి లక్ష్మి,మహిళా సమైక్య సభ్యులు రేష్మ,తదితరులు పాల్గొన్నారు.

# స్థానికం



REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## గవర్నర్‌కు రాఖీ కట్టిన సేవికాసమితి కార్యకర్తలు

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర సేవికాసమితి కార్యకర్తలు శనివారం రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్ వర్మను కలిసి రాఖీ కట్టి మిఠాయి తినిపించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ కు చెందిన రాష్ట్ర సేవికాసమితి, ప్రాంత సంచాలిక డాక్టర్ అరుణ, ప్రాంత సహకార్యవాహిక భాస్కర లక్ష్మి , ప్రాంత సేవా ప్రముక్ ఉమ, ప్రాంత వ్యవస్థా ప్రముక్ అనిత, సికింద్రాబాద్ విభాగ్ కార్యవాహిక ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



## నేడు మండలంలో డిప్యూటీ సిఎం, మంత్రుల పర్యటన

సమ్మక్క సాగర్, దేవాదుల పంపు హౌస్ వద్ద ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన ములుగు జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/కన్నాయిగూడెం:**శనివారం ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం, సమ్మక్క సాగర్ బ్యారేజ్, దేవాదుల ప్రాజెక్టు ను సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం, సమ్మక్క సాగర్ బ్యారేజ్, దేవాదుల ప్రాజెక్టు ను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్ర మార్క, రాష్ట్ర నీటి పారుదల మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు మరియు భవనల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పశుసంవర్ధక, డెయిరీ డెవలప్మెంట్, క్రీడలు యువజన సర్వీసులు మరియు మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సమ్మక్క సాగర్ బ్యారేజ్, దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ కి సంబంధించిన పంపింగ్ స్టేషన్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారనీ, అనంతరం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై ఇంజనీర్లతో మంత్రులు సమీక్షను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు కన్నాయిగూడెం తహశీల్దార్ సయ్యద్ సర్వర్ పాషా, ఎంపిడివో సాజిదా బేగం, తదితర శాఖల మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మలేరియా డెంగీ దోమల నివారణకు చర్యలేవి ?

**ప్రజాపక్షం/మంగపేట:**పరిసరాల పరిశుభ్రతే దోమల నివారణకు మార్గమని డెంగీమలేరియా దోమల నిర్మూలనా కార్యక్రమములు గ్రామ గ్రామాన పెట్టాలని ప్రభుత్వ ఆరోగ్య శాఖ చెపుతుంటే ఏదో ఒక గ్రామాన చిన్నపాటి పోగ్రామ్ చేసి తుతూ మాత్రంగా వదిలించుకుంటున్న మండల ఆసుపత్రి ఆరోగ్య శాఖ ప్రతి యేటా జ్వరాల సీజన్ కావడంతో ముందు జాగ్రత్తగా ప్రతి గ్రామాన ముఖ్యంగా అటవీ దగ్గరలో ఉన్నా గ్రామాలలో దోమల నివారణ మందు (ఏసియం) స్ప్రేయింగ్ అనేది ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి చేయించాలి జిల్లా డిహెచ్ఎంఓ మండల వైద్య అధికారి ప్రత్యేక శ్రద్ద తీసుకోని ప్రతి ఊరిలో మలేరియా డెంగ్యూ దోమల నివారణకు చర్యల గురించి అవగాహనా కల్పించాలి. ప్రతి గ్రామంలో రక్తపు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించాలి. ఫీవర్ సీజన్ అయిపోయినంక ప్రజల ఇండ్లు గుల్ల అయినంక అందరూ నష్టపోయినంక క్యాంపులు దోమ తెరలు ఇస్తారు. ఎందుకు ఏదైనా ఒక ఊరిలో ఎదో ఒక వ్యాధితో ఒకరు మృతి చెందితే అట్టహాసంగా ఏదో జరగబోతున్నట్టుపై అధికారుల మెప్పు కోసం బ్లీచింగ్ పౌడర్ ఊరంతా చల్లి అందరూ చూడాలని ఆరోగ్య క్యాంపులు పెట్టి ఫొటోలు ఇచ్చి చెయ్యి దులుపుకుంటున్నారు. మండలంలో ముందు జాగ్రత్తగా జిల్లా ఆరోగ్య అధికారి చర్యలు తీసుకోని ఆరోగ్య కేంద్రంలో సరైన మందులు ఉండేలా గ్రామ గ్రామాన ఆరోగ్య క్యాంపులు మలేరియా డెంగ్యూ దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## దుప్పటి మొగిలికి సిరిమంజరి రత్న బిరుదు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**దుప్పటి మొగిలికి సిరిమంజరి రత్న ఐయస్ఓ గుర్తింపు పొందిన తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్య ంలో జాతీయ తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ లో శనివారం కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థా నిక భూపాలపల్లికి చెందిన ఉపాధ్యాయుడు, కవి దుప్పటి మొగిలికి సిరిమంజరి రత్న బిరుదుతో ఘనంగా సత్కరించారు. నూతన కవితా ప్రక్రియ అయినా సిరిమంజరిలో దుప్పటి మొగిలి రచించిన అర్ధ శతకం కు గాను సిరిమంజరి రత్న బిరుదు ప్రధానం చేయడం జరిగిందని ఆ సంస్థ సిఇఓ యంవి రత్నం తెలిపారు. సిరిమంజరిలో ఆయన చేసిన విశేష రచనా సంపుటిని గుర్తిస్తూ ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ సిఇఒ ఎం.వి. రత్నం, ప్రోగ్రాం డైరెక్టర్ ధనసి ఉషారాణి, వైరాగ్యం ప్రభాకర్ దుప్పటి మొగిలి కి మెమోంటో, సర్టిఫికెట్ అందించి శాలువ తో స త్కరించారు.కార్యక్రమంలోపాల్గొన్న కవుల కవితా గానం ఆకట్టుకున్నాయి.

## ఘనంగా ప్రపంచ ఆదివాసీల దినోత్సవం



**ప్రజాపక్షం/వాజేడు:**ములుగు జిల్లా వాజేడు మండలంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఆదివాసీలు అత్యంత ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని పూసూరు, పేరూరు, చెరుకూరు, గర్రెగూడెం, పెనుగోలు తో పాటు మండల కేంద్రంలో ఆదివాసి జెండాను ఎగురవేసి జై ఆదివాసి అని నినాదాలు చేశారు. అదేవిధంగా వాజేడు మండల కేంద్రంలో కొమరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆదివాసుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నాయకులు దెబ్బకట్ల లక్ష్మయ్య, ఎట్టి విద్యాసాగర్, చింతామోహన్, ఎట్టి రాంభూపతి, గౌరీ బోయిన శ్రీకాంత్, బోదబోయిన సురేష్, తల్లడి నాన్న బాబు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల నిర్మాణానికి పెట్టుబడి కష్టాలు

పేదలకు ఇందిరమ్మ ఇండ్ల ఇక్కట్లు

ఆర్థిక స్థోమత లేక ఇబ్బందిపడుతున్న లబ్ధిదారులు



**ప్రజాపక్షం/హనుమకొండ :** రాష్ట్ర ప్రభుత్వం పేదవారి కోసం అందిస్తున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి పెట్టుబడి కష్టాలు ఎదురవుతున్నాయి. వరంగల్, హనుమకొండ జిల్లాలలో మొదటి విడత ఇళ్లు మంజూరు చేసి దాదాపు ఐదు నెలలు గడిచినా అనేక మంది నిర్మాణ పనులను ఇంకా ప్రారంభించ లేదు. కొందరు పిల్లర్ల వరకు నిర్మాణం పూర్తి చేసుకొని డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో మరి కొందరు పాత ఇళ్లను తొలగించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం నుంచి డబ్బులు మంజూరు కావాలంటే ముందు లబ్ధిదారులు సొంత ఖర్చుతో బేస్మెంట్ పిల్లర్ల వరకు నిర్మించాలి. ఇందుకోసం దాదాపు రూ.60వేల నుంచి రూ.70వేలకు పైగా ఖర్చు అవుతోంది. అంత మొత్తం పెట్టుబడి పెట్టేందుకు ఆర్థిక స్థో మత లేక కొందరు పనులను ప్రారంభించలేకపోతున్నా రు. ఈ కారణంగా హనుమకొండ జిల్లాలో సుమారు 2 500 మంది, వరంగల్ జిల్లాలో దాదాపు 2,700 మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టలేదని అధికారులు చెబుతున్నారు.రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి 35 00 చొప్పున ఎమ్మెల్యేలకు ఇందిరమ్మ ఇండ్లను కేటాయి ంచగా నేటికి ప్రారంభం కానివే ఎక్కువగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.సకాలంలో ఇండ్ల నిర్మాణం ప్రా రంభించకపోతే వేరే వారికి కేటాయిస్తామని చెబుతు ండడంతోపెట్టుబడిలేకలబ్ధిదారులు దిక్కులు చూస్తున్నారు

**ప్రస్తుత వర్షాకాలంలో ఇబ్బంది..**

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో తాము నివసిస్తున్న పాత ఇంటిని కూల్చివేసి కొత్త ఇంటిని నిర్మించుకోవడానికి లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. ఎందుకంటే ఇంటి నిర్మాణం పూర్తయ్యేందుకు కనీసం ఆరు, ఏడు నెలలు సమయం పడుతుందని, అప్పటి వరకు తాము ఎక్కడ నివసించాలని ప్రశ్నిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఇండ్లు అద్దెకు దొరికినా కూడా తాము సొంతంగా ఇం టిని కట్టడానికి తమకు అంత ఆర్థిక స్థోమత లేదని వా పోతున్నారు. ఇక పోతే గ్రామీణ ప్రాంతాల్లో అద్దెకు ఇ ల్లు దొరకడం కష్టమని లబ్ధిదారులు చెబుతున్నారు. హనుమకొండ,వరంగల్ జిల్లాల వ్యాప్తంగా మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ప్రొసిడింగ్ కాపీ లు ఇచ్చారు. అందులో వరంగల్ జిల్లాలో గ్రౌండింగ్ లెవెల్ 4974 ఇళ్లు పూర్తి కాగా వాటిలో బేస్మెంట్ లెవల్ 1508 పూర్తి అయ్యాయి. రూఫ్ లెవల్ వరకు 80 ఇళ్లు పూర్తి కాగా, లెవల్ వరకు 7 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన 3,718 ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాలేదు. హనుమకొండ జిల్లాలో దాదాపుగా 2500 పైగా ఇండ్ల నిర్మాణం ప్రారంభం కావాల్సి ఉందని చెబుతున్నారు.

**నిర్మాణానికి రుణ సదుపాయం కల్పించాలి**

ఇంటి నిర్మాణం ప్రారంభించేందుకు ప్రభుత్వం రుణ సదుపాయం కల్పించాలని పలువురు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మొదట సొం త డబ్బుతో బేస్మెంట్ నిర్మించుకుంటే ప్రభుత్వం వారి ఖాతాలో రూ. 1 లక్ష తక్షమే జమ అవుతాయని, ఆ త రువాత దశల వారీగా పైకప్పు స్థాయి వరకు నిర్మించుకు ంటే వెంట వెంటనే వారి ఖాతాల్లో డబ్బు అమ చేస్తామ ని అధికారులు చెబుతున్నారు. కానీ ముందస్తుగా డబ్బు ఖర్చు పెట్టలేని లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి ఇబ్బం ది పడుతున్నారు.

**మహిళా సంఘాల ద్వారా అప్పుకు అవకాశం**

ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునేందుకు లబ్ధిదారుల వద్ద డబ్బులు లేకుంటే మహిళా సంఘాల ద్వారా అప్పు తీసుకునే వెసులుబాటు కల్పిం చామని, ఈ విషయంపై ఆ యా సంఘాలకు ఇప్పటికే సూచనలు ఇచ్చామని మరోవైపు అధికారులు చెబుతున్నారు. అయినా కూడా ఇల్లు నిర్మించుకునేందుకు ముందుకు రాకపోతే వారి స్థాన ంలో మరొకరికి కేటాయిస్తామంటున్నారు. ఉచితంగా ఇసుక అందజేయడానికి కమిటీలు వేశామని కమిటీ ని ర్ణయం రావడంతోనే ఉచితంగా ఇసుక అందజేస్తాం కా బట్టిఇల్లునిర్మించుకొని లబ్ధి పొందాలని సూచిస్తున్నారు.

## ఆత్మీయ బంధానికి ప్రతీక రక్షాబంధన్

ఎమ్మెల్యే కు రాఖీ కట్టిన మహిళా కార్యకర్తలు

రక్షాబంధన్ వేడుకల్లో ప్రముఖులు



**ప్రజాపక్షం/భూపాలపల్లి:**అన్న తమ్ముల అక్క చెల్లెళ్ల ఆత్మీయ బంధానికి ప్రతీక రక్షాబంధన్ అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కొనియాడారు. శనివారం రాఖీ పౌర్ణమి సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా కార్యకర్తలు రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే కు రాఖీ కట్టి వేడుకలు నిర్వహించారు. జిల్లా కేంద్రం లోని 30 వార్డులతో పాటు జిల్లా లోని 12 మండలాలతో పాటు భూపాలపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అన్నతమ్ముల అక్కచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీక రక్షబంధన్ నిలుస్తుందని ఆయన కొనియాడారు. సందర్భంగా నియోజకవర్గ అన్నాచెల్లెళ్లకు అక్క తమ్ములకు ప్రజలకు ఎమ్మెల్యే రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భూపాలపల్లి మున్సిపల్ మాజీ చైర్పర్సన్ ఎస్.వెంకట రాణి సిద్దు రాఖీ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. వారి కుటుంబాలు రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోతుకు ప్రవీణ్ కుమార్ రక్షాబంధన్ సందర్భంగా సోదరి మనులకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఇంట్లో తన సోదరీలు రాఖి కట్టారు. రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. రక్షాబంధన్ వేడుకల సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ లో జనాలతో కిటకిటలాడుతూ పండగ వాతావరణం సంతరించుకుంది. బస్సులన్నీ కిటకిటలాడుతూ ప్రయాణికులు బస్టాండ్లలో జనసంద్రంగా మారింది. మొత్తంగా రాఖీ పండుగ వేడుకలు జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి.

## రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ఆత్మీయ అనుబంధానికి ప్రతీక రక్షా బంధన్

**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్:** స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లి, ఘన్‌పూర్, చాగల్లు గ్రామాల్లో రక్షా బంధన్ పండుగ సందర్భంగా ప్రతీ ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. బస్టాండ్ ప్రాంతం, రైల్వే స్టేషన్ ప్రధాన రహదారిలో జన సందోహం కనిపించింది. అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమి పండుగను ప్రతీ ఇంట్లో సంబురంగా జరుపుకుంటారు.

అక్కా తముడు, అన్నా చెల్లెలు అనుబంధానికి ప్రతీక రక్షా బంధన్ అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఈ పండుగను కుటుంబ సభ్యులందరూ కలిసి సంతోషంగా నిర్వహించుకోవాలన్నారు. రక్షా బంధన్ సాంప్రదాయం భారతీయ జీవన ఔన్నత్యానికి నిదర్శనమని, ప్రజల్లో సోదరభావాన్ని మరింత పెంచుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని అందులో భాగంగా ప్రభుత్వ పథకాలన్నీ మహిళల పేరిట అమలు చేస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 గ్యాస్ సిలిండర్, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం అందచేస్తుందన్నారు. మహిళా సాధికారత కోసం రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడానికి డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలు, మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు, పెట్రోలు బంకులు, సోలార్ ప్లాంట్లు, డైరీ, పౌల్ట్రీ ఫామ్‌లు, రైస్ జిన్నింగ్ మిల్లులు ఏర్పాటుచేసి మహిళలను పారిశ్రామికంగా అభివృద్ధి సాధించేందుకు ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆడపడుచులకు రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఇంటింటా అన్నా చెల్లెళ్లతో రక్షాబంధన్ సందడి





**ప్రజాపక్షం/గూడూరు;**అన్నా చెల్లెల ప్రేమానురాగాలకు ప్రతికగా నువ్వు నాకు రక్ష నేను నీకు రక్ష పూర్వకాల సాంప్రదాయంగా వస్తున్న రాఖీ పండగా పర్వదినాన్ని పురస్కరించుకోని అన్న తమ్ముళ్లకు అక్క చెల్లెలు రాఖీలు కట్టి ఆశీర్వాదాలు తీసుకోవడంతో ఇంటీంటా పండుగ మండలంలోని ప్రతి గ్రామ గ్రామాన మహిళల కొలహాలతో ఇంటీంటా అక్క చెల్లెల సోదర భావంతో అన్నదమ్ములకు రాఖీలు కట్టేందుకు పుట్టింటికీ చేరుకోవడంతో ఇంటీంటా సందడి వాతావరణం నెలకోంది. రాఖీ పర్వదినం సందర్భంగా గూడూరు మండలం కేంద్రంలో పాటు 42 గ్రామపంచాయతీలో ఇంటింటా మహిళలు ప్రేమానురాగాలతో అన్న తమ్ముళ్లకు రాఖీలు కట్టి అక్కచెల్లెలు స్వీట్స్ తినించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.ప్రతి ఏటా పవిత్రంగా జరుపుకునే రాఖీ పండుగకు (శనివారం) ఉదయం నుంచి పుట్టింటికీ పెద్ద సంఖ్యలో మహిళలు రావడంతో బస్టాండ్ ముఖ్యకూడలి వద్ద బస్సులో రద్దీ కనిపించింది రాఖీ పండుగ సందర్భంగా పట్టణ ప్రాంతాల్లో ఉన్న సోదరులు సైతం పిల్లలకు చేరుకొని అక్కాచెల్లెళ్లతో రాఖీ కట్టించుకుని సంతోషం వ్యక్తిపరుస్తున్నారు.గురుకుల విద్యార్థులకు సెలవులు లేకపోవడంతో అన్నదమ్ములు పాఠశాలలకు వెళ్లి అక్క చెల్లెళ్లతో రాఖీలు కట్టించుకొన్న సందర్భంగా వారు పోందిన పోతిచెప్పలేదని పలువురు యువకులు అనందం వ్యక్తం చేశారు, రాఖీలు కట్టించుకున్న అన్న తమ్ముళ్లు ప్రేమానురాగాలతో వారికి తోచిన విధంగా నూతన వస్త్రాలను నగదు వంటి బహుమతులను అందించి ఆశీర్వాదం తీసుకోవడం రాఖీ పండుగకు ఒక ప్రత్యేకత సంతరించుకోవడం విశేషం

## చిట్యాల ఠాణాలో ఘనంగా రాఖీ వేడుకలు


స్థానిక ఎస్ఐ గన్నమనేని శ్రావణ్ కుమార్



**ప్రజాపక్షం/చిట్యాల:**రాఖి పండగ అనేది అన్న చెల్లెల అనురాగ బం ధమని స్థానిక ఎస్ఐగన్నమనేని శ్రవణ్ కుమార్ అన్నారు. చిట్యాల పో లీసు రక్షక నిలయంలో రాఖీ పండుగ సందర్భంగా స్థానిక ఎస్సై ఆ ధ్వర్యంలో శనివారం విధులు నిర్వహిస్తున్న మహిళ పోలీసు లు సో దరా భావంతో తమ తోటి పోలీస్ సిబ్బందికి రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. అనంతరం స్థానిక ఎస్సై గన్న మనేని శ్రావణ్ కుమార్ మా ట్లాడుతూ చిట్యాల మండల ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ,రాఖీ పండుగ అన్న చెల్లెల, అక్క తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా తెలుపుతూ, సోదర భావాన్ని పెంపొందిస్తూ రక్షణ విధి నిర్వహణలో తనతో పాటు 24 గంటలు డ్యూటీలో ఉంటున్న తన సిబ్బంది అందరూ ప్రజల పట్ల సోదరభావంతో ఉంటూ వారి రక్షణ లో ఎల్లపుడు ముందుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఎస్ఐ ఈశ్వరయ్య, ఏఎస్ఐ మధుసూదన్, హెడ్ కానిస్టేబుల్ చంద్రమౌళి, కానిస్టేబుల్స్ , మహిళా కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

## అడిగింది దొరకదు...ఇచ్చింది తీసుకో !

తరిగొప్పుల వైన్స్‌ల్లో ఓనర్ల హుకుం




**ప్రజాపక్షం/తరిగొప్పుల:** మండల కేంద్ర ంలో పేరుకి రెండు వైన్‌షాపులు ఉన్నా అడిగింది దొరకదు, నచ్చింది దొరకదు కానీ కొత్త బ్రాండ్ల పేర్లు మాత్రం ఎవరికి తెలవదు, కానీ ఇక్కడ వాళ్లు ఇచ్చింది మాత్రం తీసుకోవాలి. మందుబాబులు ఎన్ని గగ్గోలు పెట్టినా కూడా డోంట్ కేర్ మేము ఇచ్చింది తీసుకోవాలి ఎవరేం చెప్పినా మేము వినేదే లేదు.మీరు చేసుకునేది ఏం లేదని, పై అధికారుల అండదండలు ఉన్నాయని విర్రవీగుతున్నారు. మద్యం బాబులు తాగాలనుకున్న బ్రాండ్ వై న్స్‌షాపులలో లేవడం లేదు కానీ బెల్ట్ షాపులలో మాత్రం వారికి అనుకున్న అన్ని బ్రాం డ్లు మాత్రం సరఫరా చేస్తున్నారు. పేరుకే రెండు వైన్ షాపులు ఉన్నా అనుకున్న మద్య ం బ్రాండ్ దొరకక నానా అవస్థలు పడుతున్నారు. ఎక్సైజ్ అదికారులు కూడా కుమ్మక్కై వారికి నచ్చిన విధంగా వైన్‌షాప్ ఓనర్లకు అనుకూలంగా ఉంటూ మూడు పూవులు, ఆ రు కాయలుగా వారి మామూళ్లు తీసుకుంటున్నారని మండల ప్రజలు అనుకుంటున్నారని సమాచారం. వీరికి తోడు వైన్ షాప్ యజమానులు సైతం వారికి అండదండగా ఉ ం టూ నెలనెలా మామూళ్లు ముట్టచెప్పుకుం టూ మద్యం బాబులకు జేబులు చిల్లు పెట్టిస్తున్నారు. ఎవరు ఏం చేసినా అధికారులు మా అండదండలు ఉన్నాయని మేము నెలనెలా మామూళ్ల తోటే రెండు వైన్‌సాపులు నడిపిస్తున్నామని మీరు ఎవరు ఏం చేసినా ఎవరు కూ డా ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి కూడా చూడరని నిర్భయంగా తెలియజేస్తున్నారని మందుబాబులు తెలియజేస్తున్నారు. ఇప్పటికైనా స ంబంధిత అధికారులు స్పందించి మందుబాబులకు అన్ని విధాలుగా మద్యం అన్ని బ్రాం డ్లుఅందేవిధంగాచూడాలని కోరుతున్నారు.

## అన్ని విధాలుగా శాయంపేట అభివృద్ధి

రానున్న రోజుల్లో మోడల్ డివిజన్‌గా అభివృద్ధి

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ :** గ్రామీణ వాతావరణ నేపథ్యం కలిగిన 31 వ డివిజన్ ని గతపాలకులు నిర్లక్ష్యం చేశారని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.శనివారం శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య,నగర కమిషనర్ చౌహాత్ బాజ్ పాయ్ తో కలిసి రూ.90.50 లక్షలతో రైల్వే ట్రాక్ నుంచి పోచమ్మ ఆలయం వరకు అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఎమ్మెల్యే నాయిని ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో స్థానిక నాయకులు సమన్వయంతో నియోజకవర్గంలో గతంలో కంటే మెరుగైన అభివృద్ధి ఫలితాలను అందిస్తున్నామని తెలిపారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి మళ్లీ ఇప్పుడు ప్రజా ప్రభుత్వంలోనే జరుగుతుందని అన్నారు.శాయంపేట పోచమ్మ ఉత్సవాలకు ప్రత్యేక విశిష్టత ఉందని,ఉత్సవాల సమయంలో భక్తులకు అసౌకర్యాలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. పనులు నిర్ణీత సమయంలో ఉత్సవాల ముందుగానే అందించాలని ఆదేశించారు. ఈ కార్పొరేటర్ మామిండ్ల రాజు,డివిజన్ అధ్యక్షులు సురేందర్, నాయకులు సత్తు రమేష్,కృష్ణ,రవీందర్,రమేష్ ,సతీష్ తదితరులు పాల్గొన్నారు.



స్థానికం REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** మండలం లోని వివిధ గ్రామాలలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆర్థిక సహాయంను అందించారు. మండలంలోని మోటాపురం, మంగాపురంతండా, రాజేశ్వరపురం, నేలకొండపల్లి తదితర గ్రామాలలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయంను అందించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు మాట్లాడారు. మృతుల కుటుంబాలకు మంత్రి అండగా ఉంటారని పేర్కొన్నారు. బైరవునిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ను పరిశీలించారు. త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. మంత్రి శ్రీనివాసరెడ్డి చొరవతో పాలేరులో అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కొడాలి గోవిందరావు, శాఖమూరి రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూక్యా సీతా, ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, మట్టా దుర్గారెడ్డి, వెంకటేశ్వర్లు, వీరబాబు, ఉపేందర్, కడియాల నరేష్, మరికంటి రమేష్,పాల్గొన్నారు.

## పోరాడిన యోధుడు కొమరం భీమ్ ఆశయం కోసం పనిచేయాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** గిరిజన హక్కుల కోసం గిరిజనుల సమస్యలపై నిరంతరం పోరాడి న యోధుడు కొమరం భీమ్ అని ఆయన ఆశయం కోసం పని చేయటమే ఆయనకు ఇచ్చే నివాళి అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ అన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా సత్తుపల్లిలో కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆపరేషన్ కగార్ పేరుతో గిరిజన హక్కులను గిరిజనుల చట్టాలనుంచి అమాయకులైన గిరిజనులను హతమారుస్తుందని విమర్శించారు. అడవిని రక్షించాలంటే గిరి పుత్రులైన గిరిజనులు దేశం మూలవాసులైన గిరిజనులు అడవిలో ఉంటేనే వారి సంస్కృతి సాంప్రదాయాలు నిలబడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్, కాంగ్రెస్ నాయకులు గాదె చెన్నకేశవరావు, పూచి గోవర్ధన్, ధార భీమయ్య, గిరిజన సంఘం వీరస్వామి, శ్రీను, రాముడు, లింగయ్య, రాంబాబు, మాజీ ఎంపిటీసీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలి




**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆదివాసీల అభివృద్ధికి, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు సాధనపల్లి సతీష్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ సెంటర్‌లోని ఆదివాసీల నేతల విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఆదివాసీలపై అన్యాయాలు, అక్రమాలు, హత్యా చారాలు జరుగుతున్నాయని, వాటి నిలుపుదలకు కట్టుబడి ఉండాలన్నారు. 78 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఆదివాసీలు ఇంకా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో కొక్కురేని అశోక్, నారపోగు ఏసు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సిఐను సన్మానించిన సిపిఐ శ్రేణులు



**ప్రజాపక్షం/ ఇల్లందు :** ఇల్లందు పోలీస్ స్టేషన్‌లో నూతనంగా స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన తాటిపాముల సురేష్ కుమార్ గౌడ్‌ను ఇల్లందు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె. సారయ్య ఆధ్వర్యంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. సిఐ మాట్లాడుతూ సిపిఐ,ఏఐటియుసీలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలు ఉన్నారని , లా అండ్ ఆర్డర్‌కు సహకరించి తమ సహకారాన్ని అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్ బంధం నాగయ్య, పట్టణ, మండల కార్యదర్శులు బాస శ్రీనివాస్‌రావు, బొప్పిశెట్టి సత్యనారాయణ, బ్రాంచ్ కార్యదర్శి ఎండి. నజీర్ అహ్మద్, ఆకుల చందర్ రావు, నాదెండ్ల శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌కె. వలి తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/దమ్మపేట:** హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఆవరణలో విద్యార్థులు, అనుబంధ సంఘాల నాయకులు,ఆదివాసీ ప్రముఖులు ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొని అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలతో పాటు ఆదివాసి సోదర సోదరీమణుల సాంస్కృతిక సంపద, జీవన విధానం, సంప్రదాయాలపై హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆదివాసి సమాజ అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ నృత్యాలు పాటలతో కార్యక్రమాన్ని అలరించారు. ఆదివాసి హక్కుల పరిరక్షణలో ఎల్లప్పుడూ ముందుంటానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## సమన్వయంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

పోలీసు కమిషనర్ సునీల్‌దత్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నగరంలో ట్రాఫిక్ సమస్యను వ్యక్తిగత సంస్థలు, మున్సిపాల్ కార్పొరేషన్ అధికారుల సమన్వయంతో పరిష్కరించుకోవాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ట్రాఫిక్ పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు, వాహనదారులకు మెరుగైన సేవలందించేందుకు సిసి కెమెరాల విస్తరణతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ పై దృష్టిసారించాలన్నారు. రోడ్డు ప్రమాదాలకు కారణాలు దానికి ప్రతిస్పందన, జరిమానాల వసూలు, ట్రాఫిక్ పరికరాల నిర్వహణపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వాహనాల పార్కింగ్ స్థలాలు, వాటి నిర్వహణకు మున్సిపాల్ కార్పొరేషన్ అధికారులను సమన్వయం చేసుకుని గుర్తించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో స్వాధీనం చేసుకుని స్టేషన్ ఆవరణలో ఉంచిన వాహనాలను ఆయన పరిశీలించారు. ట్రాఫిక్ నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు వాటి పరిష్కారానికి చేపట్టవలసిన పద్ధతులపై ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ అధికారులతో సిపి చర్చించారు.

# అనుబంధాల పండుగ రాఖీ

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** భారతీయ సంస్కృతిలో రాఖీ పండుగకు విశిష్టమైన స్థానం ఉందని, అనుబందాల పండుగగా రాఖీ పండుగను జరుపుకోవడం మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు.౧ బ్రహ్మ కుమారి మటం, భారత జాతీయ మహిళా సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఎమ్మెల్యే నివాసం, శేషగిరిభవన్ లో శనివారం రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కూనంనేనికి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషాకు బ్రహ్మకుమారి మటం సభ్యులు, మహిళాసమాఖ్య కార్యకర్తలు రాఖీలు కట్టి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ శ్రావణమాసంలో వచ్చే విశిష్టమైన పండుగ రాఖీ పండుగని అన్నారు. ఈ పండుగకోసం తోబుట్టువులం తా ఏడాదంతా ఎదురుచూస్తుంటారని, వీది నిర్వహణలో ఎంత దూరం ఉన్నప్పటికి కుటుంబ సభ్యులందరిని ఒక్కటి చేసి కుటుంబ బాంధ్యవ్యాంన్ని, బందుత్వాన్ని గుర్తు చేస్తుందన్నారు. రాఖీ పండుగ మన సమాజంలో ప్రేమ, నమ్మకం, ర క్షణ అనే విలువలను గుర్తు చేసే పవిత్రమైన ఆ చారమని, సోదర, సోదరీమణుల బంధాన్ని మా త్రమే కాకుండా పరస్పర గౌరవం, మానవతా భా వన, సామాజిక ఐక్యతను బలపరుస్తుందన్నారు. ఈ సాంప్రదాయాన్ని కాపాడుకోవడం, యువతకు అందించడం మనందరి బాధ్యత, సోదరులు సోదరీమణుల రక్ష ణకే కాక, సమాజం మొత్తాని కి రక్ష కులుగా నివాలన్నారు. తనకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారి మటం సభ్యలకు, మహిళా సమా ఖ్య నాయకులకు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

## యూరియా కోసం రైతులు ధర్నా



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని చెన్నూరు సొసైటీ వద్ద మధిర టు కల్లూరు రహదారిపై చెన్నూరు వద్ద రోడ్డుపై రైతులు యూరియా కోసం శనివారం ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న కల్లూరు ఎస్ఐ హరిత వ్యవసాయ శాఖ అధికారిని రూప దగ్గరుండి సమన్వయంగా రైతులకు యూరియాను అందించారు. ఒక్కొక్క రైతుకు రెండు యూరియా కట్టలను అందించారు. చాలీచాలని యూరియాను రైతులకు అందిస్తున్నారని దీంతో సకాలంలో యూరియా పూర్తిస్థాయిలో అందించకపోవడం వలన రైతులు ఆగ్రహించి రోడ్డెక్కి నిరసన కార్యక్రమాన్ని ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రైతులు తెలిపారు. ఈ విషయమై పోలీస్‌లు, వ్యవసాయ శాఖ అధికారులు వారికి త్వరితగతిన రైతులందరికీ సరిపోను యూరియా అందిస్తామని అధికారులు వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు, చెన్నూరు, లింగాల, ఎర్రబోయినపల్లి, చంద్రుపట్ల, రఘునాధగూడెం తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజిని



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** రాష్ట్ర ప్రభుత్వ పథకాల పై క్షేత్ర స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజిని సూచించారు. యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు మండల కేంద్రంలో శనివారం నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. అనంతరం హస్పిటల్ లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావటానికి యూత్ కాంగ్రెస్ కీలకంగా పని చేసిందని అన్నారు. ప్రభుత్వం పై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారం ను తిప్పి కొట్టాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళు, రేషన్ కారులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యడవల్లి నాగరాజు, మారుతి కోటీ, గొలుసు పవన్, లంజపల్లి వీరబాబు, గుండు మహేష్, సాయినవీన్, కైలాసపు గోపి, షేక్ సొందు, అనంతు నాగేందర్బాబు, బచ్చలకూరి ప్రతాప్, అప్పన కార్తీక్, కడియాల నరేష్, కాసాని మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంలో ఆదివాసీలకు ప్రత్యేక స్థానం

ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు





**ప్రజాపక్షం/భద్రాచలం :** పచ్చని అడవులు, కొండకోనల్లో జీవనం సాగించే ఆదివాసీలకు ప్రపంచంలోనే ప్రత్యేక స్థానం ఉందని, మన పూర్వికులు పాటించిన ఆచార వ్యవహారాలను ముందుకు తీసుకెళుతూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుందామని శాసన సభ్యులు డా.తెల్లం వెంకట్రావు అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శనివారం భద్రాచలం పట్టణంలో ఘనంగా జరిగింది. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ఉన్న అల్లూరి సీతారామరాజు, గాంగ గంటం దొర, మల్లు దొర విగ్రహాలకు మాజీ ఎంపి మిడియం బాబూరావు, ఐటిడిఏ పిఓ రాహుల్, ఎపిఒ జనరల్ డేవిడ్ రాజ్, డిడి మణెమ్మతో కలిసి పూలల మాలలు వేసి నివాళ్లర్పించి ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసిన ఎంఎల్‌ఏ ర్యాలీగా వెళ్లి మార్కెట్ సెంటర్‌లో కొమరం భీమ్ విగ్రహాలకు సైతం పూల మాలలు వేశారు. అంబేద్కర్ సెంటర్‌లో కొయకొమ్ము నృత్యాలు, డప్పు వాయిధ్యాలు, నాయకపోడు లక్ష్మి దేవర కొలుపు, కొండరెడ్ల గిల్లి కాయల నృత్యం, పద్మశ్రీ శకనం రామచంద్రయ్య బృంధం మేళతాళాలు ప్రత్యేక ఆకర్ష ణగా నిలిచాయి. అనంతరం ఐటిడిఏ వరకు ర్యాలీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక సభలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట, ఐటిడిఇ పిఓ రాహుల్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన అనంతరం మహనీయులు చిత్రపటాలకు పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు, గాంగ గంటం దొర, మల్లు దొర, కొమరం భీమ్ వంటి వారు ఎందరో ప్రాణత్యాగాలు చేశారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ గిరిజనులకు సేవచేసే అదృష్టం రావడం ఆనందంగా ఉందన్నారు. ఐటిడిఏ పిఓ రాహుల్ మాట్లాడుతూ ఆదివాసీ పిల్లల విద్యాభి వృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఓ సున్నం రాంబాబు, ఏసిఎంఓ రమేష్ ఏటిడిఓ అశోక్, ఇఇ హరీష్, ఏడి భాస్కర్, అర్‌సిడి అరుణ, జిసిసి డిఎం సమ్మయ్యతో పాటు ఉదయ్, లక్ష్మి నారాయణ, అలివేలుమంగతాయారు, వేణు, ప్రభాకర్, హరికృష్ణ, గిరిజన సంఘాల నాయకులు ముర్ల రమేష్, పూనెం కృష్ణ, పాయం రవివర్మ, శరత్, మురళీ, పుల్లయ్య, వీరస్వామి, సుధారాణి, అరుణ, వెంకట్రావు, వీరభద్రం, వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన గిరిజన సంఘాల నాయకులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రాలకు చింతకాయలు రాలవు : డిఎస్‌పి చంద్రభాను




**ప్రజాపక్షం/ ఇల్లందు :** మూడనమ్మకాల నెపంతో గ్రామస్తులు చేసిన హత్యపై సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ స్టేషన్ సిఐ బత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి డిఎస్‌పి చంద్రభాను హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఆధునిక కాలంలోనూ పలు మారుమూల గిరిజన గ్రామాలలో మూడనమ్మకాలతో హత్యలు చేస్తూనే ఉన్నారు. మంత్రాలకు చింతకాయలు రాలుతాయా..? ఇది మన పెద్దలు తరచూ వాడే మాట. వెనుకటి కాలంలో కొంత మంది హేతువాదులు, మంత్రాలు తంత్రాల మీద నమ్మకం లేని వారి నోటి నుండి పుట్టిన మాటతే కావచ్చు . ఇది చెట్టుమీద ఉన్న చింతకాయలు కావాలంటే చెట్టెక్కి కొసుకోవడమో,పెద్ద గడ పెట్టి కోయడమో చేయాలని కానీ, చెట్టు కిందకు వెళ్లి చింతకాయలను చూస్తూ మంత్రం పఠిస్తే అవి రాలవు కదా..? అని దీనిలో భావం. ఒక మనిషిమీద అనుమానం వచ్చిందంటే జీవితాంతం ఉంటుందనే మాటను సార్థకం చేశారు. గ్రామస్తులు తమ గ్రామంలో చేతబడి చేశారనే నెపంతో ఒకరిని చెట్టుకు కట్టేసి చింతకాయల్లా బాదారు. అంతేకాదు ఆ చేతబడి ఎందుకు చేశారని ప్రశ్నించిన ఆ వ్యక్తి సమాధానం చెప్పకపోవడంతో నిజాన్ని ఒప్పుకోవాలని చితక కొట్టారు. అసలు విషయం అక్కడ కామెర్లతో యువతి మృతి చెందగా కానీ గ్రామస్తులు చేతబడి చేశారనేఅనుమానంతో ఆ యువకుడిని కొట్టి చంపిన గ్రామస్తులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలంలోని ఈ నెల 6వ తేదీన 8 గంటలకు దారుణం చోటు చేసుకుంది. గుత్తి కోయ కుటుంబాలు ఉంటున్న బస్తాయి గ్రామంలో మంత్రాల నెపంతో మడకం బీడ (అలియాస్) రాజు (35)ను గ్రామస్తులు కర్రలతో దాడి చేసి కొట్టడంతో మృతి చెందాడు. గ్రామంలో రెండు రోజుల క్రితం ఒక మహిళా మృతి చెందడం, రాజు మంత్రాలు చేయడంతోనే మృతి చెందిందనే అనుమానంతో కొందరు గ్రామస్తులు కొట్టి చంపారు. మూఢ నమ్మకాలపై ప్రభుత్వం పలు విజ్ఞాన వేదికలు స్వచ్ఛంద సంస్థలు పోలీసులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన గ్రామాల్లో మారుమూల ప్రాంతాల్లో ఇంకా అమానుష ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలంలో భూసరాయి గ్రామంలో గంగి అనే విద్యార్థిని పదవ తరగతి చదువుతుంది. ఆమె కామెర్లతో బాధపడుతూ చికిత్స పొందుతుంది. రోజులు గడుస్తున్న కామెర్లు ముదిరిపోతున్నాయి తప్ప తగ్గడం లేదు. చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం మృతి చెందింది. రాజు చేతబడి చేశాడు..కావునా యువతి ఎంత ఖర్చు పెట్టినా బతకలేదని కొందరు అనుమానించారు. చేతబడి చేశాడనేఅనుమానంతో బాలికకు సంబంధించి ఏడుగురు బంధువులు కలిసి రాజును చితక బాదారు. తీవ్రంగా గాయపరిచారు. దెబ్బలు బాగా తగలడంతో రాజు చని పోయాడు. మృతదేహాన్ని బసురాయి గుట్టలలో పడవేశారు. పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి అక్కడి నుండి మృత దేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమర్టం కోసం ఇల్లందుకు తరలించారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అనారోగ్యంతో మృతి చెందిన ఆ యువతి అంత్యక్రియలు చేసిన ప్రదేశంలోనే రాజుని హాతమార్చడంతో గ్రామస్తులతో కలిసి పోలీసులు గుట్టల్లో, అడవుల్లో ఆరు కిలోమీటర్ల మేర నడుచుకుంటూవెళ్లి మృతదేహాన్ని డోలికి కట్టి తీసుకువచ్చారు. ఈ కా ర్యక్రమంలో ఆళ్లపల్లి ఎస్ఐ సోమేశ్వర్,పోలీస్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే రాగమయి




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఆదివాసిలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్ అన్నారు. ఆదివాసుల దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలో జరిగిన ఆదివాసి దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే రాగమయి, రాష్ట్ర నాయకుడు డా. మట్టా దయానంద్‌లు ముఖ్య అతిదులుగా హాజరై కొమురం భీమ్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లలో ఆదివాసీలకు ప్రాదాన్యత కల్పించామన్నారు. ఆదివాసి బిడ్డలందరికీ తెలంగాణ రాష్ట్ర ఇందిరమ్మ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మా గెలుపులో ఆదివాసీ బిడ్డలు పాత్ర కీలకమన్నారు. వారు మాపై పెట్టుకున్న నమ్మకానికి తప్పకుండా వారికి న్యాయం చేస్తామన్నారు. ప్రభుత్వం, మా నుంచి ఆదివాసి బిడ్డలకు కావాల్సిన అన్ని సౌకర్యాలు సమకూరుస్తామని తెలియజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు శివ వేణు, పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరా వు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, ఆదివాసీ నాయకులు ఇరపా కృష్ణారావు, కాంగ్రెస్ నాయకులు కమల్ పాషా, ఆంగోతు రా మారావు, టోపీ శ్రీను, కుమారి, సుజలరాణి, పింగుల సామ్యూల్ తదితరులున్నారు.

# 'ఆశ్రమ'లో పంతుళ్ల బాధ్యతారాహిత్యం!

గొందిగూడెం ఆశ్రమ ఉపాధ్యాయుల నిర్వాకం
ఖాళీగా దర్శనమిస్తున్న గృహ సముదాయాలు





**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండలంలోని గొందిగూడెం ఆశ్రమ పాఠశాలలో ఒక్కొక్కటిగా వసతి గృహం, విద్య, ఉద్యోగం లాంటి వాటిపై అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ ఆశ్రమ పాఠశాలలో సుమారు 14 మంది రెగ్యులర్ ఉపాధ్యాయులుగా ఇద్దరు డిప్యూటేషన్ మీద, ఒక్కరు రెగ్యులర్ వంట పని వారుగా ముగ్గురు తాత్కాలిక పద్ధతిలో నియమింపబడ్డ వంట పని వారు మొత్తంగా ఇక్కడ ఈ ఆశ్రమ పాఠశాల హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఈ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న వారికి ప్రభుత్వం గతంలో సుమారు కోట్ల రూపాయలతో గృహ సముదాయాలు ఏర్పాటు చేశారు. గిరిజన విద్యకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఉపాధ్యాయ సిబ్బందిని నియమించి అదనంగా సీఆర్టీలుగా ఉపాధ్యాయులను నియమించి గిరిజన విద్యను గాడిలో పెడుతున్న ఐటిడిఏ, రాష్ట్ర ప్రభుత్వం. అయితే ఈ పాఠశాలలో విధులు నిర్వహించాల్సిన ఉపాధ్యాయులు ఆ గృహ సముదాయాల్లో ఉండి విద్యార్థులను విద్యకు కావలసిన వస్తువులను వనరులను కల్పించి వారిని వారి విద్యను గాడిలో పెట్టే విధంగా ప్రతిక్షణం పర్యవేక్షిస్తూ ఉండాలి. కానీ ప్రభుత్వ ఉపాధ్యాయులంతా ఇక్కడ గృహ సముదాయాల్లో నివసించకుండా వేరే గ్రామాల నుండి ఇక్కడకు నిత్యం వాహనాలపై రాకపోకలు కొనసాగిస్తున్నారు కానీ ఒక వేళ గృహ సముదాయాలు సరిపడకపోయినా ఉపాధ్యాయులు పాఠశాలకు సంబంధించిన గ్రామంలోనే నివసిస్తూ , నిత్యం విద్యార్థులకు అందుబాటులో ఉండాలని కానీ ఈ హాస్టల్ పరిధిలో ఉన్న ఆశ్రమ హాస్టల్ పరిధిలో ఉన్న ఉపాధ్యాయులు ఒక్కరి ఇద్దరు మినహా వారి బాధ్యతలను నిర్వర్తించడం లేదు. సాయంత్రం అయితే అదనపు తరగతులను నిర్వహించేటప్పుడు రెగ్యులర్ ఉపాధ్యాయుడు కాకుండా సిఆర్పిలతో అదనపు తగరతులు నిర్వహించి 10వ తరగతి విద్యార్థులకు అందుబాటులో ఉండటం లేదదనే సమాచారం. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులంతా నెలకొకసారి విందు వినోదాలతో గడుపుతారని విద్యార్థుల ద్వారా అందిన సమాచారం. గతంలో ఇదే పాఠశాలలో ఉపాధ్యాయులంతా విందు వినోదాలతో విద్యార్థులను పట్టించుకోకపోవడం వల్ల విద్యార్థులు చనిపోయాన దాఖాలాలు, తలలు పగిలిన దాఖలాలు లాంటివి ఉన్నాయి. కానీ ఈ ఉపాధ్యాయులంతా విద్యను పక్కకు పెట్టి వారి వారి వ్యాపార సముదాయాలను నిర్వహించుకుంటున్నారు. వాటిపై పాఠశాల నిర్వహణ సమయంలో చరవాణిల ద్వారా నిత్యం వ్యాపార విశేషాలు మాత్రమే మాట్లాడుతూ ఉద్యోగాన్ని కాలక్షేపంగా విద్యను నిర్లక్ష్యం చేస్తూ వేతనాలు తీసుకుంటున్నారు. తరగతులు బోధన నిర్వహణపై కూడా ప్రధానోపాధ్యాయుల లోపం ఉందని లేక పోలేదు. ఉపాధ్యాయుల బోధన తీరులో కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం బోధించడం లేదని, అయినా కూడా వీరికి ఇంటి అద్దె భత్యాలు అదనపు అద్దె భత్యాలు ప్రభుత్వం చెల్లిస్తూ సుమారుగా నెలకు లక్షల్లో జీతాలు ఇస్తున్న ఉపాధ్యాయులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ గిరిజన విద్యకు తూట్లు పొడుస్తున్నారు. ఇన్ని అక్రమాలు జరుగుతున్న అధికారులు, ఏసీబీ, విజిలెన్స్ దాడులు జరిగితేనే ఇంకా ఇక్కడ జరుగుతున్నఅక్రమాలు వెలుగులోకి వస్తాయని విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు కోరుతున్నారు.

# రీల్

## నేను ఫెడరేషన్ వ్యక్తులను కలవలేదు

### చిరంజీవి వివరణ




రేడియేషన్‌కు సంబంధించిన వ్యక్తులను చిరంజీవి కలిశారని మీడియాలో వస్తున్న వార్తలను చిరంజీవి ఖండించారు. ఈ మేరకు చిరంజీవి ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. నా దృష్టికి వచ్చిన విషయం ఏమిటంటే ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులమని చెప్పుకుంటున్న కొంతమంది వ్యక్తులు మీడియాలోకి వెళ్లి, నేను వారిని కలిసి, 30% వేతన పెంపు వంటి వారి డిమాండ్లను అంగీకరించానని తప్పుడు ప్రకటనలు చేశారు. ఈ సందర్భంలో నిజం ఏంటో స్పష్టంగా చెప్పదలచుకున్నాను. నేను ఫెడరేషన్‌కి చెందిన ఎవరినీ కలవలేదు. ఇది పరిశ్రమ మొత్తానికి సంబంధించిన విషయం. ఏ వ్యక్తిగతంగా అయినా, నేను సహా, ఏకపక్షంగా ఇలాంటి సమస్యలకు హామీ ఇవ్వడం లేదా పరిష్కారం చూపడం సాధ్యం కాదు. తెలుగు చిత్ర పరిశ్రమలో ఫిల్మ్ ఛాంబర్‌నే అగ్ర సంస్థ. అన్ని వర్గాలతో చర్చలు జరిపి న్యాయసమ్మతమైన పరిష్కారానికి రావడం ఫిల్మ్ ఛాంబర్ సమిష్టి బాధ్యత. అంతవరకు, అన్ని పక్షాల్లో గందరగోళం సృష్టించే ఉద్దేశ్యంతో చేసిన ఇలాంటి నిరాధారమైన, ప్రేరేపిత ప్రకటనలను నేను ఖండిస్తున్నాను అని చిరంజీవి పేర్కొన్నారు.

## కానిస్టేబుల్ కనకం ట్రైలర్ విడుదల



వర్ష బొల్లమ్మ టైటిల్ రోల్‌లో నటించిన యాక్షన్ థ్రిల్లర్ కానిస్టేబుల్ కనకం. ప్రశాంత్‌కుమార్ దిమ్మల దర్శకత్వంలో కోవెలమూడి సత్య సాయి బాబా, వేమూరి హేమంత్ కుమార్ నిర్మించారు. మేఘ లేఖ, రాజీవ్ కనకాల, శ్రీనివాస్ అవసరాల కీలక పాత్రలు పోషించారు. ఆగస్ట్ 14 నుంచి ఈ సిరిస్ ఈటీవి విన్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి కానిస్టేబుల్ కనకం ట్రైలర్‌ని లాంచ్ చేసి యూనిట్‌కి ఆల్ ది బెస్ట్ చెప్పారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరోయిన్ వర్ష బొల్లమ్మ మాట్లాడుతూ ట్రైలర్‌ని లాంచ్ చేసిన మెగాస్టార్ చిరంజీవి గారికి ధన్యవాదాలు. డైరెక్టర్ ప్రశాంత్ ఈ సిరీస్‌ని చాలా అద్భుతంగా తెరకెక్కించారు. ఒక అమ్మాయి గౌరవం పెంచేలా ఈ సిరీస్ ఉంటుంది అని అన్నారు. డైరెక్టర్ ప్రశాంత్ కుమార్, ఈటీవీ బిజినెస్ హెడ్ సాయి కృష్ణ, ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్, రాజీవ్ కనకాల, అవసరాల శ్రీనివాస్, సుచిత్ర, మేఘలేఖ, ప్రొడ్యూసర్ కోవెలమూడి సత్యసాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' ఫస్ట్ లుక్




'వడ్డే నవీన్' హీరోగా, నిర్మాతగా రూపొందుతున్న 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' ఫస్ట్ లుక్ విడుదల చేశారు. వడ్డే జిష్ణు సమర్పణలో 'వడ్డే క్రియేషన్స్' బ్యానర్ మీద వడ్డే నవీన్ హీరోగా నిర్మాతగా చేస్తున్న చిత్రం 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు', కమల్ తేజ నార్ల ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు డైరెక్టర్‌తో పాటు కథ స్క్రీన్ ప్లే ను వడ్డే నవీన్ ఈ చిత్రానికి అందించడం విశేషం. ఇక ఈ మూవీలో వడ్డే నవీన్‌కి జోడీగా రాశిసింగ్ నటిస్తున్నారు. వడ్డే నవీన్ తండ్రి శ్రీ వడ్డే రమేష్ తెలుగు సినిమా ఇండస్ట్రీలో ప్రముఖ నిర్మాత అని అందరికీ తెలిసిందే. ఆయన సంస్థ అయిన 'విజయ మాధవి కంబైన్స్' నుంచి ఎన్టీఆర్‌తో 'బొబ్బిలి పులి', మెగాస్టార్ చిరంజీవితో 'లంకేశ్వరుడు', రెబల్ స్టార్ కృష్ణరాజుతో 'కటకటాల రుద్రయ్య', ఏఎన్ఆర్ ఇంకా కృష్ణ లాంటి ఎందరో పెద్ద పెద్ద స్టార్లతో చిత్రాలు నిర్మించి 'మోస్ట్ సక్సెస్ఫుల్' నిర్మాణ సంస్థగా రూపొందింది. ఇప్పుడు ఆ నిర్మాణ సంస్థ కొనసాగింపుగా 'వడ్డే క్రియేషన్స్' అనే బ్యానర్‌ని స్థాపించి, వడ్డే నవీన్ తండ్రి బాటలో పయనించాలని నిర్ణయించుకుని ఇకపై 'వడ్డే క్రియేషన్స్ బ్యానర్'లో సినిమాలు రూపొందించాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగానే మొదట చిత్రంగా 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' నిర్మిస్తున్నారు. గత కొన్నేళ్లుగా వడ్డే నవీన్ సినిమాలకు దూరంగా ఉంటున్న సంగతి తెలిసిందే, ఇక ఆయన త్వరలోనే 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చిత్రం తో అందరిని అలరించబోతునారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ మే15 నుండి మొదలై ఇప్పటివరకు దాదాపు 80 శాతం చిత్రీకరణ పూర్తయింది.

## మహేష్ బాబు బర్త్‌డే స్పెషల్




మహేష్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను నవంబర్‌లో విడుదల చేస్తున్నారు. ఈ విషయాన్ని దర్శకుడు రాజమౌళి శనివారం మహేష్ బాబు బర్త్ డే సందర్భంగా తన సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ సినిమా షూటింగ్ ఒరిస్సా షెడ్యూల్ ఇటీవలే పూర్తయింది. దాదాపు వెయ్యి కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కె.ఎల్ నారాయణ, గోపాల్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. విజయేంద్రప్రసాద్ కథను అందించారు. అయితే మహేష్ బాబు బర్త్ డేను దృష్టిలో పెట్టుకొని ఒక ఫొటో విడుదల చేశారు. ఈ ఫొటోలో హీరో మెడలో రుద్రాక్ష, త్రిషూలం, ఢమరుకం, నంది ఆసక్తికరంగా కనిపిస్తోంది.

## 'కపుల్ ఫ్రెండ్లీ' టీజర్

సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా 'కపుల్ ఫ్రెండ్లీ'. ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్‌గా నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీ మూవీగా 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా తెరకెక్కుతోంది. త్వరలో ఈ సినిమా తెలుగుతో పాటు తమిళంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఈ టీజర్ ఎలా ఉందో చూస్తే 'నెల్లూరుకు చెందిన యువకుడు శివ(సంతోష్ శోభన్) ఇంటీరియర్ డిజైనింగ్ చేసి సరైన ఉద్యోగం లేక చెన్నై నగరంలో ఇబ్బందులు పడుతుంటాడు. ఖర్చుల కోసం బైక్ పూలింగ్ చేస్తుంటాడు. ప్రీతి (మానస వారణాసి) శివ బైక్ పై జర్నీ చేస్తుంది.




## నా మావ పిల్లనిత్తానన్నాడే సాంగ్ రిలీజ్



హీరో నాగశౌర్య అప్ కమింగ్ అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ బ్యాడ్ బాయ్ కార్తీక్. ఈ మూవీకి రామ్ దేశినా (రమేష్) దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో నాగశౌర్య జోడిగా విధి హీరోయిన్‌గా నటిస్తోంది. శ్రీ వైష్ణవి ఫిలమ్స్ బ్యానర్‌పై శ్రీనివాస రావు చింతలపూడి నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి నా మావ పిల్లనిత్తానన్నాడే సాంగ్ రిలీజ్ చేసి మ్యూజిక్ ప్రమోషన్స్‌ని కిక్ స్టార్ట్ చేశారు. ఈ సాంగ్‌ని మెలోడీ మాస్టర్ హారిస్ జైరాజ్ కంపోజ్ చేశారు. కాసర్ల శ్యామ్ రాసిన సాహిత్యం అందించగా, కారుణ్య, హరి ప్రియ తమ ఎనర్జిటిక్ వోకల్స్ తో మెస్మరైజ్ చేశారు.ఈ సాంగ్‌లో నాగశౌర్య, విధి కెమిస్ట్రీ కలర్ ఫుల్ గా వుంది. నాగశౌర్య డ్యాన్స్ మూమెంట్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సాంగ్ కి సోషల్ మీడియాలో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది.ఈ చిత్రంలో సముద్రఖని, సీనియర్ నరేష్, సాయికుమార్, వెన్నెల కిషోర్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్ కుమార్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## సీమంతం గ్లింప్స్ విడుదల




టీ అర్ డ్రీమ్ ప్రొడక్షన్స్ నిర్మాణంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'Cమంతం' నుంచి గ్లింప్స్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ గ్లింప్స్ ఇప్పటికే సినీ ప్రియుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. క్లాసిక్ థ్రిల్, ఎమోషనల్ డెప్త్ కలగలిసినట్లుగా కనిపించే ఈ గ్లింప్స్‌లో విజువల్స్, నేపథ్య సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా ప్రేగ్నెంట్ మహిళ చేతులు వెనక్కి కట్టిన దృశ్యం, రక్తపు మడుగులు, మానవత్వానికి వ్యతిరేకంగా జరిగే చర్యలు కథగ ఇది. దర్శకుడు సుధాకర్ పాణి ఈ సినిమాను కొత్తగా చూపించడానికి ప్రయత్నించినట్టు గ్లింప్స్ ద్వారా తెలుస్తోంది. ప్రశాంత్ టాటా నిర్మాతగా, గాయత్రీ సౌమ్య గుడిసెవా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సంగీత దర్శకుడు ఎస్. సుహాస్ అందించిన బ్యాక్‌గ్రౌండ స్కోర్ గ్లింప్స్‌కు బలాన్ని చేకూర్చింది.చిత్ర బృందం ప్రకారం, మూవీ త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. పూర్తి వివరాలు త్వరలో వెల్లడించనున్నట్టు కూడా తెలిపారుహీరో వజ్రయోగి ,హీరోయిన్ శ్రేయ భర్తీ నటిస్తున్నారు.

## 'ఓనమ్' పాట విడుదల




కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'కేర్యాంప్'. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్ పై ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ సినిమా నుంచి శనివారం 'ఓనమ్' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ పాటకు సురేంద్ర కృష్ణ లిరిక్స్ రాయగా, ఎనర్జిటిక్ ట్యూన్‌తో కంపోజ్ చేసి సాహితీ చాగంటితో కలిసి పాడారు . మ్యూజిక్ డైరెక్టర్ చేతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు. ఇన్ స్టా ఆపేశానే, ట్విట్టర్ మానేశానే, నీకే ట్యాగ్ అయ్యానే మలయాళీ పిల్లా, ఫోనే మార్చేశానే, ఛాటింగ్ ఆపేశానే, నీకే సింక్ అయ్యానే వదలను ఇల్లా అంటూ పాట సాగుతుంది. కేరళ పండుగ ఓనమ్ సందడి అంతా ఈ పాటలో కనిపించింది. 'ఓనమ్' పాటలో హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ యుక్తి తరేజా మాస్ స్టెప్స్ స్పెషల్ అట్రాక్షన్‌గా మారాయి.

---

## రైల్వే శాఖ పండుగ ఆఫర్

(మొదటి పేజీ తరువాయి)

డిసెంబర్ 1 మధ్య తిరిగి ప్రయాణమయ్యే వారికి ఈ డిస్కౌంట్ వర్తిస్తుందని రైల్వే శాఖ తన ప్రకటనలో తెలిపింది. తిరుగు ప్రయాణానికి అయ్యే బేస్ ఛార్జిపై మాత్రమే రాయితీ ఉంటుంది. ఈ స్కీమ్‌పై వచ్చే రాయితీలకు ఎఆర్‌పి నిబంధనలు వర్తించవు. అంతేగాక, ఈ ప్యాకేజీ కింద తీసుకున్న టికెట్లను రద్దు చేసుకోవడానికి వీలు లేదు. చార్జీల వాపసు ఉండదు. దీని ప్రభావం ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి, ప్రయోగాత్మకంగా పథకాన్ని అమలు చేస్తున్నట్టు భారతీయ రైల్వే పేర్కొంది.

## జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణకు కాంగ్రెస్ డిమాండ్

### శ్రీనగర్‌లో నిరాహార దీక్ష ప్రారంభం
### 21 వరకు ఆరు దీక్షలు
### లదాఖ్‌కు హోదా కోసం కార్గిల్‌లో కెడిఎ, ఎల్‌ఎబి నిరశన

**శ్రీనగర్/కార్గిల్:** జమ్మూకశ్మీర్‌కు సంపూర్ణ రాష్ట్ర హోదా పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ డిమాండ్ చేసింది. జమ్మూకశ్మీర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్వర్యంలో శ్రీనగర్‌లో శనివారం నిరాహార దీక్షను చేపట్టింది. ఎంఎ రోడ్డులోని పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద దీక్షను జేకేపీసీసీ తారిక్ కర్రా ప్రారంభించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి గులాం అహ్మద్ మీర్, పార్టీ ఎమ్మెల్యేలు దీక్షలో కూర్చున్నారు. ఆదివారం జమ్మూలోనూ దీక్ష చేయనున్నారు. 'మా రాజ్యం, మా అధికారం' నినాదంతో జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం డిమాండ్‌తో నిరహార దీక్షను కాంగ్రెస్ నేతలు చేపట్టారు. మరోవైపు లదాఖ్‌కు రాష్ట్ర హోదా, ఆరవ షెడ్యూల్ విస్తరణ కోసం డిమాండ్‌తో కార్గిల్ డెమొక్రటిక్ అలయెన్స్ (కేడీఏ), లేహ్ అపెక్స్ బాడీ (ఎల్‌ఏబీ) అధ్వర్యంలో కార్గిల్‌లోని హుస్సేనీ పార్కులో మూడు రోజుల దీక్ష ప్రారంభమైంది. లదాఖ్‌ను దాఖ్ పరిపాలించేలా భవిష్యత్‌ను కలిసి నిర్మించుకుందామన్న నినాదంతో నిరశన జరిగింది. 'వలసవాదాన్ని అంతం చేసి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలి. రాష్ట్ర హోదా కల్పించాలి, ఆరవ షెడ్యూల్‌లో చేర్చాలి. లదాఖ్ మరింత బలోపేతం కావాలి' అన్న ప్లకార్డులు, నినాదాలతో నిరసన దీక్ష జరిగింది. ఇదిలావుంటే, శ్రీనగర్‌లో కాంగ్రెస్ ప్రారంభించిన దీక్ష సందర్భంగా జేకేపీసీసీ అధ్యక్షుడు తారిక్ విలేకరులతో మాట్లాడుతూ 'దిల్లీలోని గుడ్డి, చెవిటి, మూగ ప్రభుత్వాన్ని మేల్కొలిపేందుకే మా పోరాటం'అని అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం జరిగిన రోజును తమ దీక్ష ప్రారంభానికి ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు. ఈనెల 9 నుంచి 21వ తేదీ వరకు జమ్మూకశ్మీర్‌లోని వేర్వేరు జిల్లాల్లో ఆరు నిరాహార దీక్షలు జరుగుతాయని వెల్లడించారు. 1.40 కోట్ల మంది జమ్మూకశ్మీర్ ప్రజల ఆశలు, ఆకాంక్షల కోసమే శాంతియుత నిరశనను చేపట్టినట్లు చెప్పారు. పార్లమెంటు సమావేశాల వేళ జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణపై సానుకూల సమాచారం కోసం వేచివున్నట్లు తెలిపారు.

## కాపాడే బాధ్యత ప్రభుత్వాలదే

(మొదటి పేజీ తరువాయి)



పిలుపునిచ్చారు. ఆశయ సాధన కోసం, మంచి కోసం, న్యాయం కోసం తన ప్రాణాలను అర్పించాడని, ఆయన మార్గాన్ని విడవకుండా సమ సమాజ న్యాయం కోసం పోరాటాలను కొనసాగిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొత్వాల శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, కాంగ్రెస్ పార్టీ పాల్వంచ పట్టణ, మండల అధ్యక్షులు నూకల రంగారావు, కొండల వెంకన్న గౌడ్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు డి. సుధాకర్, నిమ్మల రాంబాబు, అన్నారపు వెంకటేశ్వర్లు, పెద్దమ్మతల్లి దేవస్థానం పాలక మండల సభ్యులు శనగారపు శ్రీనివాసరావు, చెరుకూరి శేఖర్‌బాబు, నాయకులు మన్నెం వెంకన్న, మాజీ ఎంపిటిసి మోహనరావు, మాజీ సర్పంచ్ బానోత్ విజయ్, రంజిత్, జక్కుల లింగేశ్వర్, వల్లపు యాకయ్య, జమ్ముల రాజశేఖర్, ఆవుల సతీష ఇల్లందులపాడు తండా మాజీ సర్పంచ్ రమేష్, సిహెచ్ శ్రీను, జకరయ్య, రామాచారి, బొమ్మన సత్యనారాయణ, బొల్ల క్రిష్ణ, బానోత్ లచ్చిరాం, కొమరం భీమ్ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు పొడియం వీరస్వామి, రాములు, ధనుసరి మోజెస్, కుర్సు వీరభద్రం, మైసా రాము, తోలం బాబురావు, సత్యం పద్మారావు, సహదేవుడు, మంగమ్మ, మహేష్, క్రిష్ణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు పూడిక ముప్పు



### రోజు రోజుకూ నీటి నిల్వ సామర్థ్యం కోల్పోతున్న రిజర్వాయర్
### పరిష్కార మార్గం ఉన్నట్లా..? లేనట్లా?

**ప్రజాపక్షం/నందికొండ:** సాగర్ ప్రాజెక్టు 195668 మధ్య నిర్మాణం జరుగగా నాటి నుంచి నేటి వరకు దాదాపు 70 ఏళ్లలో చేరిన పూడిక సుమారు 112 టీఎంసీల పైచిలుకు నీటి నిల్వలు ఉండే ప్రాంతం పూడికతో నిండి పోయింది. దీనితో జలాశయం రోజు రోజుకూ నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోతోంది. సిరులు కురిపిస్తున్న సాగర్ జలాశయంలో రోజురోజుకు నీటి నిల్వలు తగ్గుతుండటంతో నీటి రంగ నిపుణులు పర్యావరణవేత్తలు ఆందోళనలు చెందుతున్నారు రిజర్వాయర్ పూర్తి సామర్థంలో ఉన్నప్పుడు 408 టీఎంసీల నీటిని నిల్వ చేసేది ప్రస్తుతం 312 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేస్తుంది అంటే దాదాపు 96 నుంచి 100 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోయింది. కృష్ణా నది పరివాహకం 2,58,948 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉండగా, ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీటితో పాటు ఒండ్రు మట్టి, ఇసుక ఏటా నాగార్జునసాగర్ జలాశయంలోకి వచ్చి చేరుతోంది. అదే విధంగా నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఎత్తయిన గుట్టలపై నుంచి వచ్చే వరద నీటితో పాటు రాళ్లు, రప్పలు కృష్ణ నదిలోకి వచ్చి చేరుతున్నాయి. వరద అధికంగా వచ్చే సమయంలో నదీ తీరాలను ఒరుసుకుంటూ వచ్చే నీటి ఉధృతితో తీరాలు కోతకు గురై చెట్లు, చేమలు, మట్టి కొట్టుకొని వచ్చి ఏటా జలశయంలోకి చేరుతోంది. జలాశయంలో నిండుగా నీరున్నపుడు గుట్టలు నదిలోకి కూలి పూడిక పెరిగిపోవడంతో జలాశయం నుంచి మాత్రం ఒక్క తట్ట మట్టి గానీ, ఏ ఒక్క రాయి కూడా బయటికి వెళ్లడం లేదు. దీంతో పూడిక పెరిగి నీటి నిల్వ సామర్థం తగ్గుతోంది. పూడికకు నివారణ చర్యలు చేపట్టకపోతే భవిష్యత్ ఏడారిగా మారే అవకాశం ఉందని నీటి రంగ నిపుణులుఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**తగ్గుదల ఇలా..**

నాగార్జునసాగర్ జలాశయ నిర్మాణ సమయంలో నీటి నిల్వ సామర్థం 408.24టీఎంసీలు ఇది 2010 నాటికి 312.1456 టీఎంసీలకు తగ్గింది. సాంకేతిక నీటి రంగ నిపుణులు తెలిపిన వివరాల ప్రకారం 1967 నుంచి 1974 నాటికి 14.4 టీఎంసీలకు నీటి నిల్వ సామర్థం తగ్గింది. 1978 నాటికి 48.7టీఎంసీలకు, 20012009 నాటికి 79.21 టీఎంసీల నీటి నిల్వ సామర్థం తగ్గింది. 2009 అక్టోబరు నెలలో కృష్ణా నదికి వచ్చిన భారీ వరదల్లో ఎక్కువ మొత్తంలో బురద కొట్టుకు వచ్చింది. నాడు 25లక్షల క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరింది. అంటే ఆ సమయంలో నదిలోకి ఎంత మేర బురద వచ్చి చేరిందో అంచనా వేయడం కూడా కష్టం. 2010 నాటికి నీటినిల్వ సామర్థం 96.05 టీఎంసీలకు, 2016 నాటికి అది సుమారు 108 టీఎంసీలు, 2020 నాటికి 110 టీఎంసీలు, ఈ ఏడాది మార్చి నాటికి సుమారు 112టీఎంసీల పైచిలుకు సాగర్ నీటి నిల్వ సామర్థం తగ్గి ఉండవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**పూడిక నివారణకు నిపుణుల సూచనలు**

పూడికను తొలగించడం అనేది జరగదని, పూడిక తీసే ఖర్చుతోటి మరో ప్రాజెక్టు నిర్మించవచ్చని దీనికి కేవలం నివారణ ఒక్కటే మార్గం అని సాంకేతిక నిపుణులు సూచిస్తున్నారు. వీరిచ్చిన సూచనలు ఇలా ఉన్నాయి. జలాశయానికి ముందు మినీ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని. వరద ప్రవాహ తీవ్రత ఎక్కువగా ఉన్న చోట మట్టి నిలిచేందుకు అడ్డుకట్టలు వేయాలని. గుట్టల మీదుగా వచ్చే వరదతో పాటు కొట్టుక వచ్చే రాళ్లు, మట్టిని నివారించేందుకు రాతి కట్టడాలు నిర్మించాలని. జలాశయంలో నీరు తగ్గిన సమయంలో ప్రాజెక్టు తీరాల్లో ఉన్న ఆయకట్టేతర ప్రాంతాల్లోని మెట్ట భూముల్లోకి ఒండ్రు మట్టిని ప్రభుత్వ ఖర్చులతో తరలించాలి. నది మధ్యలో ఉన్న గుట్టల చుట్టూ రాళ్లు నదిలోకి పడకుండా జాలీలు ఏర్పాటు చేయాలని తెలిపారు.

### ఏ క్షణంలోనైనా గేట్లు తెరుచుకునే అవకాశం




నాగార్జునసాగర్ రిజర్వాయర్ నీటిమట్టం శనివారం సాయంత్రానికి 590 అడుగుల గరిష్ట మట్టాన్ని చేరుకుంది. దీనితో ప్రాజెక్టే ట్లను ఏక్షణంలో నైనా తెరిచే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. శ్రీశైలం నుంచి ఇన్ ఫ్లో కొనసాగుతూ ఉండటంతో రిజర్వాయర్ నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉన్నందు రిజర్వాయర్ గరిష్ట నీటి మట్టాన్ని కొనసాగిస్తూ ప్రాజెక్టుకుఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు వస్తున్న ఇన్ ఫ్లో మొత్తాన్ని దిగువకు విడుదల చేసేందుకు ప్రాజెక్టు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ప్రాజెక్టుకు వస్తున్న ఇన్ ఫ్లో ను బట్టి శనివారం రాత్రికే గేట్లు తెరుచుకునే అవకాశం ఉంది. సాగర్ రిజర్వాయర్ సమాచారం. నాగార్జున సాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి గరిష్ట నీటిమట్టం 590 అడుగులకు 590 అడుగులుగా ఉండి నీటి నిల్వ సామర్థం 312.0450 టిఎంసిలకు 312.0450 టీఎంసీలుగా ఉన్నది. కుడి కాలువ ద్వారా 6041 క్యూసెక్కులు ఎడ మ కాలువ ద్వారా 7436 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసిఏఎంఆర్‌పి ద్వారా 1800క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతూ ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 29070 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్‌కు 44647 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరుతూ ఉంటే అంతే మొత్తాన్నిఅవుట్ ఫ్లోగా దిగువకు విడుదలవుతుంది.

## చావనైనా చస్తాం (మొదటి పేజీ తరువాయి)

వారిని నిర్మూలించడం, బందీలను విడిపించి ఇజ్రాయెల్ తీసుకువెళ్ళడం, గాజాలో ఎప్పటికీ పాలస్తినా సైన్యం ఉనికిలేకుండా చూడటం, ఆ ప్రాంత భద్రతను తమ నియంత్రణలో ఉంచుకోవడం, హమాస్, పాలస్తినా అథారిటీ పెత్తనంలేని ఒక పౌర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అనేక ఐదు సూత్రాలను గాజా ఆక్రమణ ద్వారా ఆచణలోకి తీసుకువస్తామని ఇజ్రాయెల్ ప్రకటించింది. గాజా ఆరోగ్యమంత్రిత్వశాఖ గణాంకాల ప్రకారం 22 నెలల యుద్ధంవల్ల గాజాలో 61,379 మంది మరణించారు. మరో 1,52,890 మంది గాయపడ్డారు. గడచిన మే నెల నుండి ఆహార కేంద్రాలవద్ద ఆహారంకోసం ఎదురుచూస్తున్న ప్రజలపై జరుగుతున్న రోజువారీ కాల్పుల్లో 1,772 మంది మరణించారు. సుమారు 200 మంది ఆకలి మరణాలకు గురయ్యారు.

## లెక్కచేయని ఇజ్రాయెల్ (మొదటి పేజీ తరువాయి)

మరోసారి చెప్పారు. గాజా సిటీని స్వాధీనం చేసుకోవాలని, పూర్తిగా పాలస్తినా భూభాగాన్ని సైన్యం ఆక్రమణలోకి తీసుకురావాలని ఇజ్రాయెల్ సెక్యూరిటీ క్యాబినెట్ గురువారం తీసుకున్న నిర్ణయాన్ని రక్షణమంత్రి కట్జ్ సమర్థించుకున్నారు. తమ లక్ష్యం పూర్తయ్యేవరకూ గాజా తమ అధీనంలోనే ఉంటుందని, పాలస్తినాను పరిపాలించాలనే ఉద్దేశం తమకు లేదని, ఆ ప్రాంతాన్ని హమాస్ ప్రమేయం లేని పౌర ప్రభుత్వానికి స్వాధీనం చేస్తామన్న నెతన్యాహూ ప్రకటనను ఉద్ఘాటించారు. ఐతే ఎంతకాలం గాజాను తమ అధీనంలో ఉంచుకుంటారన్న విషయాన్ని ఆయన తేల్చిచెప్పలేదు. బ్రహ్మాండమైన శక్తిని ఉపయోగించి అన్నివేళ్ళను ఐక్యంగా ముడిచి ప్రయోగించే బలమైన ముష్ఠిఘాతాన్ని శత్రువు చవిచూడాలని కట్జ్ అన్నారు. ఇజ్రాయెల్‌లో యుద్ధ విస్తరణను బ్రిటన్, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్ తదితర దేశాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

**బందీల మరణాలు, పన్నులభారం ఇజ్రాయెల్ ప్రతి–పక్షం హెచ్చరిక**

సెక్యూరిటీ క్యాబినెట్ నిర్ణయాన్ని ఇజ్రాయెల్ ప్రతిపక్షం 'యెష్ అటిడ్ ' నాయకుడు యైర్ లాపిడ్ తీవ్రంగా విమర్శించారు. నెతన్యాహూ నిర్ణయం బందీల మరణాలకు దారితీస్తుందని, ప్రజలపై విపరీతమైన పన్నుల భారాలకు దారితీస్తుందని హెచ్చరించారు.సైన్యం, భద్రతా అధికారుల మాటలు లెక్కలోకి తీసుకోకుండా, సైన్యం అలసిపోయిన విషయాన్ని గుర్తించకుండా నెతన్యాహూ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. దీనివల్ల విపరిణామాలొస్తాయన్నారు. ఇజ్రాయెల్ ప్రజలపై 10 వేల బిలియన్ డాలర్లు పన్నులభారం పడుతుందని, అలసిపోయిన సైనికులు హత్యలకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తొందరపాటు చర్యలవల్ల రేపే ఏం జరుగుతుందో తెలియకుండా నిర్ణయం తీసుకోవడంవల్ల ఎటు వెళతామో తెలియని పనికిరాని ఆక్రమణ చర్యల్లో చిక్కుకుంటామని యైర్ లాపిడ్ అన్నారు. బందీల కుటుంబాలు కూడా నెతన్యాహూ నిర్ణయంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. దాదాపు 50 మంది ఇంకా హమాస్ వద్ద బందీలుగా ఉన్నారు. కానీ వీరిలో సగంమంది మాత్రమే సజీవంగా ఉన్నట్లు అంచనా. అదేవిధంగా బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్మర్ కూడా ఒక హెచ్చరికచేస్తూ గాజా పూర్తి ఆక్రమణ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరారు. జర్మనీ కూడా హెచ్చరిస్తూ, తమ నుండి వెళ్ళే సైనిక సహాయంలో ఒక్క సామాగ్రి కూడా ఇజ్రాయెల్‌కు మళ్ళకుండా చూస్తామని చెప్పింది. జర్మనీ నుండి ఇజ్రాయెల్‌కు ఆయుధ సామాగ్రి ఎగుమతులను తక్షణం నిలిపివేస్తున్నట్లు జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ శనివారం ప్రకటించారు. ఆస్ట్రేలియా, చైనా కూడా నెతన్యాహూకు హితవు చెప్పాయి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com